ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 190 పేజీలు: 8+4 వెల: 8.00

**లోయలో పడిన బస్సు: ఏడుగురు మృతి**

**భారత్‌పై అమెరికా 100% టారిఫ్‌ల భారం**

5లో

# రెండు మెగా ప్రాజెక్టులు ఈ నెలలోనే

### వెలుగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నెలాఖరులోగా ఆరంభం

### అమరావతికి చెందిన రెండు ప్రాజెక్టులు కూడా ఈ నెలలోనే

### ఉన్మాద చర్యలను చూస్తూ ఊరుకోం

### ఎమ్మెల్యే క్వార్టర్స్‌కూడా త్వరలో అందుబాటులోకి: సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు8, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేసుకునే హక్కు ఎవరికైనా ఉందని సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హక్కు అనే సాకుతో ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా చేసే నిరసనలను ఏమాత్రం సహించమని వైసీపీ నేతలను ఆయన హెచ్చరించారు. చట్ట వ్యతిరేకంగా ఏం చేసినా ఉపేక్షించబోమన్నారు. డిఎస్సీలో అవకతవకలు జరిగాయంటూ తప్పుడు ప్రచారాన్ని ప్రత్యర్థి రాజకీయపక్షం చేస్తుందన్నారు. ఆధారాలు చూపిస్తే విచారిస్తామంటే ఈ వ్యవహారంతో సంబంధంలేని రౌడీ మూకలతో ఆందోళనలు చేస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారన్నారు. ఈ రకమైె ఉన్మాద చర్యలనుచట్టం చూస్తూ ఊరుకోదు కదా అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చంద్రబాబు ఇష్టాగోష్టిలో మాట్లాడారు. "చట్ట వ్యతిరేకంగా ఏం చేసినా ఉపేక్షించాం అన్నారు., ప్రజలను ఇబ్బంది పెట్టేలా నిరసనలు ప్రభుత్వం ఒప్పుకోదు. బస్టాండ్లు, రహదారుల వెంబడి నిరసనలుఅంటే ప్రభుత్వం ఊరుకోదు. గొడ్డలి పార్టీ నిరసనల్లో రౌడీలు, గంజాయి బ్యాచ్‌లే ఉన్నారు. రౌడీలు, గంజాయి బ్యాచ్‌లు తప్ప ఒక్కరైనా డిఎస్సీ అభ్యర్థి ఉన్నారా. కర్నూలులో ఇవాళ కదం తొక్కిన వారంతా మెగా డిఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లే. గొడ్డలి పార్టీ చేసే నష్టం వల్ల, ఐక్యంగా టీచర్లు తమ ఆత్మగౌరవం చాటారు" అని సిఎం చంద్రబాబు అన్నారు. రేయింబవళ్లు కష్టపడి ఉద్యోగం తెచ్చుకున్న వారిపై విషప్రచారం చేస్తూ మానసిక వేధింపులకు గొడ్డలిపార్టీ గురి చేయడాన్ని నిరసిస్తూనే ఐక్యంగా గళమెత్తారన్నారు. పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీని రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్న వారిపై ఇదో తిరుగుబాటని వివరించారు.



ఈ ఆగస్టు నెలాఖరులోగా రెండు ప్రధాన ప్రాజెక్టులు ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు వివరించారు. వెలుగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అనకాపల్లి వరకూ ఈ నెలలోనే సాకారమవుతాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని వచ్చే యేడాది విశాఖ వరకూ తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే ఈ నెలలోనే అమరావతికి సంబంధించి రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభవుతాయని సిఎం చంద్రబాబు వివరించారు. సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభంతో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వర్షాకాలంలోనూ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల రెండు రోజుల్లో శ్రీశైలం జలాశయం నిండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత నాగార్జున సాగర్‌కూ నీరు వచ్చే అవకాశంఉందని సిఎం చంద్రబాబు వివరించారు. ఆర్థిక వ్యవహారాలపై విడుదల చేసిన శ్వేత >>2

## అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్లకు రూ. 206 కోట్లు

**విజయవాడ, ఆగస్టు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని పరిధిలో నిర్మిస్తున్న అసెంబ్లీ, హైకోర్టు భవనాల్లో మార్పులు, కన్సల్టెంట్ల నియమాకం కోసం ఫాస్టర్స్ పార్టనర్సు అదనంగా రూ.38.18 కోట్లు చెల్లించేందుకు పట్టణాభివృద్ధి శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఆర్డిఎ అథారిటీ 64వ సమా వేశంలో 682వ తీర్మానంపై తీసుకున్న నిర్ణయం మేరకు ఈ చర్య తీసుకుంటున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లె క్స్‌లో హైకోర్టు బిల్డింగ్ బిల్ట్‌అప్ విస్తీర్ణం పెరగడం వల్ల కన్సల్టెన్సీ పరిధి పెరిగిందని తెలిపారు. అలాగే అదనపు స్పెషలిస్ట్ కన్సల్టెంట్ల నియామకం కోసం సవరించిన ప్రాజెక్ట్ షెడ్యూల్ ప్రకారం కాంట్రాక్ట్ మారకపు రేటు వ్యత్యాసం, జిఎస్టీ కోసం అదనపు బడ్జెట్ కేటాయింపు చేసినట్లు తెలిపారు. ఫాస్టర్ పార్ట్నర్స్ లిమిటెడ్ కంపెనీకి చెల్లించాల్సిన కాంట్రాక్టు బాధ్యతపై మారకపు రేటు రూ.109 నుండి రూ.128కి పెరిగిందని అందువల్ల రూ.3.67 కోట్ల అదనపు బడ్జెట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తంగా విదేశీమారకద్రవ్య వ్యత్యాసంకలిపి జిఎస్టీ కాకుండా అదనంగా రూ.38.18 కోట్ల భారం పడుతుందని >>2

# జలధార, జలహారతి నిరంతరం

**మంచినీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళిక**

**వర్షపాతం 39% మేర లోటు**

**ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాలి: సిఎం చంద్రబాబు**

**విజయవాడ ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి:** జలధార, జలహారతి కార్యక్రమాన్ని నిరంతర కార్యక్రమంగా చేపట్టాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం అంచనాలకు మించి ఉన్నందున నీటి వనరుల పరిరక్షణ, తాగు నీటి సరఫరా, పంటల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జలధార, జలహారతి కార్యక్రమంపై శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సిఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జలధార- జలహారతి కింద మొత్తంగా 82,865 పనులను గుర్తించగా..79,826 పనులు పూర్తి చేసినట్టు అధికారులు సిఎంకు వివరించారు. మొత్తం రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం వంటి పనులను చేపట్టినట్టు స్పష్టం చేశారు. ఈ యేడాది ఎల్‌నినో తీవ్ర స్థాయిలో ప్రభావం చూపుతుందని అంచనాలు ఉన్నాయని తద్వారా వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జూన్-డిసెంబర్ మధ్య సాధారణ వర్షపాతం 867 మిల్లీ మీటర్ల మేర నమోదు అవుతుందని ప్రస్తుతం 525 మి.మీ. మాత్రమే నమోదు అవుతుందన్న అంచనాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆగస్టులో 56 శాతం మేర లోటు వర్షపాతం ఉండే ప్రమాదం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ బేసిన్లల్లో ప్రస్తుతం 563.05 టిఎంసిల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని...గత యేడాది ఇదే సమయానికి 825.67 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఆగస్టు నుంచి భూగర్భజల మట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలు ఉండటంతో తాగు నీటి నిల్వలు, సరఫరాపై పక్కాగా ప్రణాళికలు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి తదితర రిజర్వాయర్లలో తాగు నీటి అవసరాల కోసం నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టండి..**

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదని..ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకుని రిజర్వాయర్లను వీలైనంత మేర నింపాలని సూచించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటివనరులను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంచి నీటి వసతి పూర్తిస్థాయిలో అందుబాటులోలేని ప్రాంతాలనుగుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటిని సరఫరాచేసేందుకు ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతల మేరకు వినియోగిస్తూ పంటలకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లోనూ పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు తెలిపారు. నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సిఎం సూచించారు.

**పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు**

వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. పశువులకు అవసరమైన మేత, నీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



**యుపిఐ చెల్లింపులపై ఛార్జీలుండవు..**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** యుపిఐ లావాదేవీలపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించినా ఆ భారం వినియోగదారులపై ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఎండిఆర్ అమలుపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆమె వెల్లడించారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన విమర్శలకు ఎక్స్ వేదికగా స్పందించిన సీతారామన్ ఎండిఆర్ కేవలం వ్యాపారులకే వర్తిస్తుందని, కస్టమర్ల నుంచి వసూలు చేయబోమని పేర్కొన్నారు. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతులు, భద్రత, సాంకేతికతలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఎండిఆర్ తోడ్పడుతుందని తెలిపారు. యుపిఐపై ఎండిఆర్ విధించే అంశాన్ని పార్లమెంట్‌లో పన్నుల మరియు ఇతర చట్టాల (సవరణ) బిల్లు2026 ఆమోదం పొందిన తర్వాత పరిశీలిస్తామని మంత్రి చెప్పారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) నేతృత్వంలోని యుపిఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఈ అంశంపై చర్చిస్తుందని వివరించారు. >>2



**విద్యా సర్టిఫికెట్లకు విలువ ఉందా?**

**ఉద్యోగాలు లేనప్పుడు ఏం ప్రయోజనం?**

**ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాహుల్ ఫైర్**

**ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 8:** దేశంలో విద్యా సర్టిఫికెట్లకు ప్రస్తుతం పెద్దగా విలువ లేకుండా పోతోందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో శనివారం నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యా అర్హతలు ఉద్యోగాలు కల్పించలేకపోతున్నప్పుడు వాటికి అర్థం >>2



శనివారం విజయవాడలో నాటక అకాడెమీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

## కళాకారుల ఆత్మగౌరవం నిలబెడతాం

**పౌరాణిక, సాంఘిక నాటకాలకు పూర్వ వైభవం తెస్తాం**

**బాధ్యతలు స్వీకరించిన నాటక అకాడెమీ కొత్త సభ్యులు**

**కళాకారుల పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు**

**విజయవాడ,ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు నాటక రంగానికి, ప్రాచీన పద్య నాటకాలు, జానపద కళారూపాలకు పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ముఖ్యలక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలోని నాటక అకాడమీ నూతన సభ్యుల పదవీ బాధ్యతల స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో నూతనంగా నియమితులైన 22 మంది సభ్యులు ఈ వేదికపై బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ సభ్యులందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రతీ సభ్యుడు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, తెలుగు కళా సంస్కృతిని దశదిశలా వ్యాప్తి చేయడంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. గతంలో 13 మంది ఉన్న సభ్యుల సంఖ్యను 22కి పెంచుతూ జీవో సవరించడం వల్లే ఈ ప్రమాణ స్వీకారం కొంత ఆలస్యమైందని, "కొన్నిసార్లు రావడం లేట్ అవ్వచ్చు ఏమో కానీ రావడం మాత్రం పక్కా" అని చలోక్తి విసురుతూ, కమిటీకి త్వరలోనే అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ జాతీయ అవార్డు సాధించిన నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వయంగా కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో చర్చించి, కళాకారుల విజ్ఞప్తి మేరకు వారి గుర్తింపు కోసం ప్రత్యేక కళాకారుల పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, గ్రామస్థాయినుండి లబ్ధప్రతిష్ఠులైన కళాకారులను ఆదుకుంటామని వెల్లడించారు. అకాడమీలోని ప్రతి సభ్యునికి, కళాకారులకు అవసరమైన ప్రత్యేక వసతులు, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వంతో >>2



వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర జలాశయం

## తుంగభద్ర పరవళ్లు

**72 టిఎంసిలకు చేరిన డ్యామ్ నీటిమట్టం**

**బళ్లారి, ఆగస్టు8 ప్రభాతవార్త:** ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు చేరి పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర జలాశయం భర్తీకి కేవలం 10 అడుగులే మిగిలి ఉంది. వర్షాల కొరతతో ఆందోళన చెందుతున్న రైతాంగం ఊపిరి పీల్చుకున్నట్లు అయింది. ఆలస్యంగా నైనా ఖరీఫ్ పంటల సాగుకు మార్గం సుగమమైంది. తుంగభద్ర జలాశయం కాలువలకు పూర్తిస్థాయిలో నీరు వదిలే నేపథ్యంలో డ్యాం వద్ద మునిరాబాద్ కార్యాలయంలో ఈ నెల 11న ఐసిసి సభ జరగనుంది. ఎల్ఎల్‌సి, రైట్ బ్యాంక్, విజయనగర కాలువలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రజాప్రతినిధులు, టిబి బోర్డు అధికారులు సంయుక్తంగా చర్చించి తుంగభద్ర జలాల సద్వినియోగంపై నిర్ణయం ప్రకటించనున్నారు. బళ్లారి, కొప్పళ, రాయచూర్ మరియు విజయనగర జిల్లాలతో సహా మూడు రాష్ట్రాల్లోని 8 జిల్లాలకు జీవనాధారంగా ఉన్న తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం >>2

**ఫీజు కట్టలేదనే అవమానంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య**

2లో

## కృష్ణపై మరో ఐకానిక్ 'సిగ్నేచర్' వంతెన

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ - అమరావతి మధ్య రాకపోకలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా కృష్ణా నదిపై మరో కొత్త ఐకానిక్ 'సిగ్నేచర్' వంతెన రూపుదిద్దుకోనుంది. ఈ నిర్మాణం పూర్తయితే సీతానగరం ఘాట్ మీదుగా అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు ఎంతో సులువవుతుంది. మొత్తం 1.10 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ బ్రిడ్జిని కనకదుర్గ ఫ్లై ఓవర్‌కు సులువుగా కలిపేందుకు వీలుగా ఎలివేటెడ్ విధానంలో డిజైన్ చేస్తున్నారు. సీతానగరం ఘాట్ నుంచి కనకదుర్గ ఫ్లై ఓవర్‌ను, మచిలీపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిని (ఎన్‌హెచ్65) అనుసంధానిస్తూ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ బ్రిడ్జి ఫీజిబిలిటీ రిపోర్టు, డిపిఆర్ తయారీకి కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. రాజధానికి గేట్‌వేగా, ప్రముఖ పర్యాటక ఆకర్షణగా నిలిచేలా ఈ ప్రాజెక్టును 6 వరుసలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్త సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన భారీ నిధుల కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించనున్నారు. అమరావతికి ఒక ప్రధాన ముఖద్వారంలా (గేట్‌వే) నిలిచేలా అత్యంత అధునాతన సాంకేతికతతో ఈ వంతెనను తీర్చిదిద్దనున్నారు.

సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణం అమరావతి-విజయవాడ మధ్య రవాణా స్వరూపాన్నే మార్చివేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతూనే, ఆర్థిక, పర్యాటక రంగాల పురోగతికి బలమైన పునాదిగా నిలుస్తుందని అంటున్నారు. ప్రకాశం బ్యారేజీపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడంలో ఈ నూతన సిగ్నేచర్ బ్రిడ్జి అత్యంత కీలక పాత్ర పోషించనుంది. విజయవాడ నగర సౌందర్యాన్ని పెంచడంతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా దీని డిజైన్లను రూపొందించనున్నారు.

## శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ఆరంభం

**శ్రీశైలం ప్రాజెక్ట్ ఆగస్టు 8,ప్రభాతవార్త:** శ్రీశైలం కుడి,ఎడమ రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని జెన్కో అధికారులు ప్రారంభించారు. కుడి గట్టువిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 27,178 క్యూసెక్కుల నీరు ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 35,315 తీసుకులనీరు దిగువకు విడుదల చేయడం జరుగుతుంది. కాగా శ్రీశైలం జలాశయంకు వరద నీటి చేరికలు కొనసాగుతున్నాయి. జూరాల స్పిల్ వే నుండి 1,38,495 క్యూసెక్కుల నీరు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,5625 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లో గా శ్రీశైలం డ్యామ్ కు వచ్చి చేరుతుంది. వరద నీటి ప్రవాహ వేగంతో జలాశయంలో నీటిమట్టం పెరుగుతుంది.

# కర్నూలులో కదంతొక్కిన టీచర్లు



శనివారం కర్నూలులో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

- మెగా డిఎస్సీపై దుష్ప్రచారం తగదంటూ ఉపాధ్యాయుల ఆత్మగౌరవ ర్యాలీ
- నియామకాలపై ఆరోపణలు సహించబోమని హెచ్చరిక
- వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

**కర్నూలు, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మెగా డిఎస్సీపై వైఎస్సార్సీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ఉపాధ్యాయులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మూడు జిల్లాల నుంచి కర్నూలుకు చేరుకున్న టీచర్లు ఆత్మగౌరవ ప్రదర్శన పేరుతో కదం తొక్కారు. కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. మెగా డిఎస్సీ 2025పై వైఎస్సార్సీ చేస్తున్న తప్పుడు ఆరోపణలపై ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి కర్నూలుకు భారీగా తరలివచ్చిన టీచర్లు కొండారెడ్డి బురుజు వద్ద వైఎస్సారీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొండారెడ్డి బురుజు ఎక్కి తమ నియామకాలపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. మెగా డిఎస్సీ-2025 నియామకాలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ నూతన ఉపాధ్యా యులు కర్నూలులో భారీ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డి బురుజు వద్ద >>2



శనివారం న్యూఢిల్లీలో 'ఇండియా మెడికల్ డివైజెస్- 2026' కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి జెపి నడ్డా

# డిజైన్లకు రూ. 206 కోట్లు

>> వివరించారు. ఈ మొత్తాన్ని కలపడం ద్వారా రూ.175.08 కోట్ల నుండి రూ.206.59 కోట్లు అవుతుందని జిఓలో పేర్కొన్నారు.

**క్వాంటం టవర్ల కోసం రూ.1002 కోట్లు**

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు ఇరువైపులా ట్విన్ ఆఫీస్ టవర్స్ నిర్మాణం కోసం ఎల్ అండ్ టికి పనులు అప్పగించారు. దీనికోసం రూ.1002 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవ అంచనా వ్యయం రూ.958.40 కోట్లని 4.60 శాతం ఎక్కువకు కేటాయించడం వల్ల వ్యయం పెరిగిందని పేర్కొన్నారు.

**అమరావతి ఐకి భూ కేటాయింపులు పెంపు.**

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్, డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ ట్రాన్స్ఫర్ ప్రాతిపదికన అమరావతిలో చేపట్టనున్న "అమరావతి ఐ (అబ్జర్వేషన్ వీల్) అభివృద్ధి" కోసం భూ కేటాయింపులను పెంచారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. సాంకేతిక అవసరాలను తీర్చడానికి ఎక్కువ వ్యాసం కలిగిన అబ్జర్వేషన్ వీల్స్‌ను ఎంచుకునే బిడ్డర్లకు అదనపు భూమి కేటాయింపుతో రీటెండర్ పిలవడానికి ఎజిఐసిఎల్‌కు అనుమతి ఇచ్చారు. గరిష్టంగా 10 ఎకరాల పరిమితికి లోబడి అవసరమైనంత అదనపు భూమిని కేటాయించాలని నిర్ణయించారు. 28 మీటర్ల నుండి 175 మీటర్ల కంటే తక్కువ వ్యాసం ఉన్న వీల్‌కు ఆరు ఎకరాలు, 175 మీటర్ల నుండి 200 మీటర్ల కంటే తక్కువ వ్యాసం ఉన్న వీల్‌కు ఎనిమిది ఎకరాలు, 200 మీటర్ల నుండి 250 మీటర్ల వరకు వ్యాసం ఉన్న వీల్‌కు తొమ్మిది ఎకరాలు 250 మీటర్లు అంతకంటే ఎక్కువ వ్యాసం ఉన్న వీల్‌కు పది ఎకరాలు కేటాయించవచ్చని తెలిపారు. దీనిలో సగం వీల్‌కోసం సగం వాణిజ్య అవసరాల కోసం వాడుకోవచ్చని తెలిపారు. ఈ పద్ధతిలో ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేసి అవసరమైతే కొత్త టెండర్లు పిలవడానికి అవకాశం కల్పించినట్లు జిఓలో పేర్కొన్నారు.

# సిఎం విజయ్ ప్లాన్‌కు డిఎంకె చెక్!

**చెన్నై, ఆగస్టు 8:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఏదీ కలిసి రావడంలేదు. తాజాగా త్రిష వ్యవహారంలో విపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేసి, తిరిగి కోర్టులో ఆయన్ను విచారించి వదిలేస్తామని చెప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత డీలిమిటేషన్ బిల్లు విషయంలో రాష్ట్ర ఎంపీల్ని ఏకం చేసి తమిళనాడు ప్రతినిధిగా కేంద్రం దగ్గర మార్కులు కొట్టేద్దామని విజయ్ వేసిన భారీ ప్లాన్ కాస్తా అట్టర్ ఫ్లాప్ అయ్యేలా కనిపిస్తోంది. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ మహిళా బిల్లు సహా పలు కీలక బిల్లుల్ని ఆమోదింపచేసుకునేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కానీ విపక్షాలు మాత్రం అమిత్ షాను సభకు వచ్చి విద్యార్థులపై పోలీసులు చేసిన దాడులపై సమాధానం ఇవ్వాలంటూ పట్టుబడుతున్నాయి.

అదే సమయంలో డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర బిల్లుల్ని కలిపి ఇదే సమావేశాల్లో ఆమోదింపచేసుకుందామని అనుకుంటే, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తున్న ఎంపీలు, ఇతర బిల్లులకు మద్దతివ్వడం లేదు. దీంతో డీలిమిటేషన్ మహిళా బిల్లుల్ని పక్కనబెట్టి మిగతా బిల్లులు ఆమోదింప చేసుకుంటున్న కేంద్రం వాటి కోసం ఈ నెల 16,18 తేదీల మధ్య ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఇంత కీలకమైన డీలిమిటేషన్ బిల్లుకు విపక్షాల మద్దతు కీలకంగా మారింది. ఇప్పటికే తమిళనాడులో రాజకీయ పార్టీలమధ్య ఉన్న విభేదాల్ని సొమ్ము చేసుకుంటూ డీలిమిటే షన్ బిల్లును నెగ్గించుకోవాలని కేంద్రం చూస్తోంది. దీన్ని అడ్డుకునేందుకు తమిళనాడు పార్టీల్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు, తద్వారా కేంద్రం వద్ద తన సత్తా చాటుకునేందుకు విజయ్ భారీ ప్లాన్ చేశారు. తమిళనాడు ఎంపీల్ని పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించేలా ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రావాలని డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు అన్ని పార్టీల ఎంపీలకు ఆహ్వానాలు పంపారు. ఇలా తమిళనాడులో లోక్ సభ, రాజ్యసభ కలిపి మొత్తం 57 మంది ఎంపీలు ఉండగా వీరిలో కేవలం 20 మంది మాత్రమే వస్తామని చెప్పారు. డీలిమిటేషన్ ను వారు కూడా వ్యతిరేకిస్తున్నా విజయ్‌కు క్రెడిట్ ఇవ్వడం ఇష్టం లేక వారు దూరంగా ఉండబోతున్నారు. దీంతో విజయ్ ప్లాన్ కాస్తా ఫ్లాప్ అవుతోంది.

# చెల్లింపులపై ఛార్జీలుండవు

>> ప్రస్తుతం యుపిఐ, రూపే లావాదేవీలపై జీరోఎండిఆర్ విధానం అమల్లో ఉంది. ప్రతిపాదిత బిల్లు పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007లోని సెక్షన్ 10(ఏ)లో మార్పులు చేయనుంది. దీని ద్వారా భవిష్యత్తులో జీరోఎండిఆర్ విధానాన్ని మార్చే అధికారం కేంద్రానికి లభిస్తుంది.అయితే బిల్లులో ఎండిఆర్‌ను తప్పనిసరిగా విధించాలని పేర్కొనడం లేదు. ఎలాంటి రుసుము ఎంత ఉండాలనే విషయాన్నీ నిర్దేశించలేదు. భవిష్యత్తులో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఎండిఆర్ అమలు చేసేందుకు అవసరమైన చట్టపరమైన వ్యవస్థను మాత్రమే కల్పిస్తోంది.

**యుపిఐ ఉచితంగానే కొనసాగుతుంది: పేమెంట్స్ కౌన్సిల్**

యుపిఐపై జరుగుతున్న చర్చ నేపథ్యంలో పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) కూడా స్పష్టత ఇచ్చింది. 2016లో ప్రారంభమైనప్పటి నుంచి వినియోగదారులకు యుపిఐ ఉచితంగానే ఉందని, ఇకపై కూడా తక్షణ డిజిటల్ చెల్లింపులకు వినియోగదారుల నుంచి లావాదేవీ రుసుము వసూలు చేయబోరని తెలిపింది. చిన్న వ్యాపారాలు, కిరాణా దుకాణాలు యుపిఐ చెల్లింపులను స్వీకరించేందుకు ప్రస్తుతం ఎండిఆర్ చెల్లించాల్సిన అవసరంలేదని పిసిఐపేర్కొంది. చిన్నవ్యాపారులకు డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తీసుకురావడమే యుపిఐ లక్ష్యమని వివరించింది. యుపిఐపై చర్చకు స్పందించిన ఫోన్‌పే సిఇఒ సమీర్ నిగమ్ కూడా వినియోగదారులకు యుపిఐ ఉచితంగానే కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారతీయ వినియోగదారులు యుపిఐ చెల్లింపులు చేయడానికి ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు.

# మెగా ప్రాజెక్టులు ఈ నెలలోనే

>> పత్రం ప్రజల్లోకి బాగా వెళ్లిందన్నారు.ఈ పత్రం ప్రజెంటేషన్‌పై 10 గంటలు అధ్యయనం చేసినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితి ప్రజలకు వివరిస్తేనే అర్థం చేసుకుంటారని తెలిపారు.

**పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో జీరో టాలరెన్స్ పాటిస్తాం**

ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లగలిగితే, గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలే అడ్డుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన యూనిట్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు హాజరై పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డిఎస్సీ పరీక్షల నిర్వహణపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. కార్యకర్తలను నిర్లక్ష్యం చేసినా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లినా సహించేది లేదని 'జీరో టాలరెన్స్' హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా ప్రతి బూత్‌లో గతంలో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ సాధించేలా శ్రమించాలని శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గొడ్డలి పార్టీ చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని సిఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో జీరో టాలరెన్స్ పాటిస్తామని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నోటిఫికేషన్ జారీ

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నోటిఫికేషన్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ జారీ చేశారు. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభం కానున్నాయి. సభను ఎన్ని రోజులపాటు నిర్వహించాలనేది బిఎసిలు ఖరారు చేయనున్నారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు 4 రోజులపాటు జరిగే అవకాశం ఉంది. ఈ నాలుగు రోజులు కుడా అసెంబ్లీ పలు కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం చేయనున్నారు.

## హిమాచల్‌లో భారీ ఎత్తున తిరంగా యాత్ర

**సిమ్లా, ఆగస్టు 8:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నద్ధతతో హిమాలయ రాష్ట్రం ముందువరుసలో నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో శనివారం మధ్యాహ్నం తిరంగా యాత్ర అత్యంత వైభవంగా జరిగింది. బీజేపీ రాష్ట్రశాఖ ఈ వేడుక నిర్వహించింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ దీనికి నేతృత్వం వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సిమ్లాలోని సీటీఓ జంక్షన్ వద్ద ఈ తిరంగా యాత్ర ఘనంగా ప్రారంభమైంది. అక్కడి నుంచి షేర్ ఎ పంజాబ్ మీదుగా మాల్ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ ర్యాలీలో స్థానికులతో పాటు పర్యాటకులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


న్యూఢిల్లీలోని ఓఖ్లా, కాళింది కుంజ్ వద్ద రుతుపవనాల సమయంలో యమునా నది నీటిపై విషపూరితమైన నురగ దట్టమైన పొరలా తేలుతున్న దృశ్యం

# విద్యా సర్టిఫికెట్లకు విలువ ఉందా?

>> ఏముంటుందని ప్రశ్నించారు. దేశంలోని 40 కోట్ల మంది యువతే భారతదేశానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా వంటి దేశాల గురించి మాట్లాడుతున్నప్పటికీ, భారత యువత శక్తి అసమానమైనదని అన్నారు.విద్యార్థులతో తాను మూడు 'డీ'ల గురించి మాట్లాడాలనుకుంటున్నానని రాహుల్ చెప్పారు. అవి దర్ద్ (బాధ), డేటా, దౌలత్ (సంపద) అని వివరించారు. దేశంలోని ప్రతి భారతీయుడినీ ఉద్దేశించే తాను యువతను దేశానికి శక్తి, గర్వకారణంగా భావిస్తున్నానని అన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వినేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తరలివచ్చారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో పాటు ప్రాంగణంలో బురద ఉన్నప్పటికీ వారు కార్యక్రమానికి హాజరయ్యారు. రాహుల్ రాకకు ముందు ముంబైకి చెందిన ర్యాపర్లు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.కార్యక్రమానికి ముందు రోజు శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలను, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందులను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు.

# ఆత్మగౌరవం నిలబెడతాం

>>చర్చించి వనరులు సమకూరుస్తామన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన వారిలో పెంకే ప్రతిభా భారతి, కొత్తవారి శివ పార్వతి, జివి రమణ, పెంకే అన్నపూర్ణ, ఇనడ దుర్గారావు, అంబటి తవిటి నాయుడు, డక్కట కామేశ్వరరావు, వి.ఎస్.డి.ఏ లక్ష్మి, పైడిపాముల స్వప్న,ఎం. ఆంద్రేయ్య, కల్లిపల్లి గణపత్,కలగర వెంకట కృష్ణ, థామస్ లువీనా మేరీ, బి అంజలి దేవి, పల్లా విలియంకేరి, విశ్వేశ్వరరావు, బండేల పద్మ, గంగా దేవి చెల్లుబోయిన, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రేఖా జ్యోతి, మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకర శాస్త్రి, మద్దాల యేసుపాదం ఉన్నారు. కార్యక్రమంలో నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర పరవళ్లు

>> 72.264 టిఎంసిల నీరు నిల్వ ఉంది. గరిష్టంగా 1633 అడుగుల నీటి మట్టం సామర్థం కలిగిన ఈ జలాశయంలో, నీటి మట్టం శనివారం ఉదయం 8 గంటల సమయానికి 1623.68 అడుగులకు చేరుకుంది. మొత్తం 105.788 టిఎంసిల నీటి నిల్వ సామర్థం ఉన్న ఈ జలాశయంలో ప్రస్తుతం 72.264 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఈ యేడాదిలో మొదటిసారిగా, గత కొన్ని రోజులుగా జలాశయానికి వచ్చే నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినా డ్యాంకు వస్తున్న ఇన్ ఫ్లో ప్రమాణం ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 42,112 క్యూసెక్కులుగా ఉంది. కాలువల ద్వారా 1,514 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది ఇదే రోజున తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం 1626.06 అడుగులుగా ఉండగా, నీటి నిల్వ 80.003 టిఎంసిలుగా నమోదైంది. తుంగభద్ర జలాశయం పూర్తిగా నిండటానికి ఇంకా 10 అడుగుల నీటి మట్టం మాత్రమే మిగిలి ఉంది. మల్నాడు ప్రాంతంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల కారణంగా, రాబోయే వారం రోజుల్లో జలాశయం పూర్తిగా నిండుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

### ఫీజు కట్టలేదనే అవమానంతో
# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న అరవింద్ (ఫైల్)

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు8,ప్రభాతవార్త:** ఫీజు కట్టలేదని అవమానించారని స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లో గల జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న పైలా అరవింద్ (16) ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన విద్యార్థి సోదరుడు గౌతమ్ వెల్లడించిన వివరాల ప్రకారం తన సోదరుడు పైలా అరవింద్‌ను ఎంపిసి గ్రూపులో స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లో గల జూనియర్ కాలేజీలో జాయిన్ చేయడం జరిగిందన్నారు. అయితే పదేపదే తన సోదరుడు అరవింద్ పట్ల వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు మరికొంతమంది ప్రతిరోజు అవమాన రీతిగా మాట్లాడడం 1వేధించడం జరుగుతుండేదన్నారు. ఈ విషయంపై శుక్రవారం తన తండ్రి రాంబాబును తీసుకొని అరవింద్ కాలేజీకి వెళ్లగా యధావిధిగా వైస్ ప్రిన్సిపల్ అవమాన రీతిగా మాట్లాడడమే కాకుండా బయటికి పొమ్మని గట్టిగా అరిచి భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందన్నారు. దీంతో తన సోదరుడు అరవింద్ ఇంటికి వచ్చి అవమానబారాన్ని భరించలేక ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. ఫీజు కోసం తన సోదరుని పదేపదే అవమానిస్తూ ఫీజు కట్టడం చేతకాని వాడికి ఈ కాలేజీలో ఎందుకు జాయిన్ అయ్యావు అంటూ, భయభ్రాంతులకు గురిచేసి తన సోదరుడు మృతికి కారణమైన కళాశాల యాజమాన్యం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అరవింద్ సోదరుడు గౌతం, తల్లిదండ్రులు రాంబాబు, జ్యోతిలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా**

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కళాశాల యజమానిపైన కళాశాల సిబ్బందిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద భారీ ధర్మా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం గంగా సూరిబాబు మాట్లాడుతూ కళాశాల ప్రారంభమై నెలరోజులు కూడా కాకుండా ఫీజుల కోసం కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు ఏ విధంగా దౌర్జన్యంగా విద్యార్థుల మీద తల్లిదండ్రుల మీద దాడికి పాల్పడుతున్నారో విద్యార్థి అరవింద్ మృతి ఒక ఉదాహరణ అన్నారు. వెంటనే అరవింద్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కర్నూలులో కదంతొక్కిన టీచర్లు

>> ప్రారంభమైన ఈ ర్యాలీలో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పెద్ద సంఖ్యలో డీఎస్సీ-2025 ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఒక్కసారిగా టీచర్లంతా రోడ్డుపైకి రావడంతో రహదారులు కిక్కిరిశాయి. టీచర్లుగా పాఠాలు చెప్పడమే కాదు తమపై కుట్రలు చేస్తే గుణపాఠం కూడా చెబుతామంటూ నినదించారు. మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ప్రతిభ, మెరిట్ ఆధారంగానే జరిగిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తాము కష్టపడి చదివి పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించామని, తమ నియామకాలపై పదేపదే ఆరోపణలు చేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపాధ్యాయులను పావులుగా ఉపయోగించుకోవడం సరికాదన్నారు. కొండారెడ్డి బురుజుపైకి ఎక్కిన ఉపాధ్యాయులు తమ నిరసనను వ్యక్తం చేశారు. 'కష్టపడి చదివి ఉద్యోగాలు పొందాం.. ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు' అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులను రాజకీయాలకు పావులుగా మార్చొద్దు మెగా డీఎస్సీ నియామకాలపై కుట్రలు చేయొద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తమపై జరుగుతున్న ప్రచారాన్ని వైసీపీ నాయకులు నిలిపివేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గతంలో డీఎస్సీ నోటిఫికేషన్ విషయంలో విమర్శలు చేసినవారే ఇప్పుడు నియామకాలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తమ నియామక ప్రక్రియపై ఏవైనా అనుమానాలు ఉంటే వాస్తవాలను పరిశీలించి మాట్లాడాలని సూచించారు. ఇదే సమయంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ 'థాంక్యూ సిఎం సర్.. థాంక్యూ మంత్రి నారా లోకేష్" అంటూ ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ నిర్వహించి తమకు ఉద్యోగాలు కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాము ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తామని, తమ ఆత్మగౌరవాన్ని కించపరిచే ప్రయత్నాలు జరిగితే వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటామని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. 'టీచర్లుగా పాఠాలు చెబుతాం.. కుట్రలు చేస్తే గుణపాఠం కూడా చెబుతాం' అంటూ నినదించారు. మెగా డిఎస్సీ నియామకాలపై రాజకీయ ఆరోపణలు చేయకుండా వాస్తవాలను గౌరవించాలని, కొత్తగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయవద్దని వారు కోరారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు.

# 96 లక్షల మంది భారతీయులపై గల్ఫ్ యుద్ధ ముప్పు

**గల్ఫ్‌లోని భారతీయుల భద్రతపై ఆందోళన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఇరాన్‌పై అమెరికా ఇరాన్‌అమెరికా యుద్ధ ప్రభావం గల్ఫ్‌లో నివసిస్తున్న భారతీయులపై ఎక్కువ పడుతోంది. ఇపుడు వీరి భద్రత ప్రశ్నార్థకం అవుతున్నది. మధ్యప్రాచ్యంలో సుమారు 96.8 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో 95.7 లక్షల మందికి పైగా ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు). వీరిలో అత్యధికులు ఇప్పటికే యుద్ధ ప్రభావానికి గురవుతున్న ఆరు గల్ఫ్ దేశాల్లోనే ఉన్నారు. పార్లమెంట్‌కు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సమర్పించిన గణాంకాల ప్రకారం.. 2025 జనవరి నాటికి మధ్యప్రాచ్యంలో 96,79,121 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో దాదాపు లక్ష మంది భారత సంతతికి చెందినవారు కాగా, మిగిలిన వారు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులే. యూఏఈలో సుమారు 40 లక్షల మంది, సౌదీ అరేబియాలో 20 లక్షలకు పైగా, కువైట్‌లో 10 లక్షలకు పైగా భారతీయులు నివసిస్తున్నారు. ఒమన్, ఖతార్, బహ్రెయిన్‌లలో కలిపి మరో 10 లక్షలకు పైగా భారతీయులు ఉన్నారు. కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల నుంచి వెళ్లినవారే వీరిలో అధిక సంఖ్యలో ఉన్నారు.భారతీయ నిర్మాణ కార్మికులు, నర్సులు, డ్రైవర్లు, దుకాణదారులు, ఇంజినీర్లు తదితరులు పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. వారి భద్రతపై యుద్ధ తీవ్రత పెరిగే కొద్దీ ఆందోళన కూడా పెరుగుతోంది.ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే ఈ దేశాలన్నింటిలోనూ అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా ఈ స్థావరాలే లక్ష్యాలుగా మారుతున్నాయి. అదే జరిగితే అక్కడ నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులు నేరుగా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో దాడులు ప్రధానంగా సైనిక స్థావరాలకే పరిమితమయ్యాయి. భారతీయులు నివసించే నగరాలు, కార్మికుల వసతి ప్రాంతాలు ఇప్పటివరకు పెద్దగా లక్ష్యంగా మారలేదు. ఇరాన్ యుద్ధం భారత్‌కు రెండు రకాల ముప్పును తెచ్చిపెడుతోంది. ఒకవైపు ముడిచమురు ధరల పెరుగుదలతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలపై ప్రభావం పడుతోంది. మరోవైపు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న దాదాపు 96.8 లక్షల మంది భారతీయుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.యుద్ధం ప్రతిసారీ పూర్తిగా ముగిసిపోకుండా కొంతకాలం విరామం తర్వాత మళ్లీ తీవ్రరూపం దాల్చుతోంది. ఈ మానవీయ ముప్పు భారత్‌కు అత్యంత కీలకమైన సవాలుగా మారుతోంది. భారత విదేశాంగశాఖ ఎప్పటి కప్పుడు అప్రమత్తంచేస్తున్నా అమెరికా అధ్యక్షుడి వైఖరిపై స్పష్టత లేకపోవడంతో ఏనిమిషంలో ఏముప్పు వచ్చిపడుతుందోనని గల్ఫ్‌దేశాల్లోని భారతీయ కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

## వారం - వర్జ్యం

09-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ఏకాదశి ఉ.11.04 న.మృగశిర మ.2.42
వ.రా. 10.19-రా. 11.46
దు.సా. 4.49-సా. 5.40
రాహు. సా. 4.30-సా. 6.00
శుభ ఉ. 8.00-9.00

## వార్తాఫలం

**మేషం :** సంతానము మీ అభిప్రాయములలో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృషభం :** టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి. వివాదాస్పదమైన వ్యవహారములు పరిష్కారమౌతాయి.

**మిథునం :** పెట్టుబడి పెట్టిన వారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసి వస్తుంది. ప్రయాణాలు లభిస్తాయి.

**కర్కాటకం :** వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలను ప్రవేశపెడతారు. మిత్రుల కలయిక.

**సింహం :** అనేక నూతన కార్యక్రమములకు శ్రీకారం చుడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. వస్తువులను కొనుగోలు చేస్తారు.

**కన్య :** సకుటుంబ సమేతముగా విహార యాత్రలు చేస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మిత్రుల కలయిక.

**తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్ర లాభం.

**వృశ్చికం :** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**ధనుస్సు :** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చు చేస్తారు. వస్తు కొనుగోలు.

**మకరం :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. బంధువుల కలయిక.

**కుంభం :** వృత్తియందు బాధ్యతలు పెరగటంలో సమయమునకు విశ్రాంతిని తీసుకోలేరు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన యోగం. స్వల్ప ధనలాభం పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### రాష్ట్రంలో విద్యుత్తు వాహనాల కోసం
# 444 ఇవి ఛార్జింగ్ స్టేషన్లు
## పిఎంఇ డ్రైవ్ పథకం మొదటి దశలో 131 ఇవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్తు వాహనాల వినియోగం విస్తారమవుతున్న నేపథ్యంలో ఎపి ప్రభుత్వం కీలక కార్యచరణ చేపట్టింది. రాష్ట్రంలో విద్యుత్తు వాహనాలకు అందుబాటులో ఉండే విధంగా విద్యుత్తు వాహన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది.ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని తీసుకునేందు ప్రతిపాదనలను రూపొందించింది. రాష్ట్రంలో విద్యుత్తు వాహనాలు వినియోగం అధికంగా ఉండే నగరాలు,పట్టణాలను గుర్తించింది.దాంతో పాటు ప్రధానంగా జాతీయ రహదారులు మరి ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డులో నిర్దిష్ట కిలో మీటర్లు పరిధిలో అందుబాటు ఉండే విధంగా పిఎం - ఈ డ్రైవ్ కింద 444 ఇవి చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తుంది. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు వీలుగా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమైన నగరాలు, జాతీయ రహదారుల వెంట 577 ఇవి ఛార్జింగ్ కేంద్రాల్ని అందుబాటులోకి తేవాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. వాటిలో ద్విచక్ర/ఆటోలకు సంబంధించినవి 306, కార్ల ఛార్జింగ్ సేవలకు 266, బస్సులు/ట్రక్కుల కోసం 5 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది.

ఇందుకోసం సుమారు రూ.62.94 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.39.79 కోట్లు పోను మిగిలిన రూ.23.15 కోట్లను భరించేలా ప్రాజెక్టును రూపొందించింది. ప్రాజెక్టు అమలు బాధ్యతను నెడ్‌క్యాప్‌నకు అప్పగించింది. ఈ క్రమంలో నెడ్ క్యాప్ ఎపిలో పిఎం - ఈ డ్రైవ్ కింద 444 ఇవి చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపింది. పిఎంఇ డ్రైవ్ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా ఛార్జింగ్ నెట్‌వర్క్ కోసం రూ.2,000 కోట్లను కేంద్రం సబ్సిడీగా అందించనుంది. అందుకు అనుగుణంగా వివిధ రాష్ట్రాల నుంచి అందిన ప్రతిపాదనలను పరిశీలించి అనుమతులు ఇచ్చింది. ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇవి సప్లై ఎక్విప్‌మెంట్‌కు చేసే ఖర్చులో నిబంధనల ప్రకారం సబ్సిడీ ఇవ్వనుంది. ఏ రాష్ట్రమైతే ముందుగా పూర్తిచేస్తుందో దానికే సబ్సిడీ అందేలా నిబంధనను విధించింది.

మూడు డిస్కంల పరిధిలో రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశమున్న ప్రదేశాలు ముఖ్యమైన నగరాలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ భూముల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అనువైన లొకేషన్లను అధికారులు పరిశీలించారు. 444 లొకేషన్లలో పిఎంఇ డ్రైవ్ కింద ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వీలుగా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు నెడ్‌క్యాప్ ప్రతిపాదన పంపింది. రాష్ట్రంలో ప్రాజెక్టు అమలుకు నోడల్ ఏజెన్సీగా బిహెచ్ఇఎల్‌ను కేంద్రం ఎంపిక చేసింది. నెడ్‌క్యాప్ పంపిన వాటిలో 244 లొకేషన్లలో ఫీజబులిటీ ఎసెస్‌మెంట్‌ను ఆ సంస్థ నిర్వహించింది. పథకం మార్గదర్శకాల మేరకు స్పేస్, యాక్సెస్, విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సదుపాయం, అదనపు సివిల్ పనులు, సైట్ విజిబులిటీ వంటి అంశాలను పరిశీలించి మొదటి దశలో 131 లొకేషన్లలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది. అందుకు అనుగుణంగా రివైజ్డ్ ప్రతిపాదనలను నెడ్ క్యాప్ పంపింది. మిగిలిన 200 లొకేషన్లను రెండోదశలో పరిశీలించనున్నారు.

## అమరావతిలో భవనాల అనుమతి ఫీజుల్లో రాయితీ

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పర్యావరణహిత భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు అభివృద్ధి, అనుమతి ఫీజుల్లో భారీ రాయితీలను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు కేవలం బహుళ అంతస్తుల భవనాలకే పరిమితమైన ఈ రాయితీలను, ఇకపై చిన్న భవనాలు, సాధారణ వాణిజ్య, నివాస సముదాయాలకు కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన గ్రీన్ బిల్డింగ్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఈ విషయాలను వెల్లడించారు. హరిత భవనాల నిర్మాణానికి సంబంధించి ఐజీబీసీ ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం డెవలప్‌మెంట్ ఫీజుల్లో రాయితీలు కల్పిస్తోందన్నారు. ప్లాటినం రేటింగ్ సాధించిన భవనాలకు 20 శాతం రాయితీ గోల్డ్ రేటింగ్ సాధించిన భవనాలకు 15 శాతం రాయితీ సిల్వర్ రేటింగ్ సాధించిన భవనాలకు 10శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతిని అత్యుత్తమ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు సీఆర్‌డీఏ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని కమిషనర్ విజయరామరాజు తెలిపారు. కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు రాజధానిలో ఏకంగా మూడు వేల కిలోమీటర్ల మేర వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. 30 నుంచి 35 శాతం విస్తీర్ణాన్ని కేవలం జలాశయాలు, పచ్చదనం జోన్లకే కేటాయించారని చెప్పారు. ఐజీబీసీ అమరావతి చాప్టర్ ఏర్పాటు కోసం సీఆర్‌డీఏ ఇప్పటికే రాజధానిలో స్థలం కేటాయించిందని, అక్కడ ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ బిల్డింగ్ నిర్మించి ఆదర్శంగా నిలవాలని సీఆర్‌డీఏ అధికారులు సూచించారు.

# బడుగుల ఎదుగుదలకు టిడిపి పునాది: మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాలు అన్ని రంగాల్లో ఎదగడానికి తెలుగుదేశం పార్టీయే పునాది వేసిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ రెండేళ్లలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి వేగవంతంగా సాగుతున్నాయన్నారు. వైసీపీ రెచ్చగొట్టే రాజకీయాలను బడుగువర్గాలు తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టి వల్లే నేడు దేశంలోనే అత్యధికంగా పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఎక్కువగా లబ్ధి పొందేది బడుగు, బలహీన వర్గాల యువతేనని తెలిపారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పెట్టిన మొదటి సంతకం మెగా డిఎస్సీ పైనే. కుల మతాలకు అతీతంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఈ మెగా డిఎస్సీ ద్వారా వేలాది


శనివారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

మంది బీసీ, నిరుపేద నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి లబ్ధి పొందారన్నారు. రాష్ట్ర భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే, అలజడులు రేపే గొడ్డలి పార్టీ ని ప్రజలంతా కలిసి శాశ్వతంగా భూస్థాపితం చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో, విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తూనే ఒకవైపు రైజింగ్ రాయలసీమ మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి సవిత తెలిపారు. జగన్ శ్రీకాకుళం పర్యటనలో వైసీపీ నేత చింత రవి ఏకంగా విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా పోలీసుపైనే దౌర్జన్యానికి పాల్పడితే, మాజీ మంత్రి అంబటి రాంబాబు చట్టాన్ని గేలిచేస్తూ పోలీసులపై నిత్యమూ దాడికి దిగుతున్నారన్నాని మంత్రి సవిత మండిపడ్డారు.

## కార్మికుడి మరణంపై వరల్డ్ బ్యాంకు బృందం అసహనం
### విచారణకు ఇద్దరు అధికారులతో కమిటీ

**విజయవాడ,ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పనుల్లో మట్టి పెళ్లలు విరిగిపడి కార్మికుడు మృతి చెందడంపై ప్రపంచ బ్యాంకు బృందం అసహనం వ్యక్తం చేసింది. పనుల్లో కార్మికుల రక్షణ కోసం ఒప్పందం ప్రకారం చర్యలు తీసుకోవడం లేదని తెలిపింది. ఇటీవల అమరావతి పనుల పరిశీలనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు బృందం ముందుగా దొండపాడులోని ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అక్కడ లేఅవుట్ పనుల్లో మట్టి పెళ్లలు విరిగిపడి ఇటీవల యువ కార్మికుడు మృతి చెందాడు దీనిపై ప్రపంచ బ్యాంకు ఏర్పాటు చేసుకున్న స్వతంత్ర దర్యాప్తు సంస్థ నివేదిక పంపింది. దీనిపై అధికారులిచ్చిన వివరణకు సంతృప్తి చెందకపోవడంతోపాటు అక్కడి సమీక్ష సమయంలో కార్మికుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని పేర్కొంది. ఇప్పటి వరకూ సమర్పించిన నివేదికల ప్రకారం చూస్తే కార్మికుడి మరణం జరగకూడదని, అలా ఎందుకు జరిగిందో సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది. పని ప్రదేశంలో కార్మికుల రక్షణకు నిధుల విడుదలకు సంబంధం ఉండటంతో ప్రభుత్వం వెంటనే కారణాలను అన్వేషించే పనిలో పడింది. ప్రపంచ బ్యాంకు నుండి తీసుకున్న అప్పునకు సంబంధించి విధించిన షరతుల్లో భాగంగా ఒప్పందం చేసుకున్న డిస్బర్స్మెంట్ లింక్డ్ ఇండికేషన్ (డిఎల్ఐ)లో ఈ అంశం కూడా ఉండటంతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. దీంతో మొత్తం విచారణ కోసం ఎడిసిఎల్ చీఫ్ ఇంజినీరుతోపాటు మరో అధికారితో కలిపి ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొంది.



విజయవాడ- వాడపల్లి పర్యాటక బస్సును ప్రారంభిస్తున్న ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

## విజయవాడ-వాడపల్లి ఒక రోజు టూర్ ప్యాకేజీ ప్రారంభం
### జండా ఊపి ప్రారంభించిన ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వ ర్యంలో విజయవాడ - వాడపల్లి పర్యాటక బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధరపెద్దలకు రూ.1,160/,పిల్లలకు రూ. 1,000/ గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని టి ఎస్ వి నారాయణ తెలిపారు.

## ఐఎఎస్ అధికారి మంజులే బాలాజీ దిగంబర్ బదలీ

**విజయవాడ.ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి :** స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఐఆర్‌డి) అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న బాలాజీ దిగంబర్ బదలీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని ఏపీ సర్కార్ స్పష్టంచేసింది. తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీకి రి పోర్ట్ చేయాలని ఆదేశించింది. ఎస్ఐఆర్‌డి అదనపు డైరెక్టర్ పోస్టుకు ఇన్‌చార్జి ఏర్పాట్లు చేయాలని ఈ మేరకు జీఓ ఆర్‌టీ నంబర్ 1540 జారీ చేసింది.

# ఉద్యోగుల సమస్యలు 15లోగా పరిష్కరించాలి
### లేకుంటే ఉద్యమమే: ఎపి జెఎసి అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు దామోదర్, పాండురంగరాజు, లక్ష్మీ, విజయలక్ష్మి తదితరులు

**విజయవాడ, ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 95 శాతం ఉద్యోగులకే సరిపోతోందని శ్వేతపత్రంలో ప్రభుత్వం చెప్పడం సరికాదని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, కన్వీనరు దామోదర్, అసోసియేట్ ఛైర్మన్ పాండురంగరాజు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్, లక్ష్మి, సెక్రెటరీ జనరల్ విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నెలలో జరిగిన చర్చల తర్వాత సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్న తరుణంలో ఇలాంటి ప్రచారం చేయడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవ దూరంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆదాయంపై ఈ నెల నాలుగో తేదీన ప్రకటించిన శ్వేతపత్రం ఉద్యోగులను తీవ్ర విస్మయానికి గురిచేసిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇస్తూ ప్రభుత్వ ఖర్చు అంటూ పేర్కొనడాన్ని తప్పు పట్టారు. 2024 నుంచి పదవీ విరమణలు భారీగా పెరిగాయని ఇంతవరకు 41 వేల మందికి పైగా రిటైర్ అయ్యారని చెప్పారు. 2032 నాటికి లక్షా 33 వేల మంది రిటైర్ కాబోతున్నారని కొత్త నియామకాలు లేవని, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్క ఉద్యోగే చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈనెల 15లోగా ఉద్యోగుల ఆర్థిక సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర ఉద్యమ కార్యచరణ తథ్యమని ఏపీ జేఏసీ అమరావతి నేతలు స్పష్టం చేశారు. హెల్త్ కార్డులు ఆసుపత్రుల్లో పని చేయడం లేదు. 60 రోజుల్లో పరిష్కరిస్తామని స్వయంగా సీఎం చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. సీనియర్ అధికారుల సేవలను ప్రభుత్వం కన్సల్టెంట్లుగా వాడుకోవడాన్ని తాము వ్యతిరేకించబోమని, కానీ వారిని ప్రమోషన్ పోస్టుల్లో కొనసాగించడం వల్ల కిందిస్థాయి ఉద్యోగులు పదోన్నతులు కోల్పోతున్నారన్నారు.

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

**విజయవాడ, ఆగస్టు8 ప్రభాతవార్త:** భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యజన్మదినమైన సెప్టెంబర్ 15వ తేదీని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగుల సమస్యలపైనా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రావు అధ్యక్షతన విజయవాడలో శనివారం జరిగింది. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బి.డి. శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు కనపర్తి సంగీతరావు, గౌరవ సలహాదారులు మురళీకృష్ణ నాయుడు, రాష్ట్ర కార్యవర్గం27 జిల్లాల కార్యవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 800 మంది సెక్షన్ అధికారులు పోస్టులనువెంటనే భర్తీ చేయాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలోసెక్షన్ ఆఫీసర్స్, సహాయక సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నందున, పని ఒత్తిడి అధికంగా ఉన్న కారణంగా 2200 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా పని చేస్తున్న సైట్ ఇంజనీర్లను రెగ్యులర్ చేయా లని విజ్ఞప్తి చేశారు. సెక్షన్ ఆఫీసర్లకు రవాణా భత్యం ను మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## రైతులు కరవుతో అల్లాడుతుంటే, ప్రభుత్వం కబుర్లతో కాలక్షేపం: వైఎస్ షర్మిల

**విజయవాడ.ఆగస్టు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఏపీ పీసీసీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ "ఎక్స్" వేదికగా ఆమె తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థి తులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి



జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.


# ఆదివాసీ సంఘాల ఏజెన్సీ బంద్ విజయవంతం



**పోలవరంజిల్లా ప్రతినిధి,ఆగస్టు 8 ప్రభాతవార్త:** ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదివాసీ సంఘాలు చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతం అయింది. ఏజెన్సీలోని అనేక జిల్లాలు,పట్టణాలు, మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో ఆదివాసి సంఘాల సంపూర్ణ బంద్‌ను నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. 1/70 చట్టం సవర్ణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ పై కౌంటర్ పిటిషన్ ప్రభుత్వం దాఖలు చేయాలని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు అధికారంలోకి వస్తే 100ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం, చింతూరు డివిజన్ కేంద్రంలో రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతం అయ్యింది. ఏజెన్సీలో మారుమూల గ్రామాల నుండి పెద్దసంఖ్యలో ఆదివాసిలు రోడ్లపైకి వచ్చి ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ రిజర్వేషన్ హామీని అమలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం చెల్లించాలని, 1/70 చట్టం సవ రణ పిటిషన్ పై రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లిట్ పిటిషన్ దా ఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉన్న విలువైన ఖనిజ సంపద, సహజ వనరులు, ప్రభు త్వం కారు చౌకగా పెట్టుబడిదారులకు దోచి పెట్టాలని చూస్తున్నాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసి హక్కులు,చట్టాలు నిర్వీర్యం చేస్తుందని, రాజ్యాంగ బద్ధంగా 5వ,6వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు, ఏజెన్సీ ప్రాంతంలోని సర్వముఖ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతి చట్టాలను రూపొందించి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

## మార్కాపురంలో మహిళపై కత్తితో దాడి

**మార్కాపురం టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** మార్కాపురంలోని విజయ టాకీస్ సమీపంలోని బాసాని బజారులో ఓ మహిళపై యువకుడు కూరగాయలు తరిగే కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. జ్ఞానదృష్టి నాగలక్ష్మి (40), భర్త రాము, ఇంట్లో వంట చేసుకుంటుండగా బైసాని మురళి (22) పసుపు కావాలంటూ వచ్చి కత్తితో ఆమెపై సుమారు ఎనిమిది సార్లు దాడి చేసినట్లు సమాచారం. నాగలక్ష్మి కేకలు వేయ డంతో స్థానికులు అక్కడికి చేరుకోగా మురళి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన నాగ లక్ష్మిని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆసు పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# దేవుని పేరుపై తాత్సారం ఎందుకో!? తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీవేంకటేశ్వర'గా మార్పు ఏదీ !

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిచెందిన తిరుపతి-తిరుమల చేరుకునేందుకు ప్రధాన విమానాశ్రయం రేణి గుంటలోని తిరుపతి విమానాశ్రయంకు "శ్రీవేం కటేశ్వర"స్వామి పేరు పెట్టాలని ఏడాదిన్నర క్రిం దట టిటిడి బోర్డు ప్రతిపాదనలు ఇప్పటికీ అమ లుకునోచుకోలేదు. దేశ రాజధాని ఢిల్లీనుండేగాక హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగుళూరు వంటి ప్రధాన నగరాల నుండి ప్రతి రోజూ పదిహేనువరకు విమానాలు తిరుప తికి ఉన్నాయి. ఈ విమానాలన్నీ కేంద్రప్రభుత్వ ఆధీనంలోని విమానయానశాఖ ఆధ్వర్యం లోనే నడుస్తున్నాయి. ప్రతిరోజూ వేలాదిమంది ప్రయా ణీకులు తిరుమలకు వస్తుండటం విశేషం. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమేగాక తిరుపతి చుట్టుపక్కల ప్రాం తాల్లో వివిధ రకాల వ్యాపారాలు, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చు కునేందుకు హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరుల నుండి కూడా వ్యాపారవేత్తలు తిరుపతికి వస్తు న్నారు. ఇలా తిరుమల పుణ్యక్షేత్ర ప్రాధాన్యతతో తిరుపతికి ఎయిర్ ఇండియా సంస్థతో బాటు పలు ప్రైవేట్ సంస్థలు విమానాలను నడుపుతున్నాయి. ఇక్కడకు నిత్యం విమానాల్లో విచ్చేస్తున్న యా త్రికుల సంఖ్య కూడా రెట్టింపయిందనేది విమా నాశ్రయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయంకు "శ్రీవేంకటేశ్వర"విమానాశ్రయంగా నామకరణం (పేరు మార్చాలని)చేయాలని 2025 జూన్‌లో టిటిడి ధర్మకర్తలమండలి నిర్ణయించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

రాష్ట్రప్రభుత్వం ద్వారా కేంద్రానికి ఈ సిఫార్సులు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. కేంద్రవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆంధ్రప్రదేశ్‌నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నా పేరుమార్పుపై మాత్రం గెజిట్ రూపొందించలేకపోతున్నారనే అసహనం రాష్ట్రప్రజల్లో ముఖ్యంగా శ్రీవారి భక్తుల్లో వ్యక్తమ వుతోంది.

# తిరుమల సమాచారం



## వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు.. వారాంతం కలసిరావ డంతో దేశం నలుమూలల నుండి భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం వరుసగా రెండవశని,ఆదివారాలు తెలంగాణాలో సోమవారం కూడా సెలవు రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. వేలాదిమంది వెలుపల క్యూలైన్లలో బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వారాంతం ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటున్నారు. భక్తజనంతో నిజంగానే కలియుగవైకుంఠం భక్తజనసంద్రంగా మారింది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రివరకు 75,533మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు.



## బ్రహ్మోత్సవాలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు
### సెప్టెంబర్ 19న గరుడసేవకు భక్తులకు సాఫీగా మార్గాలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లను ముందస్తుగా పటిష్టం చేసుకుంటున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర,తిరుమల పోలీసు అధికారులు, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారులు శనివారం మధ్యాహ్నం తిరుమలలో కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబర్ 19న జరిగే గరుడసేవ రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తుల రాకపోకలు సజావుగా సాగడంతో బాటు, అవసరమైన సమయంలో భక్తులను సురక్షి తంగా బయటకు తరలించే విధంగా నిష్క్రమణ ప్రణాళికపై ప్రధానంగా చర్చించారు. ఇందులో లేపాక్షికూడలి, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్, ఎస్ఎంసి,సుపథం, రాగిమానుకూడలి ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీనియంత్రణ, రాకపోకల నిర్వహణ, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు మరియు అత్యవసర పరిస్థితుల నిర్వహణపై సమగ్ర ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



## వైభవంగా కోదండరాముని పవిత్రోత్సవాలు

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలు, అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల నివృత్తికి, ఆలయ పవిత్రతను పరిరక్షించేందుకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పవిత్ర అభిషేకం నిర్వహించారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మంగళ విహారాన్ని భక్తులు భక్తిపారవశ్యంతో తిలకించారు. శనివారం రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నేడు ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ బి. నాగరత్న, సూపరింటెండెంట్ కె. శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.


pnb Housing
Ghar Ki Baat

అనుబంధం-IV-A ఈ-వేలం-స్థిరాస్తిలు యొక్క బహిరంగ అమ్మకపు ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ- 110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచి చిరునామా : 2వ అంతస్తు, డి.నం. 46-7-27, దానవాయిపేట, రాజమండ్రి- 533103, ఆంధ్రప్రదేశ్

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/RJY/1224/1336617 & NHL/RJY/0125/1352135 | రూ. 13583161.40 05.08.25 | భౌతికంగా | సర్వే నం. 4, TS No. 269 పార్ట్, Asst No 1060007745 D.No. 35-2-1 ... తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్-533001 | రూ. 15698000 | రూ. 1569800 | 27.08.26 | రూ. 100000 | 18.08.26 | 28.08.26 | * లేవు/ తెలియదు |

7428193765/9948562888/9392320800/9059529997/8790120868, ఇ-మెయిల్: auction@pnbhousing.com, PNBHFL యొక్క అధీకృత వ్యక్తి లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము : రాజమండ్రి తేది : 08.08.2026

సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

ప్రత్యక్షంగా 15 వేల మందికి, ఉత్తరాంధ్ర వ్యాప్తంగా పరోక్షంగా 5.85లక్షల మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. అనుహ్యంగా పర్యాటకులను ఆకర్షించే దిశలో మన్యం వేదిక విప్లవ పంథాలో స్వాతంత్ర్య సమరం చేసిన యోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఇక్కడభారీ ఎత్తులో ఆకర్షణీయం కానున్నది. ఎగిరే పక్షి ఆకారంలో సముద్రం, పచ్చని కొండల మధ్య నిర్మించిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోడీ అని అన్నారు. ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయన్నారు. రూ.2,784 కోట్లతో 8ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరేడి బ్యారేజ్ కలను నిజం చేస్తామని, ఈ నెల 14న గోదావరి జలాలను ఉత్తరాంధ్రలోని అనకాపల్లికి తీసుకొస్తామని, గోదావరి, వంశధార అనుసంధాన బాధ్యత తమదేనని స్పష్టం చేశారు.పీఎం మోడీ రాజధాని అమరావతికి నిధులు ఇచ్చిఅండగా నిలబడ్డారన్నారు.2028నాటికి అమరావతి మొదటి దశ పనులన్నీ పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు భోగాపురంవిమానాశ్రయం రేపటి ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిగానే నిలుస్తోంది. రాష్ట్రంలో అన్నిప్రాంతాలను సమాంతరంతీర్చిదిద్దాలనే స్వప్నం నిజం కానున్నదనే ఆశలు చిగిరిస్తున్నాయి.త్వరలోఅమరావతిలో 47అంతస్తులట్విన్‌టవర్స్ నిర్మాణానికి ఆమోదంలభించింది.ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది.రాజధానికి కీలకమైనస్పీడ్ యార్సిస్ రోడ్డునిర్మాణం పూర్తయింది.ఈదారి ఇప్పుడు రాజధానిలోకి సునాయాసప్రయాణానికి అనువుకానున్నది. రాష్ట్రంప్రగతి పథం వైపు దృఢసంకల్పంతో ముందుకు వెళ్తుంది.

# అభివృద్ధికి ముఖద్వారం భోగాపురం విమానాశ్రయం

విజయకుమార్ ఘంటా

ఒక్కొక్కటిగా కలలు సాకారం అవుతుంటే, ఆ ఆనందం అనిర్వచనీయం .రాజధానితో సహా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా వేరుపడితే, అంతుచిక్కని అంతర్మథనం. ఈ రాష్ట్రానికంటూ ఒక రాజధాని ఉండదా అనే ఓ ప్రవల్లిక ప్రతి ఆంధ్రుని మోమున నిలిచిన క్షణంలో అమరావతి రాజధానిగా సాక్షాత్కరించింది. రాష్ట్రం నుంచి తెలంగాణా వేర్పాటయిన తరువాత హైదారాబాదే ఉమ్మడి రాజధాననుకున్నా, అప్పటి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమరావతి పేరిట కృష్ణాతీరంలో సుందర రాజధానిని నిర్మించుకుందామనే తలంపుకు ప్రాణం పోసింది. 2016 నాటికి ఏపీ రాజధానిగా అమరావతి ప్రకటితమైనప్పటికి సచివాలయం,అసెంబ్లీ భవనాలు,హైకోర్టు భవనాలన్ని తాత్కాలికంగా నిర్మితమయ్యాయి. 30వేలఎకరాల్లో రాజధాని నిర్మాణ ప్రతిపాదనలను చట్టసభలు అంగీకరించాయి. సుందరనగరం రాజధానిని నిర్మించాలనే ప్రయత్నం జరిగింది. కొన్ని భవనాలు నిర్మితమయ్యాయి. 2019-24 మధ్య అమరావతి రాజధాని నిర్మాణం వెనుకబడింది. మూడు రాజధానుల ప్రతిపాదనలో అమరావతి పేరుకే రాజధాని అయింది. అమరావతి కోసం దగ్గర,దగ్గర మూడేళ్ళ పోరాట మహిళలు,రైతులు సాగించారు.ఈ దశలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చింది. వస్తూనే అమరావతిని అంతర్జాతీయ నగరం చేస్తామనే ప్రతిజ్ఞ చేసింది. చూస్తుండగానే కూటమి ప్రభుత్వ పాలన రెండేళ్ళలో ఎన్నో మైలురాళ్ళు దాటింది. అమరావతి క్రమక్రమంగా అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టి, వెనక్కి తిరగకుండా ముందుకు సాగుతుంది.రూ.లక్షల కోట్లు పెట్టుబడులు రాజధానికి వచ్చి చేరుతున్నాయి.నగరం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మితమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకుని,జాతీయ.అంతర్జాతీయ సర్వీసులకు సిద్ధమైంది. రాష్ట్ర విభజన తర్వాత ప్రారంభమైన తొలి అతి పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయంగా ఖ్యాతికెక్కింది. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి ముఖచిత్రాన్ని మార్చటంలో ఇది కీలకమైన ముందడుగుగా ఏపీ ప్రభుత్వం ఈవిమానాశ్రయ ప్రారంభ సమయంలో ప్రకటించింది. ఈమాటలకు బలం చేకూరుస్తూఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభం అత్యంత కీలకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ



విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రంలో మొత్తంగా రూ.18వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన ప్రకటించారు. ఇదంతా యాధృచ్ఛికం కాదు, దార్శనీక దృక్పథ వచనం,దాంతో నవ్యాంధ్ర రెండేళ్ళ అభివృద్ధి కార్యచరణానికి ప్రాణవాయువు చిక్కినట్లయింది. ఉత్తరాంధ్ర యువత ప్రగతికి ఈ సరికొత్త ఎయిర్ పోర్టు ఒక రన్‌వేలా, లాంచ్ ప్యాడ్‌లా పని చేస్తుందని ప్రధాని వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్రతో పాటు వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజిన్ సర్కార్ రాత్రింబవళ్ళ శ్రమిస్తోందని వెల్లడించారు. గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలపై ఆయన పేరుతోనే ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పరిశ్రమల ద్వారా పెట్టుబడులు పెరగడం, తద్వారా ఉత్పత్తి, ఎగుమతులు పెరిగి యువతకు ఉపాధి లభించడమే ఎన్డీఏ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. పెట్టుబడుల ద్వారా ప్రజల జీవితాలను మార్చడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాయని వివరించారు. చంద్రబాబు సారథ్యంలో ఏపీనిర్దేశిత అభివృద్ధి గమ్యాన్ని చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రారంభించుకున్న ప్రాజెక్టులన్నీ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపి,స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ సంకల్పాన్ని వంద శాతం నెరవేరుస్తాయని ప్రధాని మోడీ భరోసాఇచ్చారు. దేశంలో అత్యంతఆధునీకంగా ప్రైవేటు రంగ సంస్థ జీఎంఆర్ భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత ఆధునీక వసతులతో నిలిచింది. ఇది శరవేగంతో స్వరాంధ్ర విజన్ 2047 సీఎం చంద్రబాబు నేతృత్వంలో సాగుతున్న ప్రగతికి నిదర్శనంగా చెప్పాలి. ఇప్పుడు ఈ విమానాశ్రయం పర్యాటక,పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ప్రగతికి కేంద్రబిందువుగా నిలవనుంది.ఈ విమానాశ్రయానికి ఎవరు పునాది వేసారు.ఎవ్వరు నిర్మాణ కార్యచరణలో పెట్టారనే అంశాన్ని పక్కన పెడితే కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ చూపించి శరవేగంగా విమానాశ్రయ పనులు పూర్తిచేయించింది. ఇందుకు సీఎం చంద్రబాబు మార్గదర్శనంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహననాయుడు కృషి ఉంది.రాష్ట్రమానవ వనరుల శాఖామంత్రి నారాలోకేష్‌దౌత్యం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక, సాంకేతికత, అత్యుత్తమ స్థాయి మౌలిక వసతులతో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని గతవారం ఆరంభంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి జాతికి అంకితంచేసారు.సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో ఎగిరే చేప ఆకృతిలో విమానాశ్రయాన్ని నిర్మించారు. టెర్మినల్ సీలింగ్ సంప్రదాయ ముగ్గులు, నాదస్వరం థీమ్‌తో రూపొందించారు.జీఎంఆర్ సంస్థ ప్రత్యేక శ్రద్ధతో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు,కళలు ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దింది.స్వాగత ద్వారంవద్ద భారీ ఏటికొప్పాక బొమ్మను పెట్టారు. విమానాశ్రయం లోపల రాష్ట్ర చారిత్రక వైభవం చాటేలా తోలు బొమ్మలాట,బొబ్బిలి వీణ, భౌగోళికవారసత్వం తెలియజెప్పేలా బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.ఉత్తరాంధ్ర వైభవం చాటేలా తప్పెటగుళ్ళ, విజయనగరం రాజవంశీయుల కోట, అరసవల్లి సూర్యనారాయణస్వామి,శ్రీ ముఖలింగం, శ్రీకూర్మం, సింహాచలం, కనక మహాలక్ష్మి దేవస్థానం, థింసా నృత్యంవంటి కళారూపాలను టెర్మినల్ భవనం గోడలపై అలంకరించారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణ వ్యయం రూ.4,750కోట్లు అయి నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విస్తీర్ణంగా చూస్తే 2,203 ఎకరాలు ఉంది. గంటకు 275 కి.మీ. వేగం తో వీచే గాలులను తట్టుకునేలా విమానాశ్రయం నిర్మాణం జరిగింది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చెక్‌ఇన్‌కౌంటర్లు 40 ఏర్పాటు చేసారు. ఇమిగ్రేషన్ కేంద్రాలు 10ఏర్పాటు చేసారు.బ్యాగేజ్ బెల్ట్‌లు డొమెస్టిక్ 5, ఇంటర్నేషనల్ 2 సెల్ఫ్ చెక్‌ఇన్‌లు, బ్యాగేజ్ రీక్లెయిమ్ సదుపాయాలు, ప్రయాణికుల సామర్థ్యం తొలి దశలో ఏడాదికి 60 లక్షలు,రెండోదశలో 1.20కోట్లు,మూడో దశలో1.80కోట్లమంది అనేది అంచనాగాఉంది. కమర్షియల్ హబ్, హోటళ్ళు,ఎంటర్ టైన్‌మెంట్ జోన్లతో జీఎంఆర్ ఏరో సిటీని అభివృద్ధి చేస్తోంది. ఎయిర్ బస్, బోయింగ్ వంటి భారీ విమానాలు కూడా సులువుగా ల్యాండయ్యేలా 3.8కిలోమీటర్ల పొడవు,45మీటర్ల వెడల్పున రెండు రన్‌వేలు, ఫార్మా,ఆక్వా,సముద్ర సంపద ఎగుమతులతో పారిశ్రామికా వృద్ధికి దోహదపడేలా 5వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 25వేల టన్నుల సరకు రవాణా సామర్థ్యంతో కార్గో టెర్మినల్, లాజిస్టిక్ జోన్. రెండు అంతస్తుల్లో 79వేల చ.మీ విస్తీర్ణంలో ప్రయాణికుల టెర్మినల్ భవనం. కేంద్రీకృత డిజైన్, సులభతరమైన చెక్‌ఇన్,సహజకాంతి, సౌకర్యవంతమైనప్రయాణానికి ప్రపంచ స్థాయి వసతులు, 55 మీటర్ల ఎత్తులో 11 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏటీసీ టవర్. 360 డిగ్రీల్లో ఏరో డ్రమ్ విమాన సమాచార సేవలు,25 ఎకరాల్లో విమానాల నిర్వహణ, మరమ్మతుల ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో). యాప్రాన్లు, విమానాలు కదిగే ప్రదేశాలు, ఎయిర్‌సైడ్,ల్యాండ్ సైడ్ సర్క్యులేషన్, హ్యాంగర్లు, ఇంజిన్ రన్‌అప్ వేలు, నైపుణ్యాభివృద్ధి ప్రోత్సాహానికి, ప్రాంతీయ ఆర్థిక వృద్ధి వేగవంతానికి జీఎంఆర్ ఏవియేషన్ యూనివర్సిటీ, ఏరో సిటీతో సమీకృత పర్యావరణ వ్యవస్థ భోగాపురం లోహవిహంగ స్థలికి ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. ●

# బండ్లు.. ఓడలు!

బీహార్

ఎ.వి.వి ప్రసాద్

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయంటారు. రాజకీయాలలో అది మరింత సహజం. అందుకు బీహార్‌లోని బాంకీపూర్ నియోజకవర్గమే తాజా ఉదాహరణ. దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ సెగ్మెంట్ బిజెపికి కంచుకోట. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడుగా ఉన్న నితీన్ నబీన్ ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదు మార్లు గెలుపొందుతూ వచ్చారు. తొమ్మిది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దాదాపు 50వేల మెజారిటీతోఘవిజయం సాధించారు. తర్వాత ఆయన జాతీయ రాజకీయాల్లోకి అధిరోహించడం, రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఆ స్థానానికి ఉపఎన్నిక అవసరమైంది. యధా ప్రకారం ఈ ఎన్నికల్లో కూడా విజయం తనకే అనుకొంది బిజెపి. అయితే ఈసారి పరిస్థితి తారుమారయింది. అక్కడి నుంచి అనూహ్యంగా జన్ సురాజ్ పార్టీ అధినేత అయిన ప్రశాంత్ కిశోర్ (పికె )19 వేలు పైగా మెజారిటీతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దృష్టిలో ఉంచుకుని చూస్తే ఆయన గెలుస్తారని ఎవరూ చెప్పలేరు. వివిధ వర్గాల్లో నితిన్‌కు గల పట్టు సామాన్యమేమీ కాదు. ఆయన నియోజకవర్గంలో గెలవడం చాలా కష్టమని పికెకు కూడా తెలుసు. అయినా ఓ రాయి వేసి చూద్దామని అక్కడి నుంచే పోటీ చేశారు. స్థానబలం అధికంగా ఉన్న బిజెపి అలవోకగా విజయాన్ని వరించగలదనే అంతా అనుకున్నారు. పికె జన్ సురాజ్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చింది 3 శాతం ఓట్లు మాత్రమే. అంత తక్కువ ఓట్లున్న పార్టీకి గెలుపు అనేది సాధారణంగా కలే అవుతుంది. కానీ పికె ఉప ఎన్నికల్లో సంచలన విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. బిజెపి,జన్ సురాజ్ రెండు పార్టీల్లోను ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. కేవలం తొమ్మిది నెలల్లోనే. ఇది బిజెపికి పరాజయమా?జన్ సురాజ్ విజయమా? అని ప్రశ్నిస్తే సమాధానం ఒక్కటే అయినా, విశ్లేషణలు భిన్నంగా ఉంటాయి. పికె కు రాజకీయ వ్యూహ కర్తగా ఇప్పటికే చాలా పేరుంది.డిజిటల్ మీడియా ఆయుధంతో ఆయన తన చిత్ర విచిత్రమైన రాజకీయ వ్యూహాలను నేతలకు అందిస్తూంటారు. బిజెపి, జెడియు, కాంగ్రెస్, ఆప్, టిఎంసి, డిఎంకె, వైఎస్సార్సీ వంటి పలు ప్రధాన పార్టీలు ఆయన ఖాతాదారులే. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడుతన వ్యూహరచనతో పాప్యులర్ అయిన పికె తర్వాత నితీశ్ కుమార్ బీహార్ సీఎంగా విజయాలు సాధించడానికి, తమిళనాట డిఎంకె అధికారంలోకి రావడానికి చాలా కృషి చేశారు. చివరికి రాజకీయ మేధావిగా భావించే మమతా బెనర్జీ కూడా పికె వ్యూహాలనే పలుమార్లు అనుసరించారు. వ్యూహకర్తగా విజయాలనే గాక అనేక వైఫల్యాలు కూడా ఆయన చవిచూశారు. 2017 ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం, 2022 గోవా ఎన్నికల్లో టిఎంసి కోసం అనుసరించిన వ్యూహాలు బెడిసికొట్టడంతో ఆయన పాపులారిటీకూడా కొంత క్షీణించింది. సరిగ్గా అప్పుడే ఆయన తన వ్యూహాలను సొంత పార్టీ ఏర్పాటు దిశగా మరల్చారు. 2024లో గాంధీ జయంతి రోజున జన్ సురాజ్ పార్టీ ప్రారంభించడానికి రెండేళ్ల ముందే 'జన్ సురాజ్ అభియాన్ అనే రాజకీయ ఉద్యమాన్ని ఆరంభించారు. చాలా పకడ్బందీ వ్యూహంతో పార్టీని నిర్మించినా తొలుత ఆశాభంగమే ఎదురైంది. 2022 లో ఉద్యమంగా మొదలై, 24లో పార్టీగా మారి, 25లో తొలి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని 26లో బాంకిపూర్‌లో తొలి విజయం సాధించేదాకా అనేక ఎత్తుపల్లాలు ఎదురైనా, ఇప్పుడు ప్రధాన రహదారిపైకి వచ్చారు. అయితే ఈ పరిణామంలో ఆయన ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగార్థులు, రైతులు, మహిళలు, వలస కార్మికుల ఓట్లు ఆకర్షించడం పైనే దృష్టి పెట్టి సాగినట్లు కనిపిస్తుంది. ఢిల్లీ, మరికొన్ని ప్రాంతాల్లో సాగుతున్న విద్యార్థుల ఆందోళనలు ఉప ఎన్నికల సమయానికి ఆయనకు బాగా కలిసి వచ్చాయనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలు తోడవకపోతే ఆయన అదనంగా చాలా ప్రయత్నించవలసి వచ్చేది. ఆ ఓట్లే ఆయనకు సంచలన విజయాన్ని అందించాయి. 2025లో ఇదే బాంకిపూర్‌లో బిజెపికి 63శాతంఓట్లురాగా, జన్ సురాజ్‌కు 5శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అటువంటి బిజెపి కంచుకోటనే ఎంచుకొని ఈసారి ఎనిమిది రెట్లు ఎక్కువగా ఓట్లు సాధించారంటే అది విద్యార్థులు, యువకుల మద్దతు వల్లనే. జన్ సురాజ్‌కు ఓట్ల శాతం ఈ నియోజకవర్గంలో 5 నుంచి 49 శాతానికి పెరిగింది. 'అనేక ఎన్నికల్లో పలువురు ప్రముఖ నేతలను గెలిపించాను. ఇప్పుడు నేనే మీ ఓట్లకోసం వచ్చాను' అంటూ ఆయన చేసిన ఎన్నికల ప్రచారం కూడా ఎక్కువ ప్రభావం చూపిందనిపిస్తుంది. ఈ వ్యక్తిగత గుర్తింపు బిజెపి సంస్థాగత బలాన్ని చాలా వరకు ఎదుర్కొంది. గతంలో కీలక పాత్ర వహించిన లాలూ ఆర్జేడీ పరిస్థితి చాలా క్షీణించడం కూడా పికెకు కలిసివచ్చింది. ఈ ఒక్క ఎన్నికలో సాధించిన విజయం వల్ల జన్ సురాజ్‌కు అధికారం దక్కక పోవచ్చు కానీ అధికార పార్టీ పునాదులు కదల్చడానికి ఎంతో కొంత ఉపకరించింది. భవిష్యత్తులో బిజెపి, ఆర్జేడీ, కాంగ్రెస్‌లను పక్కకు జరపాలంటే పికె తన వ్యూహాలకు మళ్లీ పదును పెట్టవలసి ఉంటుంది. బిజెపి, ఆర్జేడీకి రాష్ట్రంలో చాలా స్ట్రాంగ్ ఓటు బ్యాంకు ఉంది. దానిని తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలంటే పికె మారిన పరిస్థితులకు తగినట్లుగా కొత్త వ్యూహరచన చేయవలసి ఉంటుంది. బీహార్ యువత పక్క రాష్ట్రాలకు వలస పోకుండా వారికి స్వరాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు చూపాలని ఇతర పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు అందుకు ఆయన చేయగల కృషి ఏమిటో ప్రజలకు చెప్పవలసి ఉంది. ఏది ఏమైనా రాజకీయ నాయకునిగా మారిన పికె తన భవిష్యత్తుకు ఎటువంటి వ్యూహాలను రూపొందించుకొంటారో చూడాలి. ●



ప్రశాంత్ కిశోర్

# సౌదీకి మిలీషియా ముప్పు

సౌదీ అరేబియా

గన్ని మోహన్

సౌదీ అరేబియాపై రెండు వైపుల నుంచి మూకుమ్మడి దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో సౌదీరాజు ప్రభుత్వానికి స్వీయరక్షణ అనివార్యమైంది. అందుకోసమే పాక్, టర్కీలతో కలిసి సంయుక్త భద్రత రక్షణ ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే అమెరికా ఇరాన్‌పై జరుపుతున్న దాడుల కారణంగా సౌదీలోఉన్న అమెరికా స్థావరాలపై దాడులు పేరిట ఇరాన్ చేస్తున్న దాడులు సౌదీకి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సంయుక్త ఒప్పందం జరిగినప్పటికీ ఇరాన్ నుంచి సౌదీ రక్షించుకోలేదని, అమెరికా స్థావరాలకు అవకాశం లేకుండా ఉన్నపుడే సౌదీకి భద్రత ఏర్పడుతుందని ఇరాన్ చేస్తున్న హెచ్చరికలను పరిగణనలోనికి తీసుకునే సౌదీ అరేబియా రాజు ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో ఐరన్ డోమ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకునే ప్రతిపాదనలకు ఓకే చెప్పింది. అయినా కూడా అమెరికా ఇరాన్‌పై ముప్పేట దాడిచేసినప్పుడల్లా అమెరికా స్థావరాలున్న గల్ఫ్‌దేశాలపై ఇరాన్ ఐఆర్జీసీ దాడులు చేసి కలవరం సృష్టిస్తోంది. దాడుల్లో భాగంగా ఆదేశాల చమురు సంస్థలపైనా దాడులు చేయడంతో సౌదీ ఒకానొక సమయంలో అమెరికాపై ఒత్తిడి కూడా తెచ్చింది. సౌదీ ఇతర గల్ఫ్‌దేశాల ఒత్తిడికి అమెరికా మెత్తబడినా మళ్లీ దాడులు అంటూ ట్రంప్ రోజుకొక ప్రకటనగా చేస్తున్న తన సొంత సోషల్‌మీడియా ట్రూత్‌పోస్టులు గల్ఫ్‌దేశాల్లో సందేహాలను కూడా పెంచుతున్నాయి. మరోపక్క పాక్‌తో దోస్తీకంటే కేవలం వాణిజ్య, భద్రతపరంగానే సౌదీ ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు చేయనున్న తాజా దాడులు కనుక జరిగితే సౌదీకి ఆర్థిక, వాణిజ్య పరంగా భారీనష్టం కూడా కలుగుతుందని నిస్సందేహంగా చెప్పగలం. అసలు ఈ దాడుల పూర్వాపరాలను పరిశీలిస్తే కేవలం ఆమెరికా, ఇజ్రాయెల్‌లతో ఉన్న దోస్తీకారణంగానే ఇరాన్ ఈదాడులు చేస్తోందని సౌదీ గుర్తించింది. ఇరాన్ చెపుతున్న కారణాలు కూడా అమెరికా స్థావరాలున్న గల్ఫ్‌దేశాల లక్ష్యాలను ఛేదిస్తామని ఇరాన్ ఐఆర్జీసీ చెపుతూ వస్తోంది.ఈ క్రమంలో ఇప్పుడు మిలీషియా దాడులపై సౌదీ ముందస్తు వ్యూహాలను పెంచుకోవాల్సిన అవసరంవచ్చింది. ఇరాన్ మద్దతుఉన్న ఇరాక్ మిలీషియాగ్రూపులు, యెమెన్‌కు చెందిన హౌతీలుకలిసి సౌదీపై దాడులకు సిద్ధమవుతున్నట్లు నిఘాసంస్థలు ఇప్పటికే సౌదీకి పంపించాయి. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పర్యవేక్షణలో ఈ సమన్వయం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇరాక్‌లోని మిలీషియా గ్రూపులు,హౌతీలుఅత్యంత సమీప భవిష్యత్తులో సమన్వయ దాడులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ నివేదికలు సూచిస్తున్నాయి. ఉత్తరం, దక్షిణం వైపు నుంచే ఈ దాడులు జరుగుతాయని కూడా దిక్కులనుసైతం నిఘా ఏజెన్సీలు వెల్లడించాయి. నిఘావర్గాల అంచనాల ప్రకారం ఇరాక్ మిలీషియా గ్రూపులుసౌదీ అరేబియా పై ఉత్తరదిశ నుంచి, యెమెన్‌లోని హౌతీ బలగాలు దక్షిణ దిశనుంచి దాడులుచేసే అవకాశం ఉంది. రెండు వైపుల నుంచి ఏకకాలంలో దాడులు జరిపే ఈ వ్యూహాన్ని భద్రతా నిపుణులు పిన్సర్ అటాక్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు సౌదీ అరేబియా కట్టుబడి ఉందని కానీ తమపై ఎలాంటి దాడి జరిగినా తగినరీతిలో స్పందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెపుతున్న సౌదీ అందుకోసమే ఈ ఉమ్మడి రక్షణ ఒప్పందంపై సంతకంచేసిందనిచెప్పాలి. మిలీషియాదాడులు చమురు సంస్థలు, విమానాశ్రయాలే లక్ష్యాలు. చమురు,ఇంధన ఉత్పత్తి కేంద్రాలు,వాణిజ్య నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు,దేశ ఆర్థికవ్యవస్థకు కీలకమైన ఇతర వ్యూహాత్మక ప్రాంతాలు దాడుల లక్ష్యాలుగా ఉండొచ్చని తెలుస్తోంది. ఈ దాడులకు ఉపయోగించనున్న డ్రోన్లు, క్షిపణులను ఇప్పటికే ప్రయోగ ప్రాంతాలకు తరలించినట్లు కూడా సమాచారం అందిందని అధికారులు పేర్కొన్నారు. ఇరాక్‌కు చెందిన కతాయిబ్ హెజ్బొల్లా,హరకత్ హెజ్బొల్లా అల్‌నుజబా, కతాయిబ్ సయ్యద్ అల్‌షుహదా వంటి షియా మిలీషియా గ్రూపులు సౌదీ ఉత్తర సరిహద్దు సమీపంలో హౌతీల కార్యకలాపాలకు లాజిస్టికల్, సాంకేతిక, కార్యాచరణ సహకారం అందిస్తున్నట్లు అంచనాలున్నాయి. అదే సమయంలో హౌతీలకు చెందిన నిపుణులు ఇరాక్ మిలీషియాలకు డ్రోన్ కార్యకలాపాలు, సాంకేతిక పరిజ్ఞానంలో సహాయం చేస్తున్నట్లు సమాచారం. సౌదీ అరేబియాపై దాడుల ముప్పుపైహెచ్చరికల నేపథ్యంలో ఇటీవల పలు ఘటనలు చోటుచేసుకున్నాయి.యెమెన్ నుంచి సౌదీపై దాడులు జరగడంతోపాటు ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలీషియాల నుంచి డ్రోన్ దాడులు కూడా ఇటీవలి వారాల్లో చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు ప్రారంభంలో సౌదీలోని నజ్రాన్‌ప్రాంతం సమీపంలో దాడులుచేసినట్లు హౌతీలు ప్రకటించగా, ఇరాన్ మద్దతుఉన్న గ్రూపులు తమపైదాడులను విస్తరిస్తున్నాయని సౌదీ ఆరోపించింది. ఇప్పటి వరకు విడివిడిగా జరుగుతున్న ప్రాక్సీ దాడులు ఇరాన్ అనుకూలంగా ఉన్న పలుసాయుధగ్రూపుల సమన్వయంతో ప్రాంతీయస్థాయి సైనిక చర్యగా మారేఅవకాశం ఉందని సౌదీకిప్రమాద సంకేతాలు ఇచ్చాయి.నివేదికల్లో పేర్కొన్న ప్రణాళికలు నిజంగా అమలైతే సౌదీ అరేబియా ఉత్తర,దక్షిణ సరిహద్దు నుంచి ఏకకాలంలో దాడులనుఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది దేశవైమానిక రక్షణ వ్యవస్థతోపాటు కీలక మౌలిక సదుపాయాలపై తీవ్రఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. ఈ ఆరోపణలపై ఇరాన్, ఇరాక్ మిలీషియా గ్రూపులుఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతీయ సాయుధ గ్రూపుల మధ్య పరస్పర సమన్వయం పెరుగుతోందన్న ఆందోళనలకు తాజా పరిణామాలు ఊతం ఇస్తున్నాయి. సౌదీఅమెరికా, ఇజ్రాయెల్ సాయంతోనే ముందుకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చిపడ్డాయి. సౌదీ ఎలా ముందుకు వెళుతుందన్నది దాడుల తీవ్రతపైనే ఆధారపడి ఉంది. ●



మహ్మద్ బిన్ సల్మాన్

# ఆదివాసీల రాజ్యాంగ హక్కులను గౌరవించాలి

కుంజా శ్రీను

ఈ విశ్వంలో ప్రకృతితో మమేకమై, అడవినే అమ్మగా, కొండనే దేవుళ్లుగా భావిస్తూ తరతరాలుగా జీవిస్తున్న మూలవాసులు ఆదివాసీలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐదు వందల మిలియన్లకు పైగా ఉన్న ఆదివాసీల విశిష్ట సంస్కృతి, జీవన విధానం, సాంప్రదాయ భూహక్కులను గుర్తించి రక్షించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి 1994 డిసెంబర్ 23న ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీని 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'గా ప్రకటించింది. ఆదివాసీల స్వచ్ఛ స్వయంపాలన, జల్‌జంగల్‌జమీన్ హక్కులే ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న కలుగునేది ఈదినోత్సవ పరమార్థం. అయితే, స్వతంత్ర భారతదేశంలో దశాబ్దాలు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతంలో నేటికీ ఆదివాసీ గూడేలు ఆకలి కేకలు, పౌష్టికాహార లోపం, డోలీ మోతలు, రాజ్యాంగ చట్టాల ఉల్లంఘనలు,మాతృభాషల వినాశనంతో తీవ్రమైన జీవన్మరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. సాంస్కృతికంగా ఎంతో ఆధ్యాత్మికత, సామాజిక సమన్వయం కలిగిన ఆదివాసీల సమాజం నేడు బాహ్య ప్రపంచపు వ్యాపారీకరణ, ఆధునీకరణ పేరిట జరుగుతున్న ఆక్రమణల వల్ల తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. ఆదివాసీ జీవన విధానం కేవలం జీవనోపాధికి సంబంధించినది మాత్రమే కాదు, అది అడవి, పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉన్న సహజసిద్ధమైన సాంస్కృతిక వారసత్వం. ఒక జాతి సంస్కృతికి, మూలాలకు నిదర్శనం వారి మాతృభాష. లిపి లేకపోవడం, పరాయి భాషల ఆధిపత్యం, పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల నేడు ప్రాచీన ఆదివాసీ మాతృభాషలు అంతరించిపోయే ప్రమాదంలోపడ్డాయి. ముఖ్యంగా ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గోండి (కోయ)తోపాటు కొండదొర, కువి, సవర, గదబ, చెంచు, కొలం, జాతాపు, నాయక్ పోడ్ వంటి ప్రాచీన ఆదివాసీ భాషలు నేడు మనుగడ కోసం పోరాడుతున్నాయి. భాష నశిస్తే ఆ జాతి సంస్కృతి, వారి పవిత్ర ఆచారాలు, దేవతల కొండలు, సాంప్రదాయ వైద్యం, ఆచార వ్యవహారాలు శాశ్వతంగా కనుమరుగవుతాయి. అందుకే ప్రతీ ఏటా జులై 21న 'ప్రపంచ గోండి (కోయ) భాషా దినోత్సవం' నిర్వహిస్తూ మాతృభాషల పరిరక్షణకు పోరాడుతున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఆదివాసీ మాతృభాషల్లోనే బోధన అందించాలని, ఆర్టికల్ 350ఎని కఠినంగా అమలు చేయాలని, గిరిజన భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాల నుండి ఆశించిన స్పందన కరువైంది. విద్యా వ్యవస్థలో ఆదివాసీ సాంస్కృతిక, భాషా గుర్తింపును విస్మరించడం వల్ల భవిష్యత్ తరాలు తమ మూలాలను మరచిపోయే ప్రమాదం ఏర్పడింది. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్‌బి.ఆర్. అంబేడ్కర్, 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు ప్రత్యేక రాజ్యాంగ రక్షణలు కల్పించారు. '1874 షెడ్యూల్డ్ డిస్ట్రిక్ట్స్ యాక్ట్', '1917 ఏజెన్సీ ట్రాక్ట్స్ యాక్ట్'ల నుంచి నేటి 1/70 చట్టం వరకు ఆదివాసీ భూమి నాన్‌ట్రైబల్స్ చేతుల్లోకి పోకుండా స్పష్టమైన రక్షణ అంక్షలు ఉన్నాయి. అంతేకుండా, 1997 సుప్రీంకోర్టు చారిత్రాత్మక 'సమత తీర్పు' ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలోని భూములను నాన్‌ట్రైబల్స్‌కు లేదా ప్రైవేట్ కార్పొరేషన్లకు మైనింగ్ లీజులకు ఇవ్వడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేయబడింది. కానీ క్షేత్రస్థాయిలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో నాన్ ట్రైబల్ టూరిజం, మైనింగ్ మాఫియా పంజా విసురుతోంది. మారేడుమిల్లి, రంపచోడవరం, పాడేరు, అరకు, లంబసింగి, మోతుగూడెం వంటి పర్యాటక కేంద్రాల్లో బినామీ ఒప్పందాలు, పవర్ ఆఫ్ అటార్నీల ద్వారా ఆదివాసీ భూములను నాన్ ట్రైబల్స్ ఆక్రమించి విలాసవంతమైన రిసార్టులు కడుతున్నారు. ఇక పేసా గ్రామసభ తీర్మానాల్ని రోడ్డుపై పడేసి క్వారీలు, గ్రానైట్ మైనింగ్ నడుపుతుంటే ఆదివాసీ రోడ్లు, పరిసర వాతావరణం, పవిత్ర కొండలు ధ్వంసమైపోతున్నాయి. ఆదివాసీల ఆత్మగౌరవానికి, భూహక్కులకు గుండెకాయ లాంటి 1/70 చట్టాన్ని



రద్దు చేయాలంటూ నాన్‌ట్రైబల్స్ దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దావాలో రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ రాజ్యాంగ న్యాయవాదులను నియమించి చట్టాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో, ఏజెన్సీ భూములను ఆక్రమించిన నాన్ ట్రైబల్స్‌పై ఎల్‌టిఆర్ యాక్ట్ 3(5), సెక్షన్ 6ఎ ప్రకారం తక్షణమే అధికారులు నేరుగా కేసులు నమోదు చేయాలి. ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, అక్రమంగా నిర్మించిన రిసార్టులు, వ్యాపార సంస్థలకు విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లు రద్దు చేయడమే కాకుండా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్న ఉదాసీనత వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో సామాజిక అసంతృప్తి, రాజకీయ అశాంతి పెరుగుతున్నాయి. అదేవిధంగా ఏజెన్సీప్రాంతాల్లోనిపాఠశాలల్లో 100 ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఆదివాసీలకే కేటాయించే జీవో నంబర్ 3ని సుప్రీంకోర్టు కొట్టివేసిన తర్వాత, ఏజెన్సీ విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 5వ షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతం కేవలం 4.6 (7,445 చదరపు కిలోమీటర్లు) మాత్రమే ఉంది. సాధారణ 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ పరిమితి సూత్రాన్ని ఈ చిన్న వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతానికి వర్తింపజేయడం సమంజసం కాదు. తమిళనాడు ప్రభుత్వం 69 శాతం రిజర్వేషన్ చట్టాన్ని చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చిన నమూనానుకానీ, మేఘాలయ (85 శాతం), నాగాలాండ్ (80శాతం), మిజోరం (95శాతం) అనుసరిస్తున్న విధానాలను కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదు? రాజ్యాంగంలోని ఆర్టికల్ 254(2) ప్రకారం రాష్ట్ర శాసనసభలో ప్రత్యేకంగా ద షెడ్యూల్డ్ ఎరియాస్ ట్రైబల్ ఎంప్లాయిమెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం పొంది 9వ షెడ్యూల్‌లో చేర్చడంద్వారా 100శాతం స్థానిక గిరిజన ఉపాధ్యాయ నియామకాలకు చట్ట బద్ధత కల్పించవచ్చు.జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక చట్టం తీసుకురావడానికి రాజ్యాంగపరంగా, చట్ట పరంగా స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 350ఎ (మాతృభాషలోనే ప్రాథమిక విద్య),1952 నేషనల్ ఫారెస్ట్ పాలసీ, యు.ఎన్. ఢేబర్ కమిటీ సిఫార్సులు, పేసా చట్టంలోని సెక్షన్ 4 నిబంధనలు, ఉచిత నిర్బంధ విద్యహక్కు చట్టం, జాతీయ విద్యావిధానం 2020వంటివన్నీ కూడా ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక చట్టం తెచ్చి 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే కేటా యించడానికి బలమైన రాజ్యాంగ, విధానపరమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసినప్పటికీ, హామీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ప్రభుత్వానికి నిజంగా ఆదివాసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ప్రత్యామ్నాయంగా 'ప్రత్యేక ఉద్యోగ రక్షణ చట్టాన్ని' తక్షణమే శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాలి. మరొక వైపు రాష్ట్రవ్యాప్తంగా మూలవాసుల ప్రాథమిక హక్కులు పూర్తిగా పడకేసాయి. తరతరాలుగా పోడువ్యవసాయం చేసుకుంటున్న వేలాది మంది ఆదివాసీ దరఖాస్తులు పెం డింగ్‌లోనే ఉండిపోయాయి. ఉమ్మడి జిల్లాలవారీగా పెండింగ్‌లో ఉన్న పోడుభూములన్నింటికీ ప్రాధాన్యతా క్రమంలో పట్టాలు వెంటనే పంపిణీ చేయాలి.అనేక గూడేలకు నేటికీ రహదారి సౌకర్యం లేదు, రోడ్డువేద్దామంటే అటవీ శాఖ అభ్యంతరాలు చెబుతోంది. అటవీ హక్కుల చట్టం 2006 (ఎఫ్‌ఆర్‌ఎసెక్షన్ 3(2))ప్రకారం ప్రజోపయోగ పనులకు స్పష్టమైన వెసులుబాటుఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.అత్యవసర వైద్యంఅందక, రోడ్డు లేక గర్భిణులు, రోగులను మైళ్ల కొద్దీ డోలీల్లో మోసుకెళ్లే దృశ్యాలు నేటికీ నిత్యకృత్యమవుతూ అడవిపిల్లల ప్రాణాలుగాల్లో కలసిపోతున్నాయి. అంతేకాకుండా ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,400కు పైగా క్లాస్‌IVజు పోస్టులను భర్తీ చేయకపోవడం, ప్రతి పాఠశాలకు ఒక ఎఎన్ ఎమ్‌ఇ నియమించకపోవడం, మెస్ వంటలకు గ్యాస్ సౌకర్యం లేకపోవడం గిరిజన విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.ఆదివాసీ రిజర్వేషన్ల దయతో గెలిచి చట్ట సభలకు వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఆదివాసీల సమస్యలపై నోరు విప్పకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించి ఆదివాసీల మనుగడకు అండగా నిలవాలి. ●

# ప్రపంచం ఫాస్ట్‌గా మారుతోంది..

## యువత ఆవిష్కరణలతో స్టార్టప్ వ్యవస్థ బలోపేతం

## ఐఐటి విద్యతోనే మెరుగైన సామర్థ్యం : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఐఐటీలో చదువుకోవడం వల్ల సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామరథ్యం విద్యార్థులకు వచ్చినట్లు ప్రధాని మోడీ చెప్పారు. దేశానికి సేవ చేయాల్సిన బాధ్యత కూడా ఆ విద్యార్థులపై ఉందని ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్19 మహమ్మారి వేళ జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్నానని, ఇప్పుడు భౌతికంగా ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక రంగంలో చాలా విప్లవాత్మక రీతిలో మార్పులు జరుగుతున్నాయని, రాబోయే 20 నుంచి 30 యేండ్లలో ప్రపంచం మరోలా కనిపిస్తుందన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, ప్రొఫెషన్స్ ఎప్పుడూ మారుతుంటాయని, కానీ ఎప్పుడూ నేర్చుకోవడమే కీలకమైన అంశంగా మిగులుతుందన్నారు. ఎవరైతే కొత్త విషయాలను నేర్చుకుంటారో, వారే విజేతలుగా నిలుస్తారని ప్రధాని అన్నారు. కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించే ధైర్యాన్ని విద్యార్థులు ప్రదర్శించాలన్నారు. అవరోధాలను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు. అకాడమిక్ జీవితంతో పాటు క్యాంపస్ బయటి ప్రపంచం గురించి వివరిస్తూ. ఐఐటీ పరీక్షల్లో కచ్చితమైన సిలబస్ ఉంటుందని, కానీ జీవితమనే పరీక్షలో మాత్రం, అన్నీ సిలబస్‌లో లేని అంశాలే ఉంటాయన్నారు. కానీ ఉత్సుకతతో ఉండాలని ఆయన విద్యార్థులను ఎంకరేజ్ చేశారు. వ్యవస్థీకృత సిద్ధాంతాలను ప్రశ్నిస్తూనే వాటికి తగిన పరిష్కారాన్ని కనుగొనే ధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్స్, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్రిటికల్ మినరల్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ లాంటి రంగాలు విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దేశంలోని యువత ఆవిష్కరణల వల్ల స్టార్టప్ వ్యవస్థ, డిజిటల్ ఎకానమీ బలోపేతం అయ్యిందన్నారు. పరిశోధనా రంగం మరో కీలకమైన అంశమన్నారు. ప్రైమ్‌మినిస్టర్స్ రీసర్చ్ ఫెలోషిప్, ద రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్, అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ వ్యవస్థలను వాడుకోవాలన్నారు. పరిశోధనా, అధ్యయన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు యువ పరిశోధకులు మరింత పట్టుదలతో ఉండాలన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, విద్యార్థుల కెరీర్ దానిలో భాగస్వామ్యం కావాలన్నారు. కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సమయంలో జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించాలన్నారు. జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, ఘనతల గురించి విద్యార్థులు మిగితా వారితో పోల్చుకోవద్దు అని, ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇలాంటివి చేయకూడదని ప్రధాని మోడీ విద్యార్థులను హెచ్చరించారు. జీవితం అంటే లీడర్‌బోర్డు కాదు అని, మీ పోటీ ఇతర వ్యక్తులతో కాదు అని, మీతో మీరే పోటీపడాలని అన్నారు. స్వంత ప్రగతిపై ఫోకస్ పెట్టాలని, నిరంతరం నేర్చుకోవాలని, జీవితంలో కొత్తది నేర్చుకునేందుకు ఎప్పుడూ ఉత్సుకతతో ఉండాలన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పరం ప్రాగ్యా హై పర్ఫార్మెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సూపర్‌కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐఐటీ ఢిల్లీ సోనిపేట్ క్యాంప్‌లో ఈ సెంటర్‌ను ఆవిష్కరించారు.

## నేనేమీ బాబా యోగేశ్వర్‌ను కాను

### విద్యార్థులతో ప్రధాని మోడీ ఛలోక్తులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఢిల్లీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో పాల్గొన్న మోడీ తనదైన శైలిలో మాట్లాడి ఛలోక్తులు విసిరారు. ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్ల గురించి ఆలోచిస్తుండవచ్చని మోడీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు.



# భారత్‌పై 100% టారిఫ్‌ల భారం

## బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం

**వాషింగ్టన్, ఆగస్టు 8:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ట్రంప్ మళ్లీ టారిఫ్‌లతో విరుచుకుపడేందుకు ముందడుగు పడింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా సెనెట్ తాజాగా ఆమోదముద్ర వేసింది. ఇటీవల మృతి చెందిన సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా తీసుకొచ్చిన ఈ శాంక్షనింగ్ రష్యా, ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనెట్ 86-11తో ఆమోదించింది. ఆగస్టు 31న ఈబిల్లు ప్రతినిధుల సభముందుకు రానుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత అమెరికా అధ్యక్షుడి సంతకంతో ఇది చట్ట రూపం దాల్చనుంది. ఈ బిల్లు అమలులోకి వస్తే భారత్‌పై 100 శాతం సుంకాల మోత మోగనుంది. ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అగ్రరాజ్యం ఈ బిల్లును తీసుకొచ్చింది. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థికసంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. మాస్కో నుంచి చమురు దిగుమతులు చేసుకొనే దేశాలపై అధ్యక్షుడు అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం ఈ బిల్లుతో లభిస్తుంది. ఇది అమలులోకి వస్తే భారత్, చైనా, స్లొవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ వంటి దేశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. గతంలో ఈ టారిఫ్‌లు 500 శాతం వరకు ఉండాలని ట్రంప్ సర్కార్ ప్రతిపాదించింది. ఆ తర్వాత పశ్చిమాసియా ఉద్రిక్తతలు వంటి అంతర్జాతీయ పరిణామాలతో సుంకాల పరిమితిని సవరించి 100 శాతానికి తగ్గించారు.

# అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు కొత్తపేర్లు

## చైనాకు భారత్ గట్టికౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. ఆ రాష్ట్రానికి చెందిన కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో దానికి కౌంటర్‌గా భారత్ కూడా కొత్త పేర్లను ఫిక్స్ చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జు ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జు సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రీత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చరీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

## పెరుగుతున్న వృద్ధుల జనాభా

### 2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరికి 60 దాటిన వయసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత దేశం వృద్ధాప్యం దిశగా అడుగులు వేస్తున్నది. 2050 నాటికి దేశంలోని ప్రతిఐదుగురిలో ఒకరు 60 యేండ్లు, అంతకు పైబడిన వయసు వారు ఉంటారని ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా వెల్లడించింది. అందులో 70శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది. గ్రామీణ భారత దేశంలో జనాభా పరిణామాలు, మారుతున్న కుటుంబ వ్యవస్థ, సంరక్షణ వ్యవస్థ భవిష్యత్ పేరిట ఈ సంస్థ నివేదిక విడుదల చేసింది. జనాభా వృద్ధులుగా మారకముందే సంపన్న దేశాలుగా మారిన అనేక అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా భారత్ సంపద దేశంగా మారక ముందే వృద్ధాప్య దశలోకి అడుగు పెడుతున్నదని ఈ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశ జనాభాలో 34.7 కోట్ల మంది 60 యేండ్ల పైబడిన వారు ఉంటారని, ప్రతి పదిమందిలో ఏడుగురు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారని తెలిపింది.



## గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి పొడవైన జుట్టు ఉన్న మహిళ

### ఉత్తరాఖండ్ రేణుధరియాల్ రికార్డు

**డెహ్రాడూన్, ఆగస్టు 8:** భారత్‌కు చెందిన రేణు ధరియాల్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన జుట్టు కలిగిన మహిళగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఆమె జుట్టు పొడవును అధికారికంగా కొలవగా, అది 271.50 సెంటీమీటర్లు (8 అడుగుల 10 అంగుళాలు) ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో ఆమె పేరు గిన్నిస్ బుక్‌లో నమోదైంది. ఈ యేడాది ఏప్రిల్‌లో ఈ రికార్డును అధికారులు ధ్రువీకరించారు. దీంతో ఉక్రెయిన్‌కు చెందిన అలియా నసిరోవా (257.33 సెం.మీ.) పేరిట ఉన్న పాత రికార్డు బద్దలైంది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రపంచంలోనే అత్యంత పొడవైన వ్యక్తిగా రికార్డులకెక్కిన రాబర్ట్ వాడ్లో (272 సెం.మీ.) ఎత్తుకు రేణు జుట్టు పొడవుకేవలం కొద్దిగా మాత్రమే తక్కువ. రేణు ధరియాల్ వృత్తిరీత్యా ఒక కంటెంట్ క్రియేటర్, యూట్యూబర్. మహిళలకు అందం, జుట్టు సంరక్షణపై చిట్కాలు అందిస్తుంటారు. భారతీయ సంస్కృతిలో పొడవాటి జుట్టును అందానికి, సంప్రదాయానికి చిహ్నంగా భావిస్తారని, అదే తనకు స్ఫూర్తినిచ్చిందని రేణు తెలిపారు. 2015 నుంచి జుట్టును పెంచుతున్నానని, అప్పటి నుంచి ఒక్కసారి కూడా కత్తిరించలేదని ఆమె వివరించారు. ఇంత పొడవాటి జుట్టును సంరక్షించడం చాలా ఓపికతో కూడుకున్న పని అని రేణు చెప్పారు. జుట్టును శుభ్రం చేయడానికి, చిక్కులు తీయడానికి గంటల సమయం పడుతుందని అన్నారు. నేలపై పడకుండా ఉండేందుకు తన ఒత్తైన, నిగనిగలాడే జుట్టును పెద్ద జడగా అల్లుకుంటానని ఆమె పేర్కొన్నారు.

# రాహుల్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది

## మహిళా బిల్లుపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన ఆస్క్ మీ ఎనీథింగ్ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని వ్యాఖ్యలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు.

అప్పుడే దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నా అని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది. రాహుల్‌గాంధీతో రిజిజు ఫోన్‌లో మాట్లాడారు. బిల్లును త్వరగా తీసుకొస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగంగా జరిగే అవకాశం ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు కాకపోతే వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# భారత్‌లోనే రాఫెల్ యుద్ధవిమానాల తయారీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత వాయుసేన సామర్థ్యాన్ని మరింత ఇనుమడింపజేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో భాగంగా, 94 విమానాలను భారత్‌లోనే తయారు చేసేందుకు ఫ్రాన్స్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫ్రాన్స్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనను సమర్పించింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే, ఫ్రాన్స్ వెలుపల రఫేల్ యుద్ధ విమానాల ఉత్పత్తి జరగడం ఇదే తొలిసారి కానుంది. ఈ యేడాది మే నెలలో 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు సంబంధించి భారత వాయుసేన ఫ్రాన్స్‌కు అభ్యర్థన లేఖ పంపింది. దీనికి స్పందనగా డసో ఏవియేషన్‌తో పాటు ఎంబీడీఏ, సఫ్రాన్, థేల్స్ వంటి ఫ్రెంచ్ రక్షణ రంగ దిగ్గజాలు సంయుక్తంగా ఈ ప్రతిపాదనను సిద్ధం చేశాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా దేశీయ సంస్థల భాగస్వామ్యంతో ఇక్కడే 94 జెట్లను ఉత్పత్తి చేయనున్నారు. కేవలం తయారీకే పరిమితం కాకుండా, కీలక సాంకేతిక పరిజ్ఞాన బదిలీతో పాటు స్వదేశీ అస్త్ర క్షిపణుల వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలను ఈ విమానాలకు అనుసంధానించడం కూడా ఈ ఒప్పందంలో ప్రధానాంశం. వాయుసేనలోని పాత మిగ్ విమానాలను దశలవారీగా ఉపసంహరిస్తుండటం, స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం ఎల్‌సిఎ తేజస్ సరఫరాలో జాప్యం నెలకొనడంతో స్క్వాడ్రన్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ లోటును భర్తీ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ భారీ ఒప్పందంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఒప్పందం ద్వారా దేశీయ ఏరోస్పేస్, రక్షణ రంగాలకు భారీ ఊపు లభించనుంది. దీనివల్ల టాటా, ఎల్ అండ్ టి వంటి భారతీయ కంపెనీలకు సుమారు రూ.1.6 లక్షల కోట్ల మేర వ్యాపార అవకాశాలు దక్కుతాయని అంచనా. ప్రస్తుతం ఈ ప్రతిపాదన రక్షణ మంత్రిత్వ శాఖ, వాయుసేన సేకరణ విభాగాల పరిశీలనలో ఉంది. ఇప్పటికే వాయుసేన, నౌకాదళం కోసం భారత్ 62 రఫేల్ జెట్లను ఆర్డర్ చేయగా, ఈ కొత్త ఒప్పందం పూర్తయితే భారత వాయుసేనలో వీటి మొత్తం సంఖ్య 176కు చేరుకుంటుంది.

# శాంతియుత పరిష్కారానికి సిద్ధమే

## బెదరింపులకు లొంగేది లేదు: ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**టెహ్రాన్, ఆగస్టు 8:** అమెరికా సహా పాశ్చాత్య దేశాలు విధిస్తున్న ఆర్థిక, దౌత్యపరమైన ఆంక్షలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా స్పందించారు. శాంతియుత చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధమే అయినా, బలవంతపు ఆంక్షలు, బెదిరింపులతో తమను లొంగదీసుకోవచ్చని భావిస్తే అది అపోహ అవుతుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలతో పరస్పర గౌరవంతోకూడిన సంబంధాలనే కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. టెహ్రాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇరాన్ ఏ దేశంతోనూ యుద్ధాన్నిగానీ, ఉద్రిక్తతలనుగానీ కోరుకోవడం లేదు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధమని తెలిపారు. చర్చల పేరుతో ఏకపక్ష నిబంధనలు రుద్దాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆంక్షలు, బెదిరింపుల ద్వారా ఇరాన్‌ను లొంగదీసు కోవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.



# ఐఎఫ్‌ఫ్ వింగ్ కమాండర్ అరెస్టు

## పాక్ మహిళ హనీట్రాప్‌లో పడి రహస్య సమాచారం చేరవేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పాకిస్థానీ మహిళ హనీట్రాప్ వలలో చిక్కుకున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఎఫ్) వింగ్ కమాండర్ అధికారిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అతడు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన, రహస్యమైన సమాచారాన్ని ఆ మహిళకు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, ఆ అధికారి పేరును మాత్రం పోలీసులు వెల్లడించలేదు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఐఎఫ్ వింగ్ కమాండర్‌కు సోషల్ మీడియా ద్వారా ఒక మహిళ పరిచయమైంది. ఆమె.. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ సర్వీసెస్ కోసం పని చేస్తున్నది. ఇండియాకు చెందిన రక్షణ, రహస్య సమాచారాన్ని సేకరించడమే ఇలాంటి మహిళల లక్ష్యం.

రక్షణ అధికారులను హనీ ట్రాప్‌లో దించి, భారత రహస్యాలను సేకరిస్తుంటారు. ఈ ఘటనలో కూడా ఐఎఫ్ అధికారిని పాక్ మహిళ అలాగే హనీట్రాప్ లోకి దించింది. దాదాపు రెండేళ్లనుంచి వీరి మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. మొదట సోషల్ మీడియా ద్వారా పాక్ మహిళ వింగ్ కమాండర్‌ను పరిచయం చేసుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా అతడి ఫోన్‌లోకి ఒక రహస్య యాప్ ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పింది. అయితే, ఇందుకోసం అ అధికారి వేరే మొబైల్ ఉపయోగించాడు. ఈ యాప్ ఇక్కడి డాటా సేకరణకు ఉపయోగపడుతుంది. ఇదే సమయంలో మొబైల్ ద్వారా ఏం మాట్లాడుతున్నారో నిరంతరం వినే వీలుంటుంది. ఈ రహస్య యాప్ పనితీరు గురించి, ఇంకా పూర్తి వివరాలు తెలియవు. మరోవైపు ఐఎఫ్ అధికారికి బాగా దగ్గరైన ఆ మహిళతో అతడు రెగ్యులర్ చాటింగ్ చేసేవాడు. విడియో కాల్స్ చేసుకునేవాళ్లు. ఇక్కడి ఫొటోలు, విడియోలు తీసి అతడు ఆమెకు షేర్ చేసేవాడు.

అలాగే, రక్షణ విభాగానికి చెందిన రహస్య సమారాన్ని కూడా అతడు ఆమెకు చేరవేశాడు. ఆమె అడిగిన కీలక వివరాల్ని అందజేశాడు. ఈ విషయంపై నిఘా ఉంచిన ఐఎఫ్ ఉన్నతాధికారులు అతడిపై ఫిర్యాదు చేశారు. దీంతో గత మే 30న ఆ ఐఎఫ్ అధికారిని ఢిల్లీ పోలీసులు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ కింద అరెస్టు చేశారు. జుడీషియల్ కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. అతడు ఆమెకు ఏ సమాచారం చేరవేశారు వంటి వివరాలను పోలీసులు సేకరించారు. అలాగే, చాటింగ్, విడియో కాల్స్, విడియోలు, ఫొటోలను కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో కీలక విచారణ పూర్తయింది. దీంతో జులై 30న చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో కేసు విచారణ సాగుతోంది.

# సంక్షిప్త వార్తలు

## లోయలో పడిన బస్సు, ఏడుగురు మృతి



**సిమ్లా, ఆగస్టు 8:** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంబా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి సుమారు 100 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు డ్రైవర్, కండక్టర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శర్మ ట్రావెలర్స్‌కు చెందిన బస్సు శనివారం ఉదయం సుమారు 6.30 గంటలకు బైరాగఢ్ నుంచి చంబా పట్టణానికి బయలుదేరింది. దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత చాలుజ్ మలుపు వద్ద ప్రమాదం జరిగింది.

## పోర్చుగల్‌లో భారత్ మహిళకు హింసలు

**పూణె, ఆగస్టు 8:** యురోపియన్ దేశంలో నెలకు రూ. 1.5 లక్షల జీతంతో సూపర్‌మార్కెట్ క్యాషియర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, నాగ్‌పూర్‌కు చెందిన 28 యేళ్ల మహిళ నుంచి రూ.11 లక్షలు కాజేసిన ఘరానా మోసం పుణేలో వెలుగుచూసింది. పుణే కేంద్రంగా పనిచేస్తున్న ఒక జాబ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ బాధితురాలిని మే నెలలో పోర్చుగల్ పంపించగా, అక్కడ ఆమె పాస్‌పోర్టును లాక్కుని ఆమెను ఓ బీరు షాప్ యజమానికి విక్రయించారు. అక్కడ ఆమెతో బలవంతంగా పని చేయిస్తూ తీవ్రమైన మానసిక, శారీరక హింసకు గురిచేశారు.

## హర్మూజ్‌లో వాణిజ్య నౌకపై మళ్లీ దాడులు

**టెహ్రాన్, ఆగస్టు 8:** అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తూర్పు ముఖద్వారం వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఓ వాణిజ్య నౌకపై దాడి జరగడంతో అందులో భారీగా మంటలు చెలరేగాయి. నౌక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూ, సహాయం కోసం అత్యవసర సందేశాలు పంపారు. చైనాకు చెందిన జిన్హువా వార్తా సంస్థ సేకరించిన ఓడల మధ్య రేడియో సంభాషణల ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగిందని, దీంతో నౌక ఇంజిన్ రూమ్‌లో మంటలు వ్యాపించాయని సిబ్బంది తెలిపారు.

## ప్రధానిమోడీతో భేటీ అయిన ఎంపి రాఘవ్ ఛద్దా

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** రాజ్యసభ ఎంపీ, ఇటీవల ఆప్ నుంచి బిజెపిలో చేరిన రాఘవ్ చద్దా ప్రధాని మోడీతో శనివారం భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. పంజాబ్ ఎన్నికలకు ముందు బిజెపి చద్దాకు కీలక బాధ్యతలు అప్పగించబోతుందా అనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## నడిరోడ్డుపై కాంగ్రెస్‌నేత దారుణ హత్య

**ఉడుపి,ఆగస్టు 8:** నడిరోడ్డుపై కాంగ్రెస్ నేత దారుణహత్యకు గురయ్యారు. ఈ హత్యోదంతం మొత్తం సిసి కెమెరాల్లో రికార్డయింది. కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో ఈ దారుణం జరిగింది. స్థానిక కాంగ్రెస్ నేత, ప్రముఖ వ్యాపారవేత్త అయిన డేవిడ్ డిసౌజాను గుర్తుతెలియని దుండగులు అతి కిరాతకంగా కాల్చిచంపారు. రోడ్డు పక్కన ఆపి ఉన్న తన కారు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ దుండగుడు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ భయానక ఘటన మొత్తం అక్కడి సిసి టివి కెమెరాలో రికార్డయ్యింది.

## మోహన్‌లాల్‌కు వీసా తిరస్కరణ.. ఆస్ట్రేలియాలో షో వాయిదా



**సింగపూర్, ఆగస్టు 8:** మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు ఆస్ట్రేలియా వీసా సకాలంలో రాకపోవ డంతో సిడ్నీలో జరగాల్సిన ఆయన లైవ్ షో వాయిదాపడింది. ఆస్ట్రేలియాలోని నార్‌వెస్ట్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం 'వైకిట్టు ఎంద పరిపాడి' అనే కార్యక్రమంలో మోహన్‌లాల్‌తోపాటు పలువురు హాజరు కావాల్సి ఉంది. కానీ, వీసా మంజూరు ప్రక్రియలో అనూహ్యజాప్యం కారణంగా ఆయన ఆస్ట్రేలియా వెళ్లలేకపోయారు. దీంతో నిర్వాహకులు ఈ షోను వాయిదా వేశారు. ప్రస్తుతం వీసా కోసం ఎదురుచూస్తూ సింగపూర్‌లో ఉన్న మోహన్‌లాల్.. ఆస్ట్రేలియాలోని తన అభిమానులకు సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు చెప్తూ ఓ విడియో పోస్టు చేశారు.

# చిలుక వాహనంపై దేవేరితో చిద్విలాసం



చిలుక వాహనంపై సుబ్రమణ్యం స్వామి దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం లోని చెంగల్వారాయస్వామి ఆలయం, విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి చిలుక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా రాజేష్ గురుకుల్, సూరిగురుకుల్స్ ముస్తాబు చేసారు. శుక్రవారం రాత్రి తెప్పోత్స వానికి తీర్చి దిద్దిన శూలం అలంకారంలో తీర్చి దిద్దారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా అలంకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్ వెంకటస్వామి హాజరై హారతులివ్వగా ఉత్సవ మూర్తులను ప్రాకారంలో ఆలయ ఇఒ వెంకటేశులు మోసారు. తరువాత యాగశాలలో హారతులిచ్చి బోయిలు మోసుకొని వచ్చి వాహనాల మండపం వద్ద చిలుక వాహనంపై స్వామి అమ్మవార్ల ప్రతిష్టించారు. ఆలయాధికారి, దఫేదార్ వెంటరాగా ఉత్సవం మేళ తాళాలతో ముందుకు సాగింది. శనివారం కావటంతో స్థానిక భక్తులతో పాటు తమిళనాడు, కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవం తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, బాబు అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల మీదుగా సాగి ఆలయానికి చేరింది. బిక్షాల గాలి గోపురం వద్ద నాయి బ్రాహ్మణుల సంగీత నీరాజనం భక్తుల్ని అకట్టుకుంది.



## తిరుపతి సోనోవిజన్ షోరూమ్‌లో దొంగతనం

# రూ.2 కోట్ల విలువైన ఫోన్ల చోరీ

**తిరుపతిక్రైమ్,ఆగస్టు 8ప్రభాతవార్త:** తిరుపతినగరంలోని ప్రధానమార్గం అన్నమయ్య కూడలి వద్ద ఉన్న సోనోవిజన్ షోరూమ్‌లో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం షట్టర్ తెరచి భారీ చోరీ జరిగింది. 50 యాపిల్ ఐఫోన్లు, ఇతర కంపెనీలకు చెందిన మరో 200 సెల్ ఫోన్లతోపాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులను అపహరించారని బాధిత యజమాని ఫిర్యాదు. శనివారం ఉదయం షోరూమ్ తెరిచి లోపలికి వెళ్లిన సిబ్బందికి.. వస్తువులు చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే ఎస్వీ యూనివర్సిటీ పోలీసులకు,క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన సోనోవిజన్ షాపుతోపాటు పరిసర ప్రాంతాల్లోని సిసి టీవీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన వస్తువుల విలువ దాదాపు 2 కోట్లు రూపాయలు ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో షాపు సిబ్బంది పేర్కొన్నారు.




# రియల్ ఎస్టేట్ అభివృద్ధితో రాష్ట్రానికి ఆదాయం: మంత్రి నారాయణ

**తిరుపతి,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడం ద్వారా ప్రజలకు సొంతింటి కల నెరవేరడమేగాక రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. గృహ నిర్మాణం, స్థలాలు, స్థిరాస్తుల కొనుగోలు, పెట్టుబడుల విషయంలో ప్రజలకు పూర్తి అవగాహన అవసరమని పేర్కొన్నారు. తిరుపతిలో శ్రీ కన్వెన్షన్ హాల్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో చేపట్టిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో-2026 రెండవ రోజు శనివారం మధ్యాహ్నం మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రియల్ ఎస్టేట్ సంస్థల స్టాళ్లను పరిశీలించి, గృహ నిర్మాణ ప్రాజెక్టులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతుల వివరాలను తెలుసుకున్నారు.ఇల్లు లేదా స్థలం కొనుగోలు చేసే ముందు పత్రాలు, అనుమతులు, లేఅవుట్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. నమ్మకమైన సంస్థల ద్వారా స్థిరాస్తులను కొనుగోలు చేయాలని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధితో సిమెంట్, స్టీల్, విద్యుత్, ప్లంబింగ్, పెయింట్స్, ఫర్నిచర్, రవాణా తదితర అనుబంధ రంగాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నిర్మాణ కార్యకలాపాలు పెరగడం ద్వారా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.తిరుపతి నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, ప్రజా రవాణా వంటి మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ద్వారా వివిధ గృహ నిర్మాణ ప్రాజెక్టులు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వాణిజ్య సముదాయాల వివరాలను ప్రజలు ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం లభిస్తోందని క్రెడాయ్ ప్రతి నిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె. గోపినాథ్, అధ్యక్షుడు రాంప్రసాద్, కార్యదర్శి రాజేష్‌బాబు ,ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్



తిరుపతి జిల్లా కలెక్టర్
డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్

**తిరుపతి,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో రానున్న 15వ తేదీ నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, క్రమబద్ధంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేపట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం ఉదయం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా సంయుక్తకలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఇతర జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలు, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను వెంటనే చేపట్టి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి సమన్వయ లోపం చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర దేవా దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు.

# కాణిపాకంలో భక్తుల రద్దీ

## దర్శనానికి నాలుగు గంటల సమయం



**కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధివినాయక స్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో కాణిపాకం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారాంతపు రోజులు శని, ఆదివారాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది.ఈమేరకు శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఈమేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతంక్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు,నాలుగుగంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితినెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

# తాళంబేడులో వాచ్‌మెన్ దారుణహత్య

## నాటుబాంబు వేసి ఇంట్లో దొంగతనానికి యత్నం

**చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త:** చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు పంచాయతీ మంగాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి దుండగులు ఒక ఇంటికి కాపలా వున్న వాచ్‌మెన్ ఆనందరావును దారుణంగా హత్య చేశారు. వివరాలు చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు పంచాయతీ మంగాపురం గ్రామంలో నివాసం వుంటున్న పట్టాభినాయుడు ఆమెరికాలో వుం టున్నాడు. పట్టాబినాయుడుకు చెందిన ఆస్తి వ్యవహారాలు అతని సోదరి విజయ, ఆమె భర్త వెంకటేష్‌లు చూస్తుంటారు. పట్టాభినాయుడుకు చెందిన తోటకు బాపట్లకు చెందిన ఆనందరావు గత కొన్ని రోజులుగా కాపలాగా వుండి విజయ, వెంకటేష్‌లు చెప్పే చిన్నచిన్న పనులు చేస్తూ వుండేవాడు. ఈ క్రమంలో పట్టాభినాయుడు ఇంటిపై కన్నేసిన దుండగులు ఇంట్లో చొరబడి భారీగా దొంగతనం చేయడానికి పక్కా స్కెచ్ వేశారు. ఈ మేరకు ఇంట్లో ప్రవేశించడానికి ఇంటికి అమర్చిన అద్దాలను నాటు బాంబులతో పేల్చి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనం చేయాలని భావించారు. ఈ మేరకు పట్టాభినాయుడు ఇంటి ఆవరణలోకి వచ్చిన దుండగలను అక్కడే కాపలా వున్న ఆనందరావు చూసి అరిచాడు. ఈ అరుపులు విన్న దుండగులు ఆనందరావుపై దాడి చేసి కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఆపై ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన దుండుగలు తాము తీసుకువచ్చిన నాటు బాంబును ఇంటిలో అమర్చిన అద్దాలపై వేయడంతో పెద్ద శబ్దం వచ్చింది. ఈ శబ్దం విని ఇంట్లో నిద్రిస్తున్న పటాభినాయుడు సోదరి విజయ, ఆమె భర్త వెంకటేష్‌లు హుటాహుటిన ఇంటి వెలుపలికి రావడం, అక్కడ వాచ్‌మెన్ హత్యకు గురై వుండటంతో భయభ్రాంతులకు గురైన వారు పెద్దగా కేకలు వేశారు. ఈ కేకలు విన్న దుండగలు ఇంటికి సమీపంలో వున్న తోటలో ప్రవేశించి అక్కడి నుండి పరారీ అయ్యారు. ఈ మేరకు మంగాపురంలో హత్య జరిగిన విషయం తెలిసిన వెంటనే చిత్తూరు డీఎస్పీ వెంకట నారాయణ హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న చిత్తూరు తాలుకా ఇన్స్‌పెక్టర్, బిఎన్ ఆర్‌పేట ఎస్ఐలు హత్యకు గురైన ఆనందరావు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య చేయడానికి దుండుగులు నాటు బాంబు ప్రయోగించడంపై ఈ హత్యను స్థానికులు ఎవరైనా పాల్పడ్డారా! లేక బయటి వ్యక్తులు ఇంటి పరిస్థితిని అంచనా వేసి దొంగతనానికి వచ్చారా! అనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు పోలీసు డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు సంఘటనా స్థలంకు చేరుకుని వేలిముద్రలను సేకరించారు. చిత్తూరు క్రైం స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమా మహేశ్వర్‌రావు, కాణిపాకం, పెనుమూరు, గుడిపాలఎస్‌ఐలు సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు.బిఎన్‌ఆర్‌పేట ఎస్ఐ మణికంతేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి యేటా అమరావతి చిత్రకళా వీధి: మంత్రి కందుల దుర్గేష్



**గుంటూరు,ఆగస్టు 8,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శని, ఆదివారాలు ఆగస్టు 8, 9 తేదీలలో ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటెపాడు విద్యానగర్ రోడ్డులో అత్యంత వైభవంగా జరుగుతోన్న అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజయ్యారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కీలకో పన్యాసం చేశారు. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజులు హాజరై ప్రత్యేకంగా ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మన రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల అత్యున్నత సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి చిత్రకళా వీధి లో ప్రదర్శించిన అద్భుత కళాఖండాలు కళాకారుల గొప్పతనానికి, అనితర సాధ్యమైన ప్రతిభకు అద్దం పడుతున్నాయని కొనియాడారు.గతంలో కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించాలంటే ఆర్ట్ గ్యాలరీలోని నాలుగు గోడలకే పరిమితమయ్యే వారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ గోడలను ఛేదించి అమరావతి చిత్రకళా వీధి వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా కళలను బహిరంగ ప్రాంగణాల్లోకి తీసుకొచ్చి ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప అవకాశం కల్పించిందని తెలిపారు. గతంలో రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రాజకీయ చైతన్యం కలిగిన గుంటూరు నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, మంత్రి దుర్గేష్ చెప్పారు. ఇది కేవలం చిత్రకళా ప్రదర్శన మాత్రమే కాదు.. కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు, సాధారణ ప్రజలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చిన సృజనాత్మక ఉద్యమంగా అభివర్ణించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్ర, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, గుంటూరు జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, రాయపాటి శైలజ, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, ఔత్సాహిక కళాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించే వరకు విధులు నిలిపివేస్తాం

## ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఎసి హెచ్చరిక

**విజయవాడ, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఒకపక్క ప్రెసిడెన్షియల్ ఆర్డర్ పేరుతో ఉద్యోగులను భయాందోళనలకు గురి చేస్తున్నారని, ఆగస్టు 5వ తేదీ లోపు ఉద్యోగుల జిల్లాల విభజన పూర్తవుతుందని, ఉద్యోగులను సీనియార్టీ ప్రకారం ఆప్షన్లు తీసుకుని వారికి కావలసిన జిల్లాలకు కేటాయిస్తారని, జిల్లా క్యాడర్ పోస్టులు, మల్టీ జోన్, జోనల్ పోస్టులు పై పూర్తిస్థాయిలో ఆగస్టు 15 తేదీ లోపు ఉద్యోగుల జిల్లాల విభజన పూర్తిగా జరుగుతుందని ఉన్నత అధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కూడా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో కూడా ఎటు వంటి నిర్ణయాలు తీసుకోపోవడంతో ఉద్యోగులు ఏం జరుగుతుందని ఆందోళన చెందుతూ ఉంటే, మరొక ప్రక్క ప్రమోషన్లు కు సంబంధించి బ్యాన్ ఉందని అధికారులు చెప్పడం, కాలయాపన చేయడం తో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం భూపతిరాజు, ప్రధాన కార్యదర్శిబి. మధుబాబు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

అలాగే ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద నిర్వహిస్తున్న వీఆర్‌ఏల ధర్నా కార్యక్రమానికి మరియు ఈనెల 17, 18, 19 తేదీల్లో సీసీఎల్ఏ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు నిర్వహించే రిలే నిరాహార దీక్షలకు అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ మద్దతుగా వారికి అండగా ఉంటామని వెంటనే వీఆర్‌ఏల, వీఆర్వోల, సర్వేర్ల సమస్యలు పరిష్కరించకపోతే, అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ సమావేశం ఏర్పాటు చేసుకుని వీఆర్ఏ, వీఆర్వో, సర్వేర్లు అందరూ కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని,మా సమస్యలు పరిష్కారమయ్యే వరకు అవసరమైతే రెవెన్యూ విధులు పూర్తిగా నిలిపివేస్తామని హెచ్చరించారు.

# అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, (గజపతినగరం), ఆగస్టు 8 ప్రభాతవార్త:** రైతన్నల శ్రేయస్సు కోసం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్త కాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గజపతి నగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం వింధ్యావాసి గ్రామంలో శనివారం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రీ సర్వే పూర్తయిన 309 మంది రైతులకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. గత ప్రభుత్వంలో పట్టాదారు పాసు పుస్తకాలపై మరియు సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించి పంపిణీ చేశారని, దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందజేసి రైతన్నలకు అండగా నిలుస్తామని ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో రీ సర్వే చేసి పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ ఛైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

**పార్వతీపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త :** గిరిజనుల ఆర్థిక పురోగతికి, స్వయం సమృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఐటిడిఏ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు జరిగాయి.

ఈ వేడుకలకు రాష్ట్ర, జిల్లా ఇంచార్జి మం త్రి అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గిరిజనుల స్థితిగతులను సమూలంగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ కి దక్కుతుందని అన్నారు.



దిలీప్ కుమార్ (ఫైల్)

# అమెరికా రోడ్డు ప్రమాదంలో చిట్వేలి వాసి మృతి

**చిట్వేలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** అమెరికా, కెంట్ పట్టణంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న తిరుపతి జిల్లా చిట్వేలి మండలం జెట్టివారి పల్లి గ్రామానికి చెందిన బుంగటావుల శ్రీహరి పెద్ద కుమారుడు బుంగటావుల దిలీప్ కుమార్ (27) భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 7:15 లకు కెంట్ నగరంలో జరిగిన కారు ప్రమాదంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన తాను గడిచిన మూడు సంవత్సరాల నుంచి అమెరికాలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. తమకు తోడుగా నిలవాల్సిన కుమారుడు తమ నుంచి దూరం కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# వివేకా హత్యకేసులో పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలి

## రాష్ట్రపతికి డా.సునీతా వినతిపత్రం



**పులివెందుల, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన తండ్రి హత్య జరిగి ఏడేళ్లు పూర్తయినా ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని పేర్కొంటూ ఆయన కుమార్తె డా. సునీతా నర్రెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమగ్ర వినతిపత్రం సమర్పించారు. కేసులోని అన్ని కోణాలను లోతుగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలికి తీయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.తన వినతిపత్రంలో సీబీఐ దర్యాప్తు, అనంతర న్యాయపరమైన పరిణామాలు, కోర్టు విచారణల వివరాలను ప్రస్తావించిన సునీత,ఇప్పటికీ కొన్ని కీలక అంశాలు పూర్తిగా వెలుగులోకి రాలేదని పేర్కొన్నారు. ఈ లేఖ ప్రతులను ప్రధాని, కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, కేబినెట్ కార్యదర్శి, సీబీఐ డైరెక్టర్, తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రు లకు కూడా పంపినట్లు తెలిపారు. వివేకానందరెడ్డి హత్య వెనుక పెద్ద కుట్ర ఉందని, కేసులోని అన్ని వాస్తవాలు బహిర్గతమయ్యేలా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని సునీత తన వినతిపత్రంలో పేర్కొన్నారు.

# పోలీసుల అదుపులో చింతాడ రవికుమార్

## పలువురు వైకాపా నేతలు?

**ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 8 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి జగన్ పలాస పర్యటనలో భాగంగా కొత్త రోడ్‌లో విధి నిర్వహణలో ఉన్న బూర్జ ఎస్సై ప్రవళికపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తో పాటు కార్యకర్తలు అనుచితముగా ప్రవర్తించారని ఫిర్యాదు మేరకు చింతాడ రవితో పాటు 20 మందిపై పలు సెక్షన్ల కింద ఆమదాలవలస పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా ఆ రోజు నుంచి వైకాపా సమన్వ యకర్త చింతాడ రవికుమార్‌తో పాటు 20 మంది వైకాపా కార్యకర్తలు పరారీలో ఉన్నారు. ఆ రోజు నుంచి ఉన్నత అధికారులు ఒత్తిడి మేరకు ఆమదాలవలస పోలీసులు 11 బృందాలతో గాలిస్తున్నారు. అంతటితో ఆగకుండా సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఒక వీడియో విడుదల చేశారు. నేను ఎక్కడికి పారిపోలేదు మా కార్యకర్తలపై కేసులు ఎత్తివేస్తే ఒక గంటలో నేను లొంగిపోతానని సోషల్ మీడియాలో వీడియో విడుదల చేయడంతో పోలీసు ఉన్నత అధికారులు అప్పటినుండి చింతాడ రవికుమార్ అనుచరులపై నిఘా పెంచారు. వారి అనుచరులు ఫోన్ కాల్‌పై మరింత నిఘా పెంచి పక్కా ప్రణాళికలతో పలువురు వైకాపా నేతలను శుక్రవారం రాత్రి విచారణ పేరుతో తీసుకెళ్లినట్టు బోగట్టా. అదేవిధంగా వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ డీఎస్పీ ఎదుట లొంగిపోవడానికి శనివారం రాత్రి విశాఖపట్నం నుండి వస్తుండగా ఎచ్చెర్ల దగ్గర పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమా చారం. వారితోపాటు వైకాపా నాయకులైన బొడ్డేపల్లి రమేష్ కుమార్, చింతాడ రవికుమార్ తమ్ముడు కృష్ణను విచారణ పేరుతో అదుపులో తీసుకున్నారని రమేష్ కుమార్ భార్య అజంతా కుమారి ఆరోపించారు. ఇప్పటికే వారిని పోలీసులు అదుపులో తీసుకున్నారని వైకాపా కార్యకర్తలకు తెలియడంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అయితే వారు అక్కడ లేరని తెలియడంతో వైకాపా కార్యకర్తలు ఆందోళన చెందారు. వీరిని విచారణ పేరుతో నరసన్నపేట, గార పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం రావడంతో వైకాపా కార్యకర్తలు ఆందోళన చెందారు.వీరితోపాటు రొట్టవలస మాజీ సర్పంచ్ మూడడ్ల రమణమూర్తి, బూర్జ మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, కొల్లివలసకి చెందిన ఎస్ శివ ను అదుపులో తీసుకున్నట్లు ఆమదలవలసలో చర్చి సాగుతోంది.

# ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూల నిర్ణయం తీసుకోవాలి

**పీఆర్‌సీ, ఐఆర్, డీఏలపై ఉద్యోగుల ఎదురుచూపులకు తెరదించాలి**

**ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్**



**నెల్లూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త-కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సత్వరమే పరిష్కరించాలని, తక్షణమే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత రెవెన్యూ మొత్తం ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లకే ఖర్చవుతోందని చెప్పడం భావ్యం కాదని, అన్ని రాష్ట్రాల ఉద్యోగులతో పాటే జీతాలు తీసుకుంటున్నామని, ఎక్కువ చెల్లించటంలేమీ జరగటం లేదని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వాలు వారి రాజకీయ అజెండాలో భాగంగా నియామకాలు జరుగుతున్నాయని, నిర్ణయాలు తీసుకుంటున్నాయని, లక్షలాదిమంది నియామకాలు చేస్తున్నాయని, అందులో సగటు ఉద్యోగి బాధ్యత ఏముందని ప్రశ్నించారు. ఒకవేళ జీతాల వద్దు మితిమీరి పోయిందని భావిస్తే, ప్రభుత్వాలు అటువంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఆలోచించుకోవాలన్నారు. సగటు ఎన్నుకొన్న ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు సగటు ఉద్యోగి బలికాకుండా చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. నెల్లూరు పర్యటనలో భాగంగా శనివారం నగరంలోని ఎన్‌జీవో హోమ్‌లో ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలు ఇతర నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ సొంత రెవెన్యూ ఆదాయంతో పోలుస్తూ చూడటం సరికాదన్నారు. ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో 35 శాతానికి మించి ఉద్యోగుల జీతాలు వద్దు లేదని తెలిపారు. ఒకవేళ 2026-27 లెక్కల ప్రకారం కూడా సొంత రెవెన్యూ ఆదాయం చూసినా 1,40,000 కోట్ల రూపాయల్లో జీతాల వద్దును గమనిస్తే 60 శాతానికి మించలేదన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో పీఆర్‌సీ ప్రక్రియ ముందుకు సాగుతూ, ఐఆర్ కూడా ప్రకటించిన పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పీఆర్‌సీ కమిషన్ నియామకమే జరగకపోవడం ఉద్యోగుల నిరాశనిస్పృహలకు కారణమవుతోందన్నారు. అందువల్ల ఇప్పటికైనా తక్షణమే స్పందించి 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించడంతో పాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మంత్రివర్గ బృందం చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని. త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగ సంఘాల నాయకులతో జరిగే సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఒక కొలిక్కి వస్తుందని ఆశిస్తున్నామన్నారు. పీఆర్‌సీ, ఐఆర్, పెండింగ్ డీఏలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని ఉద్యోగులకు భరోసా కల్పించాలని, పెన్షనర్ల అడిషనల్ క్వాంటం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల వర్కులు తీసుకోవాలని ఉద్యోగుల అసంతృప్తి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమయ్యే పరిస్థితి వస్తుందన్న విషయాన్ని గుర్తించి సత్వరమే డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర కార్యదర్శి ఎల్.రజనీష్ బాబు, ఉపాధ్యక్షులు రవిశంకర్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి జి.రామకృష్ణ, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్ ఇతర నేతలు పాల్గొన్నారు.

# వినికిడిలోప ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి కృషి: చేజర్ల వేంకటేశ్వర రెడ్డి




**నెల్లూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త-వైద్యం:** ఆంధ్రప్రదేశ్ వినికిడి లోపం గల ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని టౌన్ హాలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ వినికిడి లోపం గల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 10వ వార్షికోత్సవ మహాసభలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర ఎన్జీఓ నేతలు ఇతర ముఖ్య అతిథులతో కలిసి తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడిచ్చిన లోపం ఉన్నప్పటికీ నిబద్ధతతో పని చేయడంలో వీరికి ఎవరూ సాటిరారని అన్నారు. దివ్యాంగుల పెన్షన్ పెంపుదలే కాకుండా,ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 10 సంవత్సరాల క్రితం 100 మందితో స్థాపించిన ఆంధ్రప్రదేశ్ వినికిడి లోపం గల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దినదినాభివృద్ధి చెంది నేడు 1000 మందికి పైగా సభ్యులతో బలమైన సంఘంగా ఎదగడం సంతోషకరం అన్నారు. ఈ 10 సంవత్సరాల కాలంలో ఈ సంఘం వినికిడి లోపం గల ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేసేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ పెంపుదలే కాకుండా, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ వినికిడి లోపం గల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో శుక్రవారం జరిగిన క్రీడలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు ప్రధానం చేశారు.


# ప్రియాంక ఘటనపై ఎస్పీతో మాట్లాడిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

**విజయవాడ.ఆగస్టు 8,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం మత్తులో యువకుల దారుణానికి రాజమహేంద్ర వరం డాక్టర్ ప్రియాంక నిండు ప్రాణం బలికావడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. డాక్టర్ ప్రియాంక మృతి ఘటనపై ఎస్పీతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం జరిగేలా, నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. ఈ ఘటన పై కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తున్న అవాస్తవ, తప్పుడు కథనాలను రాయపాటి శైలజ ఖండిం చారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి మరింత బాధ కలిగించేలా వ్యవహరించొద్దని హితవుపలికారు.

# ముగిసిన వైకాపా జంజీవార్ రిలే నిరాహార దీక్షలు

**డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేవరకు పోరు ఆగదు**

**ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి**



**నెల్లూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త-విద్య :** 2025 డిఎస్సీలో జరిగిన అన్యాయ్యాలు, అవినీతిని బట్టబయలుచేసి మంత్రి లోకేష్ రాజీనామా చేసేవరకు తమ పోరు ఆగదని వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మోగా డిఎస్సీ 2025లో జరిగిన అవినీతికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయ్యాలని డిమాండ్ చేస్తూ తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక విఆర్‌సి సెంటర్‌లో నిర్వహిస్తున్న జంజీవార్ రిలే నిరాహార దీక్షలు శనివారం మూడువరోజు ముగిసాయి.ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని దీక్షాశిబిరంలోని నాయకులకు మద్దతు పలికారు. అనంతరం వారిచేత దీక్ష విరమణ గావించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతు అద్యాపకుల పోస్టులను అమ్ముకున్న చరిత్ర కూటమి ప్రభుత్వందేనని దుయ్యబట్టారు.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతు మాట్లాడుతు మోగా డిఎస్సీ పేరుతో సుమారు 4 లక్షల మంది అభ్యర్దులను ఈ కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల తయారీ దగ్గర నుండి , పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, క్యాటగిరీల ప్రకటన, స్పోర్ట్స్ కోటా ఇలా అన్నీ విభాగాల్లో అడుగడుగునా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. డిఎస్సీ అభ్యర్దులకు న్యాయం జరిగే వరకు, మంత్రి లోకేష్ రాజీనామా చేసేవరకు తమ పోరు ఆగదని ఆయన స్పష్టం చేశారు. గత మూడురోజులుగా తమ పిలుతో వేలాదిగా తరలివచ్చి దీక్షలను విజయవంతం చేసిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# నాదెండ్ల బ్రహ్మం చౌదరిని పరామర్శించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు 8, ప్రభాతవార్తప్రతినిధి:** కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ని సీఎం కలిశారు. తాడేపల్లిలోని బ్రహ్మం నివాసానికి వెళ్లి చంద్రబాబు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, టీడీపీ, తాను అండగా ఉంటామని బ్రహ్మం చౌదరికి, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఆయన పూర్తిగా కోలుకునే వరకు పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం జులై 17న అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆయన్ని వెంటనే గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షి ంచిన వైద్యులు ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు నిర్ధారించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహా పార్టీ నేతలంతా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్రహ్మం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ మేరకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సీఎం ఆదేశిం చారు. మరోవైపు, పలువురు నేతలు ఆస్పత్రికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. కాగా, చికిత్స అనంతరం తన నివాసానికి వచ్చిన బ్రహ్మం చౌదరిని సీఎం చంద్రబాబు నేడు పరామర్శించారు.



# వైసీపీ గ్రాఫ్ పడిపోతోంది: మంత్రి నారాయణ

**నెల్లూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త-వైద్యం :** వైసీపీ గ్రాఫ్ పడిపోతోందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం మంత్రి నారాయణ ప్రజల వద్దకే మంత్రి కార్యక్రమంతో ప్రజా సమస్యల పరిష్కారానికి భరోసా కల్పించారు. 15, 8, 10 డివిజన్లలో అధికారులతో కలిసి మంత్రి నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ స్థానికుల నుంచి వినతుల స్వీకరించి ఏళ్లనాటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామన్నారు. అలాగే సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు నగర నియోజకవర్గంలోని 15, 8, 10 డివిజన్లలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, ఎంఆర్వో వెంకటలక్ష్మి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నాయకులు తిరుమల నాయుడు, పెంచల చౌదరి, బీసీ బాబు, ధర్మవరం సుబ్బారావు, శేఖర్, హేమంత్, గయాజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మకు ఇంజినీరింగ్ విభాగం ఆషాఢం సారె



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 8, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం శనివారం సారె సమర్పించారు. ఈఈ రమాదేవి, డిఈఈ అశోక్ కుమార్, రవీంద్ర తదితరులు జమ్మి దొడ్డి నుండి ఊరేగింపు గా దేవస్థానంకు చేరుకున్నారు. అక్కడ ఆలయ ఈవో శీనా నాయక్ ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య వారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణలతో స్వాగతించారు. శ్రీ అమ్మవారి దర్శనం అనంతరం 6వ అంతస్తులో సారె సమర్పణ చేశారు. ఆషాఢ సారె 25వ రోజు శనివారం సాయంత్రం 5 గంటల వరకు 59 సారె బృందాలలో 21,342 మంది భక్తులు సారె సమర్పణ చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.2,50,000ల విరాళాన్ని శనివారం కర్నాటక రాష్ట్రం, రాయచూర్‌కు చెందిన కె వేంకటరావు, పార్వతి దంపతులు విరాళంగా అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**భక్తసంద్రంగా ఇంద్రకీలాద్రి :**

రెండవ శనివారం సెలవు కారణంగా దుర్గమ్మవారి ఆలయం భక్తసంద్రంగా మారింది. దీంతో అన్ని క్యూలైన్లు ఉచిత దర్శనంగా మారుస్తూ ఇఓ వికె శీనా నాయక్‌దర్శన టికెట్లు అమ్మకం నిలిపేశారు. అంతరాలయ దర్శనం, విఐపి దర్శనాలను సాయంత్రం 6 గంటల వరకు నిలిపేశారు. దీంతో భక్తులకు త్వరితంగా దర్శనమయింది.

# తిరుమలలో దళారులు అరెస్ట్

**నకిలీ ఆధార్ కార్డులతో గదులు పొంది అధిక ధరలకు విక్రయం**

**తిరుమల,ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు కేటాయించే గదులను నకిలీ ఆధార్ కార్డులు మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అక్రమంగా పొంది వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్న దళారీల ముఠాను తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.తిరుమలలో రూమ్ దళారీల అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసు విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టారు.శనివారం ఉదయం సిఆర్‌ఒ కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా గదులు పొందేందుకు ప్రయత్నిస్తున్న ఆరుగురు వ్యక్తులను సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు ఒక ముఠాగా ఏర్పడి నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి, వాటిలో ఫొటోలను మార్ఫింగ్ చేసి, వాటి ద్వారా గదులు పొందుతున్నట్లు వెల్లడైంది.అనంతరం ఆ గదులను గదులు లభించని భక్తులకు టిటిడి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తానికి విక్రయిస్తూ అక్రమంగా



డబ్బులు సంపాదిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బి. శ్రీనివాస్ (46), ఇరప్ప కాలప్ప (43), విష్ణు వర్ధన్ (33), అమూల్ కుమార్ సింగ్ (27), ఎస్. ప్రకాష్ (39), పి. సందీప్ (20) ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి గది బుకింగ్‌లు, నకిలీ గుర్తింపు పత్రాలకు సంబంధించిన కార్యకలాపాలకు ఉపయోగించిన సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి: పలువురికి గాయాలు



**పొదిలి, ఆగస్టు 8, ప్రభాతవార్త:** పొదిలి కాటూరివారిపాలెం ఎర్రవాగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ బ్రహ్మారెడ్డి తీవ్ర గాయాలకు గురై ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విద్యుత్ స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ కాటూరివారిపాలెం సమీపంలో ఎర్రవాగు వద్ద టైర్ పంచర్ అయింది. దీంతో డ్రైవర్ మర్రిచెట్లపాలెం నుంచి మెకానిక్ ను పిలిపించుకుని వాహనం టైర్ మార్చేందుకు ఉపక్రమిస్తూ లారీ కిందకు చేరాడు. కింద జాకీ ఎత్తి మరమ్మత్తులు వేస్తుండగా అదే సమయంలో ఒంగోలు నుంచి మార్కాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ కుదుపుతో లారీ కింద ఉన్న డ్రైవర్ పోరెడ్డి బ్రహ్మారెడ్డి వాహన ముందు కదలడంతో చక్రాల కింద పడి నలిగిపోయాడు. కాళ్లు నడుము వరకు పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. కొన ఊపిరితో ఉన్న లారీ డ్రైవర్ పోరెడ్డి బ్రహ్మారెడ్డిని రక్షించేందుకు స్థానికులు విశ్వప్రయత్నం బరువైన విద్యుత్ స్తంభాలు లారీపై ఉండడంతో వీలుపడలేదు. పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడిది రేణింగవరం గ్రామంగా గుర్తించారు. బస్సులో ఉన్న డ్రైవర్‌తో పాటు 20 మందికి పైగా స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పొదిలి సీఐ రాజేష్ కుమార్, ఎస్సై రాజేష్‌లు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పునరుద్దరించారు. కనిగిరి డీఎస్పీ శ్రీధర్ ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



# డీఎస్సీ అక్రమాలపై మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

**మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి డిమాండ్**

**కావలి (నెల్లూరు), ఆగస్టు 8, ప్రభాతవార్త :** డీఎస్సీలోజరిగిన కార్యక్రమాలపై మంత్రి నారా లోకేష్ బాబు రాజీనామా చేయాలని సీబీఐతో విచారణ జరిపించాలని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వైసీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్లో చేపట్టిన నిరసన నిరాహార దీక్ష కార్యక్రమంలో వైసీపీ కావలి 24వ వార్డు నుండి 40వ వార్డు నాయకులు అల్లూరు, బోగులు మండలాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. అక్రమాలు జరగలేదని సీబీఐతో విచారణ జరిపించి నిరూపించుకోవాలని , లేని పక్షంలో మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌లో అక్రమాలు జరిగాయని విద్యార్థుల కోరిక మేరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయడం జరిగిందని తెలియజేశారు. మన రాష్ట్రంలో డీఎస్సీ పై అక్రమాలు జరిగాయని మంత్రి నారా లోకేష్‌బాబు రాజీనామా కోరడం జరిగిందని, దీనికి ఎద్దుపై ఈగ వాలిన రకంగా ఉందని వారి పనితీరు అన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకట నారాయణ, జిల్లా కార్యదర్శిలు గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు తగదు : విప్ యార్లగడ్డ

**హనుమాన్‌జంక్షన్(కృష్ణా), ఆగస్టు8, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న, సంక్షేమ, అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల తదితర అంశాలపై వైసిపి శాసనసభ్యులు అసె ంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా విమర్శలు, ఆరోపణలు చేయటం తగదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ వైసిపి నాయకులకు హితవు పలికారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలో శనివారం సాయంత్రం పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం 'రెండేళ్ళ నమ్మకం-అభివృద్ధిసంక్షేమం' కార్యక్రమంలో పాల్గ్గొని గత రెండుళ్ళుగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివ రించారు. ఈసందర్భంగాయార్లగడ్డ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్ర మాలపై ఏవిధమైన అనుమానాలు ఉన్నా అసెంబ్లీలో ప్రశ్నించే అధికారం ఎమ్మెల్యేలకు ఉందని, అటువంటి అవకాశాన్ని కాదని ప్రభు త్వంపై లేనిపోని విమర్శలు చేయటం దారుణ మన్నారు. వైసిపి ఎమ్మెల్యేలకు ప్రజాసమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈనెల 17నుండి జరు గబోయే అసెంబ్లీ సమావేశాలకు హాజ రయి ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించాలని సూచించారు.

# మానసిక ఒత్తిడి అధిగమించేందుకు చాగంటిచే అవగాహన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు8,ప్రభాతవార్త:** వత్తిడులను అదిగమించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసులకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తం గా శిక్షణ పొందుతున్న సుమారు 5,560 మంది ఎస్‌సీటీపీసీ కానిస్టేబుళ్లకు ఈ కార్యక్రమాన్ని చాగంటి కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ పోలీసు విధుల్లో మానసిక ఒత్తిడి సహజమే అయినప్పటికీ, దానిని సమర్థవంతం గా అధిగమించే మార్గాలను అలవర్చుకోవాలని సూచించారు. నిజాయతీ, క్రమశిక్షణ, ఓర్పు అనే విలువలు ప్రతి పోలీసు అధికారి, సిబ్బందిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు ఆశ్రయంగా వస్తారని, కష్టాల్లో ఉన్న వారి సమస్యలను ఓర్పుతో విని, సహానుభూతితో స్పందించడం ద్వారా "పోలీసు ఉన్నారనే భరోసా" ప్రతి పౌరుడిలో కల్పించగలమని అన్నారు. చిరాకు, ఆవేశం ప్రదర్శించడం వల్ల ఫిర్యాదుదారులు మరింత మనోవేదనకు గురవుతారని, అందువల్ల ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవడానికి హాస్య రచనలు, మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించిన ఆయన, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురవా రెడ్డి రచించిన "గురవాయణం" చిలకమర్తి లక్ష్మీనరసింహం హాస్య రచనలు, జంధ్యాల హాస్య రచనలు వంటి పుస్తకాలను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఐజీ అంబురాజన్, ఐపిఎస్, ఏ.ఐ.జి. ట్రైనింగ్ సత్తిబాబు, ఐపిఎస్ రాష్ట్రంలోని 21 పోలీసు శిక్షణా కళాశాలల ప్రిన్సిపాల్స్, కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఐపిఎస్,అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ వహంతి కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

# రూ.75లక్షల విలువచేసే వైద్యపరికరాలు అందచేత

**విజయవాడ, ఆగస్టు 8, ప్రభాతవార్త :** విజయవాడలోని సిద్దార్ధవైద్యకళాశాల పూర్వవిద్యార్ధులు కళాశాలలో రోగుల వైద్యచికిత్సకు అవసరమైన రూ.75లక్షల విలువచేసే 15 అత్యాధునిక వైద్య పరికరాలను అందచేసారు. శనివారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పాల్గొని పూర్వవిద్యార్ధులు అందించిన వైద్య పరికరాలను పరిశీలించి పూర్వవిద్యార్ధులను అభినందించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వవిద్యార్ధులు అందచేసిన అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావటం వల్ల రోగులకు నాణ్యమైన, సురక్షితమైన వైద్యసేవలు అందించేందుకు వీలుకలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ రఘునందన్, పూర్వవిద్యార్ధుల సంఘం కార్యదర్శి డాక్టర్ అమ్మన్న, ట్రాన్స్ ఫ్యూజన్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజిత తదితరులు పాల్గొన్నారు.




# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**వాహనం సీజ్, కేసు నమోదు**

**పొదలకూరు (నెల్లూరు), ఆగస్టు 8, ప్రభాతవార్త :** పొదలకూరు పంచాయతీ పరిధిలోని చిట్టెపల్లి నుండి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న అశోక్ లైలాండ్ బడా దోస్త్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు.నైట్ బీట్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది వాహనం నెం. ఏపీ 39 డబ్ల్యూ ఏ 1446ను చెక్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల అధికారి ఐ.పుల్లయ్య, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఐ.రవి వాహనాన్ని, స్టాక్‌ను తనిఖీ చేసి విచారణ జరిపితారు. విచారణలో పామర్తికి చెందిన పెంచల నరసయ్య, పెంచలయ్య ఆటో సహాయంతో, పామర్తి బాబును డ్రైవర్‌గా పెట్టుకుని, పొదలకూరు గ్రామ చౌక ధరల దుకాణం నెం.53 డీలర్ ప్రవీణ్ ద్వారా 29 గన్నీ బ్యాగుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు బాధ్యులపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ 59,450 రూపాయలు, వాహనం విలువ 3,00,000 రూపాయిలు అంచనా వేశారు. ఈ తనిఖీల్లో పొదలకూరు 4వ వీఆర్వో ఆర్. పోలిరెడ్డి పాల్గొన్నారు. బాధ్యులపై తగు చర్యల కోసం జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు.

ఆట

# కొరియా మాస్టర్స్‌లో ఫైనల్‌కు అష్మిత



**న్యూఢిల్లీ:** కొరియా మాస్టర్స్‌లో బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో అష్మిత చాలిహా తొలి ఫైనల్‌కు చేరుకుంది. కొరియా మాస్టర్స్ సూపర్ 300లో తన పరుగును కొనసాగిస్తూ, శనివారం ఇక్కడ జరిగిన పోరులో తన తోటి టీనేజ్ క్రీడాకారిణి రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్‌ను 48 నిమిషాల పోరులో 21-13, 16-21, 21-13 తేడాతో ఓడించి, అష్మిత చలిహా ఫైనల్‌కు అర్హత సాధించింది. 26 ఏళ్ల క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన టాప్ సీడ్, ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన హినా అకేచిని ఆశ్చర్యపరిచిన ఈ భారత క్రీడాకారిణి అష్మిత, దూకుడుగా ఆడి తొలి గేమ్‌లోనే 2-2 నుండి 6-2కు వేగంగా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఆమె వరుసగా ఐదు పాయింట్లు సాధించి 13-6 ఆధిక్యాన్ని నెలకొల్పి, 21-13 తేడాతో ఆటను ముగించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఒక గేమ్ వెనుకబడినప్పటికీ, మూడో సీడ్, స్వదేశీ క్రీడాకారిణి అయిన తన్వి శర్మను ఓడించిన రక్షిత, బలంగా పుంజుకుని 4-1 ఆధిక్యంతో దూసుకుపోయి, దానిని 12-6కు పెంచింది. ఆ తర్వాత అష్మిత వ్యూహాత్మకంగా వ్యవహరించి 13-12తో స్కోరును సమం చేసింది. కానీ రక్షిత తన సంయమనాన్ని కోల్పోకుండా 21-16తో నిర్ణయాత్మక సెట్‌కు దారితీసింది. అయితే, అష్మిత మూడవ గేమ్‌లో తిరిగి పట్టు సాధించి, 8-1 ఆధిక్యాన్ని సంపాదించి, ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని 21-13 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుని, తన మొదటి బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

# జావెలిన్ త్రోలో ఆశిష్‌కు రజతం

### మహిళ హై జంప్ ఫైనల్‌కు పూజా

**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్‌లో, పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారత్ అథ్లెట్ ఆశిష్ యాదవ్ రజత పతకం గెలుచుకోగా, జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ మహిళల హైజంప్ ఫైనల్‌కు అర్హత సాధించారు. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో యాదవ్ మూడవ రౌండ్‌లో 74.09 మీటర్ల త్రోతో రజత పతకాన్ని గెలుచుకోగా, బరిలో ఉన్న మరో భారతీయ క్రీడాకారుడు టి. ధరణిధరన్ 72.35 మీటర్లతో ఆరో స్థానంలో





నిలిచాడు. అలాగే మహిళల హై జంప్ ఈవెంట్‌లో, పూజ 1.79 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించింది. రెండు క్వాలిఫికేషన్ గ్రూపులలోని 14 మంది అథ్లెట్లలో, 1.79 మీటర్ల ఎత్తును అధిగమించగలిగిన వారందరికీ ఫైనల్‌లో స్థానాలు లభించాయి. 19 ఏళ్ల పూజ 1.93 మీటర్లతో జాతీయ సీనియర్ రికార్డును కలిగి ఉంది. పురుషుల లాంగ్ జంప్‌లో, క్వాలిఫికేషన్ రౌండ్ తర్వాత షానవాజ్ ఖాన్, జితిన్ అర్జున ఇద్దరూ ఫైనల్స్‌కు చేరుకున్నారు. షహనవాజ్ తన మూడవ మరియు చివరి ప్రయత్నంలో 7.73 మీటర్ల జంప్‌తో క్వాలిఫికేషన్ గ్రూప్ తిలో నాల్గవ స్థానంలో మరియు మొత్తంగా ఐదవ స్థానంలో నిలిచాడు. జితిన్ కూడా తన మూడవ మరియు చివరి ప్రయత్నంలో 7.57 మీటర్ల జంప్‌తో, మొత్తంగా 12వ స్థానంలో నిలిచి, అందుబాటులో ఉన్న చివరి స్థానాన్ని దక్కించుకుని ముందంజ వేశాడు.



## ఐస్ హాకీ ఛాలెంజర్స్ కప్.. ఛాంపియన్‌గా ఇండియన్ ఆర్మీ హాకీ జట్టు

**న్యూఢిల్లీ:** ఐస్ హాకీ ఛాలెంజర్స్ కప్ ఫైనల్‌లో లేహ్ కింగ్స్‌ను 6-5 తేడాతో ఓడించి ఇండియన్ ఆర్మీ హాకీ జట్టు తొలి ఛాంపియన్‌గా నిలిచింది. తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన ఈ టైటిల్ పోరులో లేహ్ కింగ్స్ జట్టు, భారత్ ఐస్ హాకీ జట్టుకు గట్టి పోటీ ఇచ్చి, చివరికి ఆఖరి నిమిషంలో నిర్ణయాత్మక గోల్‌ను సమర్పించుకుంది. ముస్తాక్ అహ్మద్ గిరి అందించిన కచ్చితమైన అసిస్ట్‌ను త్సెరింగ్ అంగ్‌చుక్ గోల్‌గా మలచడంతో కింగ్స్ బలంగా ప్రారంభించింది. ఆర్మీ ఐస్ హాకీ జట్టు స్టాన్జిన్ నమ్‌గైల్ సృష్టించిన ఒక కదలిక తర్వాత రిగ్జిన్ నోర్బూ గోల్ చేయడంతో, రెండవ అర్ధభాగం ప్రారంభంలో ఆర్మీ జట్టు తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. అయితే, లేహ్ కింగ్స్ బలంగా పుంజుకుంది, స్టాన్జిన్ లోటస్, ముస్తాక్ అహ్మద్ గిరి అందించిన అసిస్ట్‌లతో స్టాన్జిన్ అంగ్‌చోక్ వెంటవెంటనే రెండు గోల్స్ చేసి స్కోరును 3-3తో సమం చేశాడు. రిగ్జిన్ నోర్బూ ఈ సాయంత్రం తన రెండవ గోల్‌తో ఆర్మీ జట్టుకు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు, కానీ కింగ్స్ త్సెరింగ్ అంగ్చుక్ అందించిన అసిస్ట్‌ను చంబా త్సెటాన్ గోల్‌గా మలచడంతో, చివరి పీరియడ్‌లోకి ప్రవేశించే ముందు స్కోరు 4-4తో సమమైంది. మూడవ పీరియడ్‌లో స్టాన్జిన్ ఆంగ్‌చోక్ హ్యాట్రిక్‌ను పూర్తి చేయడంతో, లేహ్ కింగ్స్ మరోసారి 5-4 ఆధిక్యాన్ని అందించింది. అయితే జిగ్మత్ కున్జాంగ్ తన రెండవ గోల్ చేసి స్కోరును సమం చేయగా, పద్మ నమ్‌గైల్ మ్యాచ్ గెలిపించే గోల్ చేసి 6-5 తేడాతో ఇండియన్ హాకీ జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు.

# టి20 కెరీర్‌లో.. అత్యధిక రన్నింగ్ హీరోస్

### బౌలర్లకు చుక్కలే చుక్కలు



**న్యూఢిల్లీ:** టీ20ల్లో మ్యాచ్‌లు ఉత్కంఠంగా జరుగుతాయి. ఈ ఫార్మేట్‌లో పలువురు బ్యాటర్లు దుమ్మురేపారు. అంతేకాకుండా బౌలర్లకు సైతం చుక్కలు చూపించారు. ఈ విధంగా టీ20 ఫార్మేట్‌లో అత్యధిక పరుగులు సాధించిన టాప్ 5 బ్యాటర్లలో భారత్‌కు చెందిన ఒక్క ఆటగాడూ లేకపోవడం శోచనీయం. జోస్ బట్లర్ ఇటీవల టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ నెల 5న, మెన్స్ హండ్రెడ్ 2026 సీజన్‌లోని 22వ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో, బట్లర్ తన కెరీర్‌కే నిర్వచనం ఇచ్చే ఇన్నింగ్స్‌లను ఆడాడు. ఫ్రాంచైజీ క్రికెట్, అంతర్జాతీయ క్రికెట్‌తో కలిపి అతను మొత్తం 522 మ్యాచ్‌లు ఆడిన రికార్డును కలిగి ఉన్నాడు. ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు కాకుండా, ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, ది హండ్రెడ్ టోర్నమెంట్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్, బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ వంటి కొన్ని జట్లకు ఆయన కోచ్‌గా వ్యవహరించారు. అతను ఇటీవల అన్ని జట్ల తరఫున ఆడి 14,833 పరుగులు సాధించి, టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అలాగే కీరన్ పొలార్డ్ 20 ఏళ్ల సుదీర్ఘ, విజయవంతమైన కెరీర్‌ను కలిగి ఉన్నాడు. అతను అంతర్జాతీయ మరియు ఫ్రాంచైజీ క్రికెట్‌లో 746 మ్యాచ్‌లు ఆడాడు. వెస్ట్ ఇండీస్‌తో పాటు, పొలార్డ్ వివిధ లీగ్‌లలోని అనేక జట్లకు కూడా ఆడాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ముఖ్యమైన సహకారం అందించాడు. ది హండ్రెడ్‌లో లండన్ స్పిరిట్ తరపున, బిగ్ బాష్ లీగ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్ తరపున కూడా ఆడాడు. యూనివర్స్ బాస్ గా కూడా పిలువబడే క్రిస్ గేల్ 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌ను ఆస్వాదించాడు. అతను టీ20 అంతర్జాతీయ, టీ20 ఫ్రాంచైజీ క్రికెట్‌లో 463 మ్యాచ్‌లు ఆడాడు. వెస్ట్ ఇండీస్ తరఫున ఆడటమే కాకుండా, గేల్ ప్రపంచవ్యాప్తంగా వివిధ లీగ్‌లలో అనేక జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, బిగ్ బాష్ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, సిడ్నీ థండర్ జట్ల తరఫున కూడా ఆడాడు. గేల్ క్రికెట్ యొక్క అతి చిన్న ఫార్మాట్‌లో 14,562 పరుగులు సాధించి ఒక పెద్ద మైలురాయిని చేరుకున్నాడు. వీరితో పాటు, అలెక్స్ హేల్స్ 528 మ్యాచ్‌లు ఆడగా, వాటిల్లో 14,449 పరుగులు, డేవిడ్ వార్నర్ 439 మ్యాచ్‌ల్లో 14,284 పరుగులు చేశారు.

# శ్రీలంక మ్యాచ్‌లో టీమిండియా 357 రన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టుకు టీమిండియా ధీటుగా బదులిస్తోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు నష్టానికి 357 పరుగులతో టీమిండియా పటిష్ట స్థితిలో నిలిచింది. బ్యాటింగ్‌కు దిగిన జడ్డూ 117 బతుల్లో 63 పరుగులు చేసి పెవిలియన్ చేరగా, మానవ్ 90 బంతుల్లో 41 పరుగులు చేవ్శాడు. అయితే అసంతక మనోజర్ బౌలింగ్‌లో లెగ్ బిఫోర్ వికెట్‌గా మానవ్ నిష్క్రమించాడు. తదుపరి కుల్దీప్ యాదవ్ 15 బంతుల్లో,





టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లలో యశస్వి జైస్వాల్ డకౌట్ కాగా, కెప్టెన్ కెఎల్‌రాహుల్ 40 పరుగులతో రాణించాడు. వన్‌డౌన్‌లో వచిచన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో శతకం పూర్తి చేసుకుని రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్లు రిషబ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) పూర్తిగా విఫలమయ్యారు. దీంతో నాల్గో స్థానంలో వచ్చిన స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మరో స్పిన్ బౌలర్ మానవవ్ సుతార్ తోడయ్యాడు. మహ్మద్ సిరాజ్ 8 బంతుల్లో ఒక్కో పరుగు చేసి రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరగగా, 103 పరుగులతో మళ్లీ బ్యాటింగ్‌కు దిగిన పడిక్కల్ మొత్తంగా 164 బంతులతో 142 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

కొలంబోలో టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా, భారత్ బౌలర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. ఫలితంగా శ్రీలంక తొలి రోజు ఆటలో ఓవర్‌నైట్ స్కోరు 363 వద్దనే తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

---

## వాణిజ్యం



# ఇన్ఫోసిస్‌కు క్రాక్స్ నుంచి భారీ డీల్!

**ముంబయి,ఆగస్టు 8:** భారత ఐటీ రంగంలోని ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్‌కు మరో భారీ ఇంటర్నేషనల్ డీల్ దక్కింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఫుట్‌వేర్ సంస్థ క్రాక్స్‌తో ఇన్ఫీ 10 సంవత్సరాల వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. క్రాక్స్ వ్యాపార కార్యకలాపాలు, ఐటీ వ్యవస్థల్ని ఆధునికీకరించడంతో పాటుగా ఏఐ ఆధారిత టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ఈ ఒప్పందం విలువ సుమారు 300 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ఇది భారత కరెన్సీలో చూస్తే దాదాపు రూ. 2800 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. ఒప్పందానికి సంబంధించిన అధికారిక ఆర్థిక వివరాల్ని ఇన్ఫోసిస్ వెల్లడించలేదు. సాధారణంగా 100 మిలియన్ డాలర్లు అంతకుమించిన ప్రాజెక్టుల్ని ఐటీ రంగంలో భారీ డీల్స్‌గా పేర్కొంటారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇన్ఫోసిస్ తన ఏఐ ఫస్ట్ ప్లాట్‌ఫామ్‌లు, ఆటోమేషన్ సామర్థ్యాల్ని ఉపయోగించనుంది. క్రాక్స్ ప్రధాన వ్యాపార వ్యవస్థలు, ఐటీ కార్యకలాపాల్ని మరింత సులభతరం చేయడం, నిర్వహణ ఖర్చుల్ని తగ్గించడం, భవిష్యత్తు విస్తరణకు అనుగుణంగా టెక్నాలజీ వ్యవస్థల్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా క్రాక్స్‌కు చెందిన వివిధ వ్యాపార విభాగాల్లో ఉన్న డేటాను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్ఫోసిస్ భావిస్తోంది. దీని వల్ల సంస్థకు రియల్ టైమ్ సమాచారంతో నిర్ణయాలు తీసుకునే అవకాశం లభించడంతో పాటు కార్యకలాపాల్లోనూ సామర్థ్యం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. క్రాక్స్ వేగంగా కొత్త ఉత్పత్తులు, సేవల్ని అభివృద్ధి చేయడం, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లుగా మరింత మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. క్రాక్స్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ టామ్ బ్రిట్ మాట్లాడుతూ "ఇన్ఫోసిస్ డెలివరీ ఫ్రేమ్‌వర్క్‌లు, ఆటోమేషన్ సామర్థ్యాల్ని ఉపయోగించి కార్యకలాపాల్ని మరింత సమర్థంగా నిర్వహిస్తామని తెలిపారు. ఖర్చుల్ని తగ్గించడంతో పాటు భవిష్యత్తు వృద్ధికి అవసరమైన టెక్నాలజీని ఏర్పాటు చేయడంపై దృష్టి పెడతామని చెప్పారు. ఇక రిటైల్ రంగంలో ఏఐ ఆధారిత డిజిటల్ మార్పులకు సంబంధించి కీలక దశలో ఉందన్నారు క్రాక్స్ గ్లోబల్ హెడ్ కర్మేష్ వాస్వానీ.

# రికార్డులో ఎస్‌బిఐ లాభం

### రూ.21,121 కోట్లకు పెరిగిన నికర లాభం..

### 2 దశాబ్దాల్లో మెరుగైన ఆస్తుల నాణ్యత




**ముంబయి, ఆగస్టు 8:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో అంచనాలను మించి అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. త్రైమాసిక నికర లాభం చరిత్రలోనే అత్యధికంగా నమోదుకాగా, ఆస్తుల నాణ్యత కూడా రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఎన్నడూ లేనంత మెరుగైన స్థాయికి చేరింది. ఇదే త్రైమాసికంలో బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.110 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.23 శాతం పెరిగి రికార్డు స్థాయిలో రూ.21,121 కోట్లకు చేరింది. మెరుగైన మార్జిన్లు, రుణాల మంజూరులో 18.63 శాతం వృద్ధి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. నిర్వహణ లాభం 9.77 శాతం పెరిగి రూ.33,529 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం 14.88 శాతం వృద్ధితో రూ.46,992 కోట్లుగా నమోదైంది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 7 బేసిస్ పాయింట్లు పెరిగి 3 శాతానికి చేరింది. మొత్తం బ్యాంకు ఎన్ఐఎం కూడా 5 బేసిస్ పాయింట్లు మెరుగై 2.86 శాతంగా నమోదైంది. అయితే రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలను కఠినతరం చేసిన నేపథ్యంలో ఎస్‌బీఐ తన భారీ నికర ఓపెన్ ఫారెక్స్ పొజిషన్‌ను తగ్గించుకోవడంతో ట్రెజరీ ఆదాయం 70 శాతం మేర తగ్గి సుమారు రూ.2,500 కోట్లకు పరిమితమైంది. బలమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి 3 శాతం ఎన్ఐఎం లక్ష్యాన్ని కొనసాగిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ఆర్‌బీఐ ప్రత్యేక స్వాప్ విండో ద్వారా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల రాక ప్రస్తుతం ఉన్న సుమారు 6 బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్లకు మించి పెరుగుతుందని ఆయన అంచనా వేశారు. ఈ నిధుల రాకతో అధిక వ్యయంతో కూడిన బల్క్ డిపాజిట్లను భర్తీ చేసుకోవడంతో పాటు బ్యాంకు నిధుల సమీకరణ వ్యయం తగ్గుతుందని ఆయన వివరించారు. రుణ వృద్ధి 14-15 శాతం, డిపాజిట్ వృద్ధి 10-11 శాతంగా ఉండొచ్చని శెట్టి అంచనా వేశారు. రూ.110 లక్షల కోట్లకు వ్యాపారంఎస్‌బీఐ మొత్తం వ్యాపారం రూ.110 లక్షల కోట్లను దాటింది. ఇందులో డిపాజిట్లు రూ.60 లక్షల కోట్లకు పైగా ఉండగా, రుణాలు రూ.50 లక్షల కోట్లను అధిగమించాయి. దేశీయ రుణాలు 18.15 శాతం వృద్ధి చెందాయి. రిటైల్ రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా గణనీయంగా పెరిగిందని, అదనంగా మంజూరైన రిటైల్ రుణాల్లో దాదాపు మూడు వంతులు గోల్డ్ లోన్లేనని చెప్పారు. రూపాయి పరంగా విదేశీ రుణాలు 21.38 శాతం, డాలర్ పరంగా 9.97 శాతం పెరిగాయి. మౌలిక రంగాల నుంచి రుణ డిమాండ్‌కార్పొరేట్ రుణాలు 18.05 శాతం పెరిగాయి. పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్ల వంటి మౌలిక రంగాల నుంచి పెరిగిన డిమాండ్ ఇందుకు కారణమని కార్పొరేట్ బ్యాంకింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎండీ అశ్విని కుమార్ తివారీ తెలిపారు.

### తొలివారంలో రూ.12,291 కోట్ల

# ఎఫ్‌పిఐల పెట్టుబడులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 8:** భారత మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఆగస్టు తొలి వారంలో భారీగా నిధులు పెట్టారు. ఆగస్టు 3 నుంచి 7 వరకు ఐదు ట్రేడింగ్ సెషన్లలో ఈక్విటీ, డెట్, హైబ్రిడ్, మ్యూచువల్ ఫండ్ విభాగాల్లో కలిపి రూ.12,290.68 కోట్ల నికర పెట్టుబడులు పెట్టినట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ గణాంకాలు వెల్లడించాయి. ఇందులో ఈక్విటీ విభాగానికే అత్యధికంగా రూ.12,921.14 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జూలైలో కొనసాగిన ఎఫ్‌పీఐల కొనుగోళ్ల జోరు ఆగస్టులోనూ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈనెల 5న ఒక్కరోజే ఈక్విటీల్లో రూ.9,323.38 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి.



మూడోతేదీ రూ.1,351.02 కోట్లు, 4న రూ.1,431.45 కోట్ల చొప్పున పెట్టుబడులు పెట్టారు. అయితే వారాంతానికి కొనుగోళ్ల వేగం తగ్గింది. ఆరవ తేదీ రూ.349 కోట్లు, 7న రూ.466.29 కోట్ల నికర పెట్టుబడులు మాత్రమే నమోదయ్యాయి. డెట్ విభాగంలో మిశ్రమ ధోరణి కనిపించింది. డెట్‌జనరల్ లిమిట్ కింద ఎఫ్‌పీఐలు రూ.621.69 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా, డెట్‌వీఆర్ఆర్‌లో రూ.354.20 కోట్లు, డెట్ ఎఫ్ఏఆర్‌లో రూ.377 కోట్ల నికర ఉపసంహరణలు జరిగాయి. హైబ్రిడ్ సాధనాల నుంచి రూ.570.74 కోట్ల నికర నిధులను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్నారు. మ్యూచువల్ ఫండ్ మార్గాల్లో మాత్రం రూ.49.79 కోట్ల స్వల్ప నికర పెట్టుబడులు వచ్చాయి. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు విభాగంలో ఈ వారంలో ఎలాంటి లావాదేవీలు నమోదు కాలేదు.




## ఫండ్స్‌లో క్లెయిమ్ చేయని డివిడెండ్లు రూ.2,689 కోట్లు

**ముంబయి,ఆగస్టు 8:** మ్యూచువల్ ఫండ్లలో క్లెయిమ్ చేయని డివిడెండ్ మొత్తంఆర్థికసంవత్సరం ముగిసే నాటికి 15.7% పెరిగి రూ.2,689 కోట్లకు చేరింది. సెబీ వార్షిక నివేదిక25-26లో ఈ వివరాలు వెల్లడించింది. 2425లో రూ.2,324 కోట్లుగా ఉన్న క్లెయిమ్ చేయని డివిడెండ్లు తాజాగా రూ.365 కోట్లు పెరిగాయి. మరోవైపు క్లెయిమ్ చేయని రిడెంప్షన్ మొత్తం స్వల్పంగా 0.5 శాతం తగ్గి రూ.1,122 కోట్లకు చేరింది. గత ఏడాది ఇది రూ.1,128 కోట్లుగా ఉంది. దీంతో 2026 మార్చి 31 నాటికి మ్యూచువల్ ఫండ్లలో క్లెయిమ్ చేయని డివిడెండ్లు, రిడెంప్షన్ మొత్తాలు కలిపి రూ.3,811 కోట్లకు చేరాయి. 2024-25 ముగింపులో ఈ మొత్తం రూ.3,452 కోట్లు. పెట్టుబడిదారులకు క్లెయిమ్ చేయని ఆస్తులను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి సెబీ పలు చర్యలు చేపడుతోంది. డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ వివరాలను ఒకే చోట పొందేలా డిజిలాకర్‌తో హోల్డింగ్స్ అనుసంధానానికి అవకాశం కల్పించింది.




## ధూత్ ట్రాన్స్‌మిషన్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.918.27 కోట్లు

**ముంబయి, ఆగస్టు 8:** ఆటో కాంపోనెంట్స్ తయారీ సంస్థ ధూత్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ ఐపీఓకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.918.27 కోట్లను సమీకరించింది. యాంకర్ ఇన్వెస్టర్ రౌండ్‌లో 72 మంది ఇన్వెస్టర్లకు ఒక్కో షేరును రూ.871 చొప్పున కేటాయించింది. 1,05,42,657 ఈక్విటీ షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. వీటిలో 64,59,984 షేర్లు (61.27 ) ఎనిమిది దేశీయ మ్యూచువల్ ఫండ్లకు చెందిన 46 పథకాల ద్వారా కేటాయించారు. మరో 9,21,895 షేర్లు జీవిత బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్లకు కేటాయించారు. యాంకర్ ఇష్యూలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, బ్లాక్‌రాక్, వైట్‌ఓక్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, మిరే, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ధూత్ ట్రాన్స్‌మిషన్ ఐపీఓలో రూ.1,400 కోట్ల విలువైన తాజా షేర్ల జారీతో పాటు, ప్రమోటర్లు 1.63 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. బీసీ ఏషియా ఇన్వెస్ట్‌మెంట్స్, మంగళం క్యాపిటల్ తమ వాటాలను విక్రయించనున్నాయి. కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. ఐపీఓకు కోటక్ మహీంద్రా క్యాపిటల్, నోమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ అండ్ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, జెఫరీస్ ఇండియా, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, 360 వన్ డబ్ల్యూఏఎం బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. కేఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రార్‌గా ఉంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.494 కోట్లను రుణాల చెల్లింపు లేదా ముందస్తు చెల్లింపులకు వినియోగించనుంది. మరో రూ.272.59 కోట్లను అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు కేటాయించనుంది.

## జి20 దేశాల్లోనే భారత్ ఆర్థికవృద్ధి భేష్!

### ఐఎంఎఫ్ జి20 దేశాల డేటా విడుదల

**న్యూయార్కు, ఆగస్టు 8:** అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ తాజా గణాంకాల ప్రకారం 2014-2026 కాలంలో జీ20 దేశాల్లోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా భారత్ చరిత్ర సృష్టించింది. కోవిడ్19 మహమ్మారి, గ్లోబల్ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు,




ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ యుద్ధాల వంటి కఠినమైన సవాళ్ల ఉన్నప్పటికీ నామినల్ డాలర్ రూపంలో భారత్ సగటున 6.1 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. ఈ రేసులో చైనా 5.9 శాతం, అమెరికా 5.3 శాతంను సైతం భారత్ దాటేసింది. సౌదీ అరేబియా 5.1 శాతం, టర్కీ 4.8 శాతం, ఇండోనేషియా 4.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ దశాబ్దకాలంలో భారత ఆర్థికవ్యవస్థ పరిమాణం ఏకంగా రెట్టింపు కంటే ఎక్కువ పెరిగి, ప్రస్తుతం 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరింది. భారత్ వృద్ధికి మౌలిక సదుపాయాలపై పెరిగిన పెట్టుబడులు కూడా కీలకంగా మారాయి. దేశంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 248 గిగావాట్ల నుండి 532.74 గిగావాట్లకు పెరగడం, జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణతో రవాణా, లాజిస్టిక్స్, వ్యాపార కార్యకలాపాలకు మద్దతు పెరిగింది. ఇదే సమయంలో తయారీ సామర్థ్యాన్ని పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, భౌతికడిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు కొనసాగాయి. గత దశాబ్దంలో ఏడో స్థానంలో ఉన్న భారత్, ప్రపంచవ్యాప్తంగా వరుస అంతరాయాలు ఎదురైనప్పటికీ 2014-2026 కాలంలో జీ20లో టాప్‌కు చేరడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ప్రాధాన్యం పెరుగుతున్నదనే దానికి బలమైన సంకేతమని ఐఎంఎఫ్ పేర్కొంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | ఆదివారం 09 ఆగస్టు 2026 | I




# చేనేత అభివృద్ధికి నూతన నైపుణ్యాలను పెంచుకోవాలి

**రూ.10కోట్లతో చేనేత క్లస్టర్ అభివృద్ధి**

**కాకినాడ కలెక్టర్ హరీందర ప్రసాద్**

**యు.కొత్తపల్లి, ఆగస్టు 8(ప్రభాతవార్త) :** చేనేత రంగం అభివృద్ధికి ఎప్పటికప్పుడు నైపుణ్య విధానాలు అవలంబించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాకినాడ జిల్లా కలెక్టర్ హరీందర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పాడ చేనేత సొసైటీని శనివారం ఆయన సందర్శించి తయారైన చేనేత చీరలను, మగ్గాలను పరిశీలించి మాస్టర్ వీవర్స్ ను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చేనేత సంక్షేమానికి కృషి చేయవలసిన అంశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. చేనేత రంగం మెరుగుకు జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ ఎంఓయూ చేసుకుని వారి సలహాలతో నూతన కొత్త డిజైన్లను తెలుసుకోవాలన్నారు. కంచి, ఉప్పాడ, పొందూరు చేనేత ను పై స్థాయికి తీసుకు వెళ్ళడానికి తగిన అవకాశాలు కల్పించడం, మార్కెట్లో అవసరాన్ని బట్టి డిజైన్లను, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. చేనేత రంగం అభివృద్ధి పథకంలో భాగంగా రూ. 10 కోట్లుతో చేనేత క్లస్టర్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడి కే. సూరిబాబు, అసిస్టెంట్ డెవలప్ మెంట్ అధికారి చేతన్, తహసీల్దార్ జి చిన్నారావు, దుర్గా చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు యర్రా శ్రీనివాస్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాసుమేను మంగ



**కాకినాడ రూరల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ, కాకినాడ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు గంగయ్య భార్య మాసుమేను మంగ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్ గా నగుబత్తుల ఎస్ ఎస్ రామయ్య ను గౌరవ అధ్యక్షుడిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కమిటీ సభ్యులుగా మారెళ్ళ రామకృష్ణ, బవిశెట్టి సూర్యావతి, ఇట్ట చిన్న వెంకటయ్య, లోడ జ్యోతి, బి నవీన్ కుమార్, గొల్లపల్లి రాజేశ్వరి, ఆర్ సత్య సౌజన్య, పుల్లా బులి వీర్రాజు, నరాల ఈశ్వరరావు, పాలిక శివకుమార్, దొమ్మేటి వెంకటరమణ, గుత్తుల వెంకటలక్ష్మి, జి విజయలక్ష్మి తో పాటు నలుగురు అధికారులు సభ్యులుగా నియామకం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులకు కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, కాకినాడ జిల్లా యాదవ సంఘం సభ్యులు,అభినందనలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.

## గెయిల్ పైప్‌లైన్ మన అందరిదీ



**రామచంద్రపురం, ఆగస్టు 08 (ప్రభాతవార్త):** గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఓ.యు.గ్యాస్ పైప్‌లైన్ వెంబడి ఉన్న గ్రామాల్లో పైప్‌లైన్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు.రామచంద్రపురం కళాబృందానికి చెందిన గొర్రెల రాము, కృష్ణ, శ్రీనివాసరావు బ్రదర్స్ బృందాలు పెద్దపూడి మండలంలోని కైకవోలు,యూ.కొత్తపల్లి మండలంలోని కొమరగిరి, యూ.కొత్తపల్లి మండలంలోని గుబ్బలవారి పాలెం గ్రామాల్లో బుర్రకథలు ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచాయి.ఈ సందర్భంగా గ్యాస్ పైప్‌లైన్ ప్రాధాన్యత,పైప్‌లైన్ పరిసర ప్రాంతాల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదనే విషయాలను వివరించారు. అలాగే పైప్‌లైన్ వద్ద గ్యాస్ లీకేజీ లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గమనించిన వెంటనే గెయిల్ టోల్‌ఫ్రీ నంబర్ 15101కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

# పవన్ కళ్యాణ్ ఇలాకాలో.. అధికారుల లీలలు

## కమిషన్ల జాతర.. నిబంధనలకు పాతర!

- రూ. కోటి నిధులు.. ఇద్దరు గుత్తేదారులకేనా?
- సమాచారం అడిగితే అవమానమా?
- ' కమిషన్ల జాతర" ఆరోపణలు
- డ్రైనేజీ పనులు తమకే అప్పగించాలి
- అధికారుల వివరణ ఎక్కడ?
- విచారణకు డిమాండ్

**పిఠాపురం,ఆగస్టు 8(ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా,పిఠాపురం నియోజకవర్గం,పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల పరిధి గ్రామాలలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు వివాదానికి కేంద్రంగా మారాయి. ప్రజల మౌలిక వసతుల కోసం " కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ " రూ. కోటినిధుల వినియోగం, పనుల కేటాయింపు, టెండర్ ప్రక్రియ, అధికారుల వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనులకు సంబంధించిన పూర్తి సమాచారం స్థానికంగా అందుబాటులో లేకపోవడం, నిబంధనలను పక్కనపెట్టి పనులను గుత్తేదారులకు అప్పగిస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. డ్రైనేజీ పనులకు సంబంధించిన వివరాలు అడిగేందుకు వెళ్లిన జనసేన నాయకులు, కార్యకర్తలకు అధికారులు సరైన సమాచారం ఇవ్వలేదని, పైగా అవమానకరంగా వ్యవహరించారని జనసైనికులు ఆరోపిస్తున్నారు. తమకు అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.



**రూ. కోటి నిధులు.. ఇద్దరు గుత్తేదారులకేనా?**

"కుడా "చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు రూ. కోటి రూపాయలనిధులు కేటాయించారని, ఆ నిధులను ఇద్దరు గుత్తేదారుకు గంపగుత్తగా అప్పగించారని, జనసేన వర్గాలు ఆరోపిస్తున్నాయి. పనుల కేటాయింపులో పారదర్శకత ఎక్కడుందని వారు నిలదీస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ అభివృద్ధి పనికైనా టెండర్ ప్రక్రియ, సాంకేతిక అర్హతలు, ఆర్థిక బిడ్లు, పనుల అంచనా వ్యయం, వర్క్ ఆర్డర్ వంటి అంశాలు కీలకం. ఈ ప్రక్రియలన్నీ నిబంధనల ప్రకారం జరిగాయా? ఒకవేళ జరిగితే పోటీలో ఎన్ని సంస్థలు పాల్గొన్నాయి? ఎవరి బిడ్‌ను ఎంపిక చేశారు? పనుల అంచనా వ్యయం ఎంత? ఖరారైన కాంట్రాక్టు విలువ ఎంత? వంటి ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉందని జన సైనికులు డిమాండ్ చేస్తున్నారు.

**'సమాచారం అడిగితే అవమానమా?'**

ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులపై సమాచారం అడగడం తమ హక్కు అని జనసైనికులు అంటున్నారు. అయితే పనుల వివరాలు అడిగిన సందర్భంలో అధికారులు స్పందించిన తీరు తమను తీవ్రంగా బాధించిందని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలకు అభివృద్ధి పనులపై సమాచారం అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. "ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు పనుల వివరాలు ప్రజలకు తెలియాలి. ఎక్కడ పని జరుగుతోంది? ఎంత ఖర్చవుతోంది? ఎవరు చేస్తున్నారు? నాణ్యతను ఎవరు పరిశీలిస్తున్నారు? అనే విషయాలు ఎందుకు దాచిపెడుతున్నారు?" అని జనసైనికులు ప్రశ్నిస్తున్నారు.

**'కమిషన్ల జాతర' ఆరోపణలు**

డ్రైనేజీ పనుల కేటాయింపులో కమిషన్ల వ్యవహారం నడుస్తోందంటూ జనసేన వర్గాలు చేస్తున్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమా? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జనసైనికులు చెబుతున్నారు. పనుల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పారదర్శకత పాటించాలని కోరుతున్నారు. టెండర్ పత్రాలు, వర్క్ ఆర్డర్లు, అంచనా వ్యయాలు, కాంట్రాక్టర్ వివరాలు, పనుల కొలతలు, చెల్లించిన బిల్లులు, నాణ్యతా పరీక్షల నివేదికలను బహిర్గతం చేస్తే అనుమానాలకు తావుండదని వారు పేర్కొంటున్నారు.

**డ్రైనేజీ పనులు తమకే అప్పగించాలి**

రూ. కోటి,విలువైన డ్రైనేజీ పనులను బయట గుత్తేదారులకు అప్పగించకుండా స్థానికంగా పనిచేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించాలని జనసైనికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు పనులు అప్పగిస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత కొద్దికాలానికే డ్రైనేజీలు పూడుకుపోవడం, మురుగునీరు రోడ్లపైకి రావడం ... నిర్మాణాలు చేపడుతామని అంటున్నారు. అయితే కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పనుల కేటాయింపు,రాజకీయ అనుబంధాల ఆధారంగా కాకుండా చట్టబద్ధమైన టెండర్ విధానం, సాంకేతిక అర్హతలు, పోటీ ధరలు, నాణ్యతా ప్రమాణాల ఆధారంగా జరగాల్సిన అవసరం ఉంది. జనసేన నాయకులు కూడా తమ డిమాండ్‌కు అనుగుణంగా నిబంధనల ప్రకారం అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**నాణ్యతే ప్రధానమంటున్న జనసైనికులు**

డ్రైనేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోతే రోడ్లపై నీరు నిలవడం, మురుగునీరు ఇళ్లలోకి చేరడం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటున్నారు.

**అధికారుల వివరణ ఎక్కడ?**

జనసేన వర్గాలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు పూర్తి స్థాయి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. అసలు డ్రైనేజీ పనులకు ఎంత నిధులు కేటాయించారు? ఏ ప్రాంతాల్లో పనులు చేపడుతున్నారు? టెండర్ ప్రక్రియ ఎలా జరిగింది? కాంట్రాక్టర్‌ను ఏ విధంగా ఎంపిక చేశారు? ఇప్పటివరకు ఎంత మొత్తాన్ని విడుదల చేశారు? పనులు ఏ దశలో ఉన్నాయి? వంటి వివరాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ వస్తోంది.

అధికారిక రికార్డులు బహిరంగమైతే ఆరోపణలకు, అనుమానాలకు తావుండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**విచారణకు డిమాండ్**

డ్రైనేజీ పనుల కేటాయింపు, నిధుల వినియోగం, టెండర్ ప్రక్రియపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని జనసేన వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అవసరమైతే సంబంధిత రికార్డులను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించారా లేదా అన్నది తేల్చాలని కోరుతున్నారు. ప్రజాధనం వినియోగిస్తున్న ప్రతి పనిలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారిక పత్రాలతో వాటిని ఖండించాలని జనసైనికులు అంటున్నారు.

కాంట్రాక్టర్ ఎవరైనా, రాజకీయ పార్టీ ఏదైనా, ప్రజలకు నష్టం కలిగించే విధంగా పనులు జరగకూడదన్నదే ప్రధాన అంశం. నిధుల కేటాయింపు నుంచి పనుల పూర్తివరకు ప్రతి దశ పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు వివరాలు అందుబాటులో ఉండాలి. నాణ్యతా పరీక్షలు జరగాలి. బిల్లులు వాస్తవ పనుల ఆధారంగానే చెల్లించాలి. 'కమిషన్ల జాతర.. నిబంధనలకు పాతర' అన్న ఆరోపణలు నిజమా? లేక రాజకీయ దుమారమేనా? అన్నది అధికారులు వెల్లడించే రికార్డులు, టెండర్ పత్రాలు, పనుల నాణ్యతా నివేదికలే తేల్చాల్సి ఉంది. అయితే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత మాత్రం సంబంధిత అధికార యంత్రాంగంపై ఉంది.

# వాడపల్లి గోవిందుడి జన నీరాజనం..



- స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ.95 లక్షలు.
- వృద్ధులకు, దివ్యాంగులకు, చంటిపిల్లల తల్లులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు...

చైర్మన్, ముదునూరి,డి సి, నల్లం,

**.ఆత్రేయపురం, ఆగస్టు 08,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నెలలో రెండవ శనివారం కావడంతో వాడపల్లి క్షేత్రం జనసంద్రంగా మారింది. ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఏడు ప్రదిక్షణలు చేసి స్వామివారిని స్మరించుకుంటూ మాడవీధుల్లో భక్తులు ప్రదక్షిణలు చేశారు. క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించారు. స్వామివారి మూల విరాట్టు, ఆరుబయట విమాన వేంకటేశ్వరస్వామి, క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాళ్ అమ్మవారు, విశ్వేశ్వరస్వామి దర్శనాలతో భక్తులు తన్మయత్వం చెందారు.వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి పదిగంటల వరకు కొనసాగాయి. భక్తులు రాత్రి వరకూ క్యూలైన్లలో నిలబడి వెళ్ళి స్వామివారిని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం అంటూ స్మరించారు. ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. వాడపల్లి కొత్త వంతెన నుండి ట్రాఫిక్కు అంతరాయం కలగడంతో స్వయంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు రంగంలోకి దిగారు, పోలీసులతో పాటు ఆలయ సిబ్బందిని కలుపుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా తక్షణమే ట్రాఫిక్కును క్లియర్ చేశారు. వర్షాన్ని లెక్కచేయకుండా పర్యవేక్షణ ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, మరోపక్క ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజులు కూడా ఎక్కడకక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, మాడవీధులు, వాడపల్లి క్షేత్రానికి లక్ష మంది పైగా భక్తులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి భక్తులు విజయవాడ, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఏడు వారాల వెంకన్న వ్రతం ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి రావడం విశేషం. వారంతా అత్యంత భక్తి శ్రద్ధతో స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు మాట్లాడుతూ.. భక్తులను భోజనాలు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోగా సుమారు 35 వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించారని స్వామివారికి వివిధ సేవల ద్వారా సుమారు రూ. 95 లక్షలు వరకూ ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు.స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, జి.వరప్రసాద్, ఏపుగంటి సుబ్బారావు, ఏపుగంటి వెంకటేష్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఆవరణలో సాయంత్రం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.



# చింతూరులో ఆ దివాసీ సంఘాల ఏజెన్సీ బంద్ విజయవంతం.

## ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలనీ డిమాండ్.



**చింతూరు ఆగస్టు 8 ప్రభాతవార్త** ఏజెన్సీలో 100 % ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదివాసీ సంఘాలు చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతం అయింది. ఏజెన్సీలోని అనేక ,పట్టణాలు, మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో ఆదివాసి సంఘాలు సంపూర్ణ బంద్ ను నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. 1/70 చట్టం సవర్ణ కోరుతూ సుప్రీంకోర్టుకు వచ్చిన పిటిషన్ పై కౌంటర్ పిటిషన్ ప్రభుత్వం దాఖలు చేయాలని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు అధికారంలోకి వస్తే 100% ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం, చింతూరు డివిజన్ కేంద్రంలో రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతం అయ్యింది. ఏజెన్సీ లో మారుమూల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ఆదివాసిలు రోడ్లపైకి వచ్చి ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ రిజర్వేషన్ హామీని అమలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం చెల్లించాలని, 1/70 చట్టం సవరణ పిటిషన్ పై రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉన్న విలువైన ఖనిజ సంపద, సహజ వనరులు, ప్రభుత్వం కారు చౌకగా పెట్టుబడిదారులకు దోచి పెట్టాలని చూస్తున్నాయని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసి హక్కులు,చట్టాలు నిర్వీర్యం చేస్తుందని, రాజ్యాంగబద్ధంగా 5వ,6 వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు, ఏజెన్సీ ప్రాంతంలోని సర్వముఖ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర గవర్నర్ ద్వారా రాష్ట్రపతి చట్టాలను రూపొందించి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో జెడ్ పి టీ సి చిచ్చుడి మురళి తదితరులు ప్రసంగించారరు ,కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, దళిత సంఘం రాష్ట్ర నాయకులు రవీందర్, మరియు గిరిజన సంఘం నాయకులు మొట్టం రాజయ్య కారం నాగేష్, ఎంపీటీసీ, వేకా రాజ్ కుమార్, కారం సుబ్బారావు, పొడియం లక్ష్మణ్, మడకం చిన్నయ్య, కలముల మల్లేష్, మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, సవలం ధరయ్య సోడే రాములమ్మ, మడకం శారదా సోడా చిన్నమ్మి, భూసం వీరయ్య, తదితరులు పాల్గొన్నారు



# మన్యం బంద్ లో రాస్తా రోకో... స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేత


## వాహన రాకపోకలు యథాతథం

**రాజవొమ్మంగి, ఆగస్టు 08, ప్రభాతవార్త** గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలు అన్నీ ఆదివాసీయులతో భర్తీ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసి కొనసాగించి రద్దు చేయడంపై ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి జీవో నెంబర్ స్థానంలో ప్రత్యేక జీవో తెస్తామని ప్రకటించి అమలు చేయకపోవడంపై శనివారం రాజవొమ్మంగి మండలంలో ఆదివాసీ గిరిజన సంఘం కొన్ల సూరిబాబు ఆధ్వర్యంలో మన్యం బంద్ ను కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్సార్సీపీ ప్రజాప్రతినిధులు బంద్ లో పాల్గొని సంఘీభావం తెలిపారు. రాజవొమ్మంగిలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలంఖ మూసివేశారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి అల్లూరి జంక్షన్ వరకూ ర్యాలీ చేసారు. జీవో నెంబర్ 3కి బదులు కొత్త జీవో ప్రకటించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. అల్లూరిజంక్షన్ వద్ద మానవహారం చేసారు. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా సి. ఐ. సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఎస్. ఐ. వెంకట్రావు, సిబ్బంది విధులను నిర్వహించారు. ఇబ్బందులు వస్తున్న తరుణంలో గిరిజన సంఘ నాయకులు కొన్ల సూరిబాబు ను పోలీసులు పోలీస్ స్టేషన్ కు తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నం చేయగా ఆదివాసీయులు అడ్డుకొన్నారు. రోడ్డుపై బైఠాయించారు. రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిటిసి సుంద్రు లోవలక్ష్మి, మాజీ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి బంద్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో కొన్ల సూరిబాబు, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సుంద్రు లోవలక్ష్మి, ఆగూరి సుబ్బలక్ష్మి, కనిగిరి వీరబాబు, పాండవులు సత్యనారాయణ, పొత్తూరి రాంబాబు, ఎల్లం రాంబాబు, కాదుల గంగరాజు, మేలిన రమేష్, రెడ్డి వెంకటరెడ్డి, జర్తా రాజబాబు, తెడ్ల అబ్బాయి, కోసూరి అప్పలరాజు, మణుగుల రాజబాబు, ఆదివాసీ మహిళలు, యువకులు పాల్గొన్నారు. జడ్డంగి గ్రామంలో మన్యం బంద్ లో భాగంగా మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారాన్ని చేశారు. జీవో నెంబర్. 3, 1/ 70 చట్టం వల్ల గిరిజనులకు జరిగే నష్టాన్ని తెడ్ల రాంబాబు కొంగర మురళీ కృష్ణ, సవిరాల చంద్రుడు, తెడ్ల అబ్బాయి వివరించారు.ఆదివాసీయులు పాల్గొన్నారు. జడ్డంగి ఎస్. ఐ. చినబాబు పర్యవేక్షణలో ఏ. ఎస్. ఐ. సురేష్, హెచ్. సి. రాజ్ కుమార్, సిబ్బంది విధులను నిర్వహించారు.





# అటవీ భూములపై పర్యవేక్షణ ఎక్కడా?



**కాట్రేనికోన ఆగస్టు 08 (ప్రభాత వార్త)** కాట్రేనికోన మండలంలో అటవీ భూములపై పర్యవేక్షణ కరువయ్యిందనే ఆరోపణలు ఇటీవల కాలంలో ప్రజల నుంచి ఎక్కువగా వినబడుతున్నాయి. ఇటీవల కొత్తపలెం, మొల్లేటిమొగలో సమీపంలో రోడ్డు చెంతన మడ అడవుల్లో గుడి పేరు చెప్పి కొంత స్థలాన్నీ ఇసుకతో మేరకచేసే పనులు చేపట్టారని అంటున్నారు. అసలు ఈ భూములు ఏ పరిధిలో ఉన్నాయి. మెరక చేయడానికి ఇసుక ఎక్కడ నుంచి వస్తుంది.? అనుమతులు ఉన్నాయా..లేదా అన్న విషయం పై సందిగ్ధం నెలకొంది. గ్రామాల్లో ఇటువంటి పనులు చేస్తున్నారంటే క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, అటవీశాఖ తదితర సిబ్బంది దృష్టి సారించాలి . కానీ ఇవేమీ పట్టించుకోవడం లేదని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తీర గ్రామాల్లో మడ అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులందరిపై ఉంది .కానీ తీర ప్రాంతాల్లో అటవీ భూముల్లో గుడులు పేరు చెప్పి పనులు చేపడుతుంటే అధికార యంత్రాంగం అంతా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొల్లేటి మొగలో చేపట్టిన పనులు పరిస్థితి పై దృష్టి సారించి అనుమతులు ఉన్నాయ లేదా పరిశీలించి ,లేకపోతే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలకు కోరుతున్నారు. అటవీ భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలంతా కోరుతున్నారు.

# గ్రామస్తుల సమిష్టి శ్రమదానం.. ఊరి రహదారి సమస్య పరిష్కారం

**వి.ఆర్.పురం,ఆగస్టు8,ప్రభాతవార్త** మండలంలోని గుర్రంపేట గ్రామస్తులు శనివారం సమిష్టిగా శ్రమదానం చేశారు. అర కిలోమీటర్ గ్రావెల్ రహదారి పొడవున పెద్ద సంఖ్యలో ఏర్పడిన గోతులను పూడ్చి, రోడ్డుకు ఇరువైపుల అడ్డంగా పెరిగిన సుమారు 40 తాటి చెట్లను తొలగించారు. తమ శ్రమదానంతో రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చేసి, ఊరికి ఉపకారం చేశారు. ఇక ఇదిలా ఉంటే ఉమ్మడివరం గ్రామం వద్ద ఆర్.అండ్.బి రహదారి నుండి గుర్రంపేట గ్రామం అర కిలోమీటర్ పై చిలుకు దూరం ఉంటుంది. ఆ గ్రామంలో 200 కుటుంబాల గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు 15 మంది, స్థానికంగా ఉన్న పాఠశాలలో చదివే విద్యార్థులే కాకుండా, ప్రతీ రోజు మండల కేంద్రం వి.ఆర్.పురం, ప్రక్క మండలం కూనవరం చదువుల కోసం వెళ్ళి వచ్చే విద్యార్థులు మరో 30 మంది వరకు ఉన్నారు. అయితే గుర్రంపేట గ్రామానికి వెళ్ళే రహదారి పొడవున అంతటా పెద్ద పెద్ద గోతులు ఉండటంతోపాటుగా, రోడ్డుకు ఇరువైపులు రాకపోకలకు అడ్డంగా తాటి చెట్లు పెరిగాయి. దీంతో ఆ గ్రామానికి వెళ్ళి రావటానికి ఆటోవాలాలు నిరాకరిస్తున్నారు. అత్యవసర వేళల్లో 108 అంబులెన్స్ సైతం ఆ ఊరికి వెళ్ళే పరిస్తితి లేకుండాపోయింది. అంబులెన్స్ సేవలకు సైతం అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపద్యంలో ప్రతీరోజు చదువులు, విధులకు, వివిధ పనుల కోసం మండల కేంద్రం వి.ఆర్.పురం వెళ్ళి రావాలంటే, అక్కడివారు అర కిలోమీటర్ కాలినడకన ఉమ్మడివరం గ్రామం వరకు నడవాల్సి వస్తుంది. ఆరోగ్యవంతులకు ఈ దూరం నడవటం పెద్ద కష్టం కాకపోవచ్చు కాని,



గర్భిణీలు, చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు ఇది నరకయాతనగా మారింది. గ్రామ పంచాయతీల పాలన ముగియటంతో ఈ రోడ్డు బాగోగులు పట్టించుకునే వారు లేకుండాపోయారు. గుర్రంపేట గ్రామం పోలవరం ప్రాజక్ట్ ముంపు గ్రామమే అయినప్పటికీ, ఇది 41.15 కాంటూరు పరిధిలో లేదు. ఆ గ్రామం 45 కాంటూరు పరిధిలో ఉంది. అటువంటి గ్రామానికి అత్యంత ముఖ్యమైన రహదారి లేకపోవటం, గిరిజన గ్రామాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి గుర్రంపేట గ్రామానికి శాశ్వత పరిష్కారంగా, బిటి రోడ్డు లేదా సిసి రోడ్డు నిర్మించాలని అక్కడి గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనాథలకు" ఆ చంద్రార్కం "అండగా పవన్ కళ్యాణ్

**జనసేన మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్**



**పిఠాపురం, ఆగస్టు 8 ( ప్రభాతవార్త )** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ చంద్రార్కం అనాథలకు అండగా ఉంటారని, పిఠాపురం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వెన్న జగదీష్ స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు, పవన్ కళ్యాణ్ నెల జీతం నుంచి అనాథ పిల్లలు ఒక్కొక్కరికి, ప్రతి నెల రూ. 5000 చెక్కులు అందజేసే కార్యక్రమాన్ని శనివారం ఎఫ్. కె పాలెం, మల్లాం, విరవ, విరవాడ, ఎల్ ఎన్ పురం, జములపల్లి, పి.తిమ్మాపురం, మాధవపురం, చిత్రాడ గ్రామాలలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని, ఆర్థిక కష్టాలున్నా, అనాథ సంక్షేమంలో రాజీ పడలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు గంజి గోవిందరాజులు, తోలేటి శిరీష, జనసేన నాయకులు అడపాశివరామ కృష్ణ, విరవ గ్రామ కమిటీ ఇన్చార్జ్ అమలకంటి వీరబాబు, వివిధ గ్రామాల ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, వార్డు ఇన్చార్జులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# పిల్లల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించాలి

**పిఠాపురం, ఆగస్టు 8( ప్రభాతవార్త )** చిన్న వయసు నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించాలని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు చెల్లబోయిన వీర నాగేశ్వరరావు అన్నారు.



శనివారం పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో చిన్నారులకు రామాయణం, మహాభారతంపై విజ్ఞాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జూనియర్ విభాగంలో ఆదిత్య పాఠశాలకు చెందిన పి.మురారి మొదటి స్థానంలోనూ, కె. సాయి ప్రణవి ద్వితీయ స్థానం, వి.జాహ్నవి తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ విభాగంలో మొదటి స్థానం శ్రీ ఆదర్శ పాఠశాలకు చెందిన చెల్లబోయిన భార్గవి, ద్వితీయ స్థానం భాష్యం పాఠశాలకు చెందిన లక్ష్మీశివశ్రీ, తృతీయ స్థానాన్ని ఆదర్శ పాఠశాలకు చెందిన ఏంచిరా ప్రియా దక్కించుకున్నారు. పోటీల అనంతరం ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు మొల్లి సతీష్ ప్రజా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మోహన్ రావు,తోట విడుకొండలు ,పెరుమాళ్ళ నాగేంద్ర, చెల్లబోయిన సత్యనారాయణ ఆలయ అర్చకులు, ఆధ్యాత్మిక సమాజ సేవా ప్రతినిధి పి. విజయ జనార్దన ఆచార్యులు, సంగం కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు పి. జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం, అభివృద్ధి..

**డోర్ టు డోర్ ప్రోగ్రాంను వేగవంతం చేయాలి..**

**రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెదబాబు..**



**అంబాజీపేట,ఆగస్టు 8 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పార్టీ నిర్దేశించిన డోర్ టు డోర్ ప్రోగ్రాంను వేగవంతం చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు (పెదబాబు) సూచించారు. మండలంలోని ఇసుకపూడి గ్రామంలో 007 క్లస్టర్ ఇన్చార్జి గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ అధిష్టానం ఆదేశాలను పాటించడంలో ముందుంటారన్నారు. అనంతరం డోర్ టు డోర్ ప్రోగ్రామ్లో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై సాధించిన పురోభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రంపం సత్యనారాయణ, మండల శాఖ ప్రధాన కార్యదర్శి రవణం రాము, బూత్ కన్వీనర్ నేతల రాము,మాజీ సర్పంచి సరెళ్ళ వెంకటేశ్వర్లు, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, బొడ్డు రాంబాబు, కట్టా నాగమోహన్,వార్ శ్రీనుబాబు, కట్టా అబ్బులు,కట్టా రాంబాబు, పచ్చిపాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రంగనాయకపురంలో నీలా తారా దేవికి సారె సమర్పణ.






**తాళ్లరేవు ఆగస్టు 8 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు పంచాయతీ శ్రీరంగనాయక పురంలో కొలువై ఉన్న నీలా తారా దేవి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. ఆలయ నిర్వాహకులు వెదురుపాకలూరి నాని, దిల్లీ తల్లి ముందుగా ఆలయంలో పూజలు నిర్వహించి పలువురు దంపతులు ముత్తైదువులతో కలిసి ఎంటి రాజు బంగ్లా ప్రాంతం నుంచి మేళ తాళాలతో ప్రతి ఒక్కరి చేతిలో సారె పళ్లెంతో ఊరేగింపుగా రంగనాయక పురం నీలా తారాదేవి ఆలయానికి చేరుకున్నారు. నాని దంపతులు ఇంటిలో కొలువై ఉన్న నీలా తారా దేవికి సారె చెల్లించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలోని కనకదుర్గమ్మ, గంగాలమ్మ తల్లి ఆలయాలను భక్తులతో కలిసి సందర్శించి నీలా తారా దేవి ఆలయం తరఫున సారె సమర్పించారు. ఈ సందర్భంగా రంగనాయక పురం, గుత్తుల వారి పాలెం గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గ్రామం తిరునాళ్ళను తలపించింది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. రంగనాయక పురం, గుత్తుల వారి పాలెం గ్రామాలలో ఇంటింటికి వెళ్లి అమ్మవారి పసుపు చిట్టిలను తదితరులు అందరికీ పంపిణీ చేశారు.

# యానాంలో ఘనంగా అన్నసామారాధన

**1,400 మంది భక్తులకు అన్నదానం**



**యానాం, ఆగస్టు 8:(ప్రభాతవార్త)** కేంద్రపాలిత ప్రాంతమైన యానం లో రెడ్డి రాజుల కాలం నాటి అతి పురాతన ఆలయమైన శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం అన్నసామారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో సుమారు 1,400 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సుదర్శన్ శ్రీనివాస్, కాట్రగంటి ప్రవీణ్, వృద్ధి, సుంకర రామచంద్రరావు, కోన వెంకన్న బాబు, కోన రామచంద్రరావు, బలగం గణేష్, కోన వెంకటేశ్వర రావు, పద్మ లంక సాయి తదితరులు సహకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పెన్మెంటి భమరాజు వినోద్ ఆచార్యులు మాట్లాడుతూ, ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే లక్ష్యంగా కొనసాగుతున్న ఈ అన్నసామారాధన కార్యక్రమానికి దాతలు మరింతగా సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# తక్షణమే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు వెంటనే వేయాలి**

**వైసిపి నిరాహార దీక్షలో మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 8 (ప్రభాతవార్త)** విద్యార్థులకు వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లు నిర్మించాలని డీఎస్సీలో లీకేజీ అక్రమాలపై బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నిరుద్యోగ భృతి వెంటనే 3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం మోరంపూడి జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఉద్దేశించి మాజీ ఎంపీ వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాన్ని భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యార్థులకు తీరని అన్యాయం ద్రోహం చేశారని విమర్శించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులను కళాశాలలు పరీక్షలు రాయినివ్వకుండా చేస్తున్నారని దీంతో మనస్థాపానికి గురై విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దీక్ష చేపట్టామని డీఎస్సీ స్కాంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు బీసీ జేఏసీ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాన్ని నాగేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ తనయుడు జీవి సుందర్ తదితరులు సంఘీభావం తెలిపారు. నిరుద్యోగులకు నెలకు 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారని ఎప్పటి వరకు రెండేళ్లలో 72 వేల కోట్ల జెన్జీలకు బకాయి పడ్డారని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కారు ప్రమాదంలో చనిపోయిన ప్రియాంకకు న్యాయం చేయాలని కోరారు. మోరంపూడి ఫ్లైఓవర్ తాను ఎంపీగా ఉన్న సమయంలో రెండేళ్లలోనే నిర్మాణం చేశామని ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన ఇంతవరకు సర్వీస్ రోడ్లు వేయలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని హత్యలు ఘోరాలు జరుగుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. త్వరలోనే ఈ ప్రభుత్వానికి ఓట్ల రూపంలో సమాధానం చెప్పడం ఖాయమని అన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వార్ని దర్శించుకున్న అశేష భక్త జనం...

**నిత్యాన్న పథకానికి రూ,15.234/విరాళం.**



**ఆత్రేయపురం, ఆగస్టు 08,(ప్రభాత వార్త)** అతి పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ,గోపాల స్వామి వారి ఆలయానికి శనివారం కావడం అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్యాన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని సేకరించారు. రాయకుదురు చెందిన చంగల్వ శ్రీరామ ఫణికుమార్, సాయి ప్రత్యూష దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ5,116/- వేలు, పెదతాడేపల్లి చెందిన కందిగిరి చంద్రశేఖర్, రత్నమాల దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.2,501/- వేలు, శ్రీ స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులకు రూ.2,501/- వేలు, గుజరాత్ చెందిన యర్రాప్రగడ అజయ్ మౌద్గల్య, బంగారు లక్ష్మి అనూష దంపతులు శ్రీ స్వామిలి వారిని దర్శించుకుని శ్రీ స్వామి వారి రూ5,116/- వేలు విరాళంగా అందించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు లు శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను, చరిత్ర పుస్తకం, శేష వస్త్రంతో సత్కరించారు.

# పుదుచ్చేరిలోని తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం

**నిర్వహించిన ప్రజా పనుల శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు**



**యానాం, ఆగస్టు 8: (ప్రభాతవార్త)** పుదుచ్చేరిలోని తన కార్యాలయంలో ప్రజ పనుల శాఖ ఉన్నతాధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రజా పనుల శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రహదారుల్లో నూతనంగా అత్యధిక లైట్లు ఏర్పాటుకు సంబంధించి అధికారులతో సమీక్షించిన మంత్రి మల్లాడి ఈ సందర్భంగా పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై అత్యధిక సంఖ్యలో నూతన వీధి దీపాల ఏర్పాటుకు సంబం ధించిన అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. అలాగే యానాం నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం, నూతన లైట్ల ఏర్పాటు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

# రెండేళ్ల కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి.

**అభివృద్ధి సంక్షేమం దిశగా పయనం.**

**నియోజకవర్గ పరిశీలకురాలు సుంకర పావని.**



**తాళ్ళరేవు, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం దిశగా నడిపిస్తుందని ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకురాలు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని అన్నారు. తాళ్ళరేవు మండలం పటవల లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో రెండేళ్ల కూటమిపాలనపై ప్రజలను అడిగి తెలుసుకుని విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో ప్రజలు త్రాగునీటి సమస్య అధికంగా ఉన్నట్లు తెలిపారన్నారు. అయితే ఇటీవల ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పనులు ప్రారంభించినట్లు త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పటవల బి.సి. పేటలోని పలు గృహాలను సందర్శించి రెండేళ్ల కూటమిపాలన లో అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, భజన సత్తిబాబు, కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్, బోనం శ్రీనివాస్, మేకల గోపాలకృష్ణ, మేకల కృష్ణ , మేడిశెట్టి గోపాల్, పెచ్చెట్టి శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి అండగా నిలిచిన కేటీసీ అధినేత

**రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న ప్రవీణ్ చక్రవర్తి**



**కాకినాడ రూరల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** రూరల్ మండలం ఇంద్ర పాలెం గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు మోజేష్ రాయల్ కు అరుదైన వ్యాధి రావడంతో ఆ కుటుంబానికి కే టి సి విద్యాసంస్థల అధినేత ప్రవీణ్ చక్రవర్తి అండగా నిలిచారు. ఎస్ఎంఎస్ వ్యాధితో బాధపడుతున్న మోజేష్ రాయల్(4) అరుదైన వ్యాధి వైద్యానికి భారీగా ఖర్చు అవుతుండటంతో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న విద్యావేత్త, సామాజికవేత్త, కేటీసీ విద్యాసంస్థల అధినేత తనవంతు బాధ్యతగా ముందుకు వచ్చి చిన్నారి కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్నారికి అవసరమైన వైద్యం, మందులకు భారీగా ఖర్చు అవుతుండటంతో కుటుంబ సభ్యులు సమయానికి అవసరమైన చికిత్స, మందులు అందకపోతే చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కోట్ల రూపాయల వరకు వైద్య ఖర్చులు అవసరమవుతున్నాయని, సాధారణ కుటుంబాలు అంతటి భారాన్ని భరించే పరిస్థితిలో లేవని బాధిత కుటుంబాలు వాపోయాయి.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలు కలెక్టర్ను కలిసి తమ సమస్యలను వివరించి తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశాయి. మానవత్వంతో ముందుకొచ్చిన సామాజికవేత్త, కేటీసీ విద్యాసంస్థల అధినేత. చిన్నారి పరిస్థితి, కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చిన్నారి వైద్యానికి భారీగా ఖర్చు అవుతున్న తరుణంలో అందించిన ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. కష్టకాలంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం చేసిన విద్యావేత్తకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# డి.ఎస్. సి.2025 అక్రమాలపై మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి.

**వైకాపా రిలే నిరాహార దీక్షలు.**



**తాళ్ళరేవు, ఆగస్టు8 (ప్రభాతవార్త):** డి.ఎస్.సి.2025లో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టాలని, పూర్తి బాధ్యత వహించి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, సీఈసీ సభ్యులు పితాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. వైకాపా మండల అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఏపీ జెన్-జెడ్ వార్ రిలే నిరాహార దీక్షల కార్యక్రమాన్ని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నాడ సతీష్ కుమార్ మాట్లాడుతూ డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాల్లో ఆక్రమాలు చోటు చేసుకున్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే నిరు ద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం రాని యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానాలు చేసి, వాటిని పూర్తిగా తుంగలో తొక్కారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా ఇచ్చిన కొద్ది టీచర్ పోస్టుల నియామకంలో భారీ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. లక్షల రూపాయలకు ఉద్యోగాలు అమ్ముకున్నారన్నారు. అందువల్ల దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలంటే సీబీఐ విచారణ ఒక్కటే మార్గమని తెలిపారు. అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయినా ఇంత వరకు ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చిన దాఖలాలు లేవని వైఎస్ఆర్సిపి సీఈసీ సభ్యులు పితాని బాలకృష్ణ తెలిపారు. డీఎస్సీలో అక్రమాలతో నిరుద్యోగు లను మోసం చేసిందన్నారు. మహిళలకు రూ.18వేలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. డీఎస్సీలో అక్రమాలపై సీబీఐతో పూర్తి స్థాయి విచారణ చేసి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి బాబి,కాశి మునికుమారి, రెడ్డి సతీష్, పెట్ల సూర్యనారాయణ రాజు, రేవు నాగేశ్వరరావు, కాశి లక్ష్మణస్వామి,వెంటపల్లి నూకరాజు, ఉంగరాల సంతోష్, పందిరిపల్లి రాజేష్, రేవు మల్లీశ్వరి, కొక్కిలిగడ్డ లోకేష్, పోతుల రత్నకుమారి, గుత్తుల శ్రీను, బొంతు మోహన్, పంపన రామకృష్ణ, కొల్లు శ్రీను, మోకా మధు, కుడిపూడి దుర్గారావు, పిల్లి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగలలో ప్రశాంతంగా కొనసాగిన మన్యం బంద్

**దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేత పోలీసుల భారీ బందోబస్తు ఆదివాసీల భారీ ర్యాలీ**

**అడ్డతీగల, ఆగస్టు 08, ప్రభాతవార్త** మన్యం బంద్ పిలుపు మేరకు అడ్డతీగల మండల కేంద్రంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. బంద్కు మద్దతుగా వర్తక, వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి సహకరించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలీస్ భద్రత నడుమ ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. ఆదివాసీ నాయకుడు సింగిరెడ్డి అచ్చారావుతో పాటు పలువురు ఆదివాసీ ప్రముఖులు, నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ యం. శిరీషాదేవి**



**రాజవొమ్మంగి, ఆగస్టు 08, ప్రభాత వార్త** రాజవొమ్మంగి మండలం లబ్బర్తి, సీతారామపురం గ్రామాల్లో శనివారం మండల టిడిపి అధ్యక్షులు, ఏ. పి. ఐ. ఐ. సి. డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన "రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి" ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పాల్గొని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్లు, దీపం పథకం, తల్లికి వందనం, రైతులకు ఎరువుల సరఫరా, అన్నదాత సుఖీభవ-- పీఎం కిసాన్ తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఐ. ఐ. సి.డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ్, టీడీపీ నాయకులు గణజాల తాతారావు, ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ఏ. యం. సి.చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి సురేష్, తేజ, గొర్లె సీతాంబరం, వెంకటరమణ, గిడుతూరు శ్రీను, లోకరపు సత్తిబాబు, జీరెడ్డి రాంబాబు, గణేషుల పెద్దిరాజు, పెట్ల అప్పలరాజు, మానవ అప్పారావు, లోకరపు శివపార్వతి, బత్తిన రాజేశ్వరి, వాడపల్లి అమ్మాజీ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీ ఉమా మందేశ్వర(శనీశ్వర)స్వామి వారికి తైలాభిషేకములు

**స్వామి వారికి రూ 3.40 లక్షల ఆదాయం**



**కొత్తపేట, ఆగస్టు 08,(ప్రభాతవార్త)** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసి యున్న పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమా మందేశ్వర (శనేశ్వర) స్వామివారికి శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని తైలాభిషేకములు సర్వదర్శనములు ప్రత్యేక పూజలు భక్తుల నిర్వహించారు ధర్మాదాయ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అలాగే ఆలయ కార్య నిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్ బాబు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు స్వామి వారికి పరోక్ష పూజలు ప్రత్యక్ష పూజలు ద్వారా మొత్తం రు 3 లక్షల 40 వేల 586 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు

# రాళ్లకాల్వ అవుట్ఫాల్ స్లూయిస్ ప్రారంభం..



**సఖినేటిపల్లి ఆగస్టు 8, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామ పరిధిలో వశిష్ట గోదావరి ఎడమగట్టు పై రూ. 2.85 కోట్లతో పునఃనిర్మించిన రాళ్లకాల్వ అవుట్ఫాల్ స్లూయిస్ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేడు ప్రారంభించారు. 75 సంవత్సరాల క్రితం నిర్మించిన రాళ్లకాల్వ స్లూయిస్ ను డబుల్ రోడ్డు వెడల్పు, 4 తూముల తో రూ. 2.85 కోట్ల వ్యయంతో పునఃనిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ స్లూయిస్ పునః నిర్మాణంతో రైతులకు సాగునీటి నిర్వహణ లో మరింత సౌకర్యం కలగనుంది. రూ. 3.20 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న కడలి స్లూయిస్ను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని డ్రయిన్, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తనవంతు కృషి చేస్తానని, త్వరలో 10 కోట్ల రూ.ల ఇంకా రెండు స్లూయేజ్ లు నిర్మించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, డీసీ చైర్మన్ ఆకన బాబ్జీ నాయుడు, గుబ్బల ఫణి, ఎంపీపీ మల్లిబాబు, ఎంపిటీసీలు నాగరాజు, బాబూరావు, టి ఆచార్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

**గోపాలపురంలో వైసీపీ శ్రేణుల డిమాండ్**



**గోపాలపురం, ఆగస్టు 08 (ప్రభాతవార్త):** డీఎస్సీ--2025 నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో గోపాలపురంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వైఎస్ జగన్ పిలుపు మేరకు నిర్వహించిన దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలపురం మండల పార్టీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. డీఎస్సీ--2025 నియామక ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సీబీఐచే విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పరీక్షల ద్వారా 16,827 మంది అభ్యర్థులను నియమించాల్సి ఉండగా, 267 పోస్టుల్లో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. క్రీడల కోటా, ఇతర కోటాల పేరుతో టీడీపీ అభిమానులు, కార్యకర్తలకు పోస్టులు కట్టబెట్టారని ఆరోపించారు. దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ.. జగన్ హయాంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఎలాంటి అవినీతికి తావులేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించామని గుర్తు చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఢిల్లీలో జరిగిన ఆందోళనను ప్రస్తావిస్తూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసినట్లుగానే, డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెల్లంకి సుబ్రహ్మణ్యం, కూరుకూరి నాగేశ్వరరావు, కూసం రామ్మోహన్రెడ్డి, ముల్లంగి శ్యాం, ముచ్చకర్ల రవి, పచ్చా గోపాల్ తదితరులు మాట్లాడుతూ.. డీఎస్సీ విషయంలో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టి, నినాదాలు చేశారు. గన్నమని జనార్ధరావు, కూచిపూడి సతీష్, బండి కనకదుర్గ, హైమావతి, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చినకొండేపూడిలో ఉచిత వైద్య శిబిరం



**సీతానగరం, ఆగస్టు 08, (ప్రభాతవార్త) :** మండలంలోని చినకొండేపూడి గ్రామంలో శ్రీ రామకృష్ణా వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దంత, కంటి, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కాండ్రు శేఖర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్స్ పప్పుల సురేష్, యడవల్లి పద్మనాభం, సీఈఓ పేరిచర్ల సుబ్బరాజు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# దుర్గాడ శివాలయంలో వైభవంగా పందిరి రాట మహోత్సవం

## ప్రారంభమైన స్వర్ణ బ్రహ్మోత్సవాలు

**గొల్లప్రోలు ఆగస్టు 8,(ప్రభాతవార్త):** దుర్గాడ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయం శనివారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ ఆలయ ప్రతిష్ఠాపన జరిగి 50 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, ఈ ఏడాది స్వామివారికి అత్యంత ప్రతిష్టాత్మకంగా "స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు" నిర్వహిస్తున్నారు. ఈ మహోత్తర ఉత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో "పందిరి రాట" మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ భూమి పూజ చేసి పందిరి రాటను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంతో దుర్గాడ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రతిష్ఠాపన యాభై ఏళ్లు పూర్తి చేసుకున్నందున, ఈ ఏడాది ఉత్సవాలను మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వసన్నద్ధమైంది. ఇందులో భాగంగా ఈసారి ఆలయంలో విశేషంగా 108 భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భజన బృందాలతో ఈ కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శనివారం జరిగిన ఈ పందిరి



రాట మహోత్సవంలో స్థానిక భక్తులు, మహిళలు, భజన సమాజాల సభ్యులు, మరియు ఆలయ సేవా సమితి బృందం పాల్గొన్నారు. స్వామివారికీ, అమ్మవారికీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భజన బృందాల కీర్తనలు, మంగళ హారతులు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఆలయ పరిసరాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

కూనవరం మండలంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో

## మన్యం బంద్ విజయవంతం



**కూనవరం, ఆగస్టు 8, ప్రభాతవార్త :** పోలవరం జిల్లా కూనవరం మండలంలో శనివారం ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో మన్యం బంద్ విజయవంతమైంది. ఆదివాసి చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని, 1/70 చట్టం పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు లో ఎంప్లిట్ పిటిషన్ ప్రభుత్వం దాఖలు చేయాలని, ఏజెన్సీ ఆదివాసులకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్లతో మన్యం బంద్ నిర్వహించడం జరిగింది.బంద్ సందర్భంగా మండలంలోని అన్ని వ్యాపార సంస్థల, వాణిజ్య కలాపాలు, రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ఉదయం నుండి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లపై బైఠాయించారు. అనంతరం నినాదాలతో ప్రదర్శన నిర్వహించి స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల మహిళా ప్రతినిధులు, పాల్గొన్నారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై బొడ్డు రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## బిజెపి కార్యకర్తల సమావేశం...



**సఖినేటిపల్లి ఆగస్టు 8, ప్రభాత వార్త :** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు పోతురాజు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస నగేష్, పార్టీ ఇంచార్జ్ చెల్లింగ్ త్రినాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరు అయ్యే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కి సింహభాగం నిధులను వెచ్చించి అభివృద్ధి సంక్షేమాన్ని ముందుకు తీసుకు వెళుతుందని, ఎన్డీఏ ప్రభుత్వం వల్లే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు బోను నాయుడు, పోతురాజు నాగరాజు, రాష్ట్ర నాయకులు చింపాటి శివరామకృష్ణంరాజు, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సుబ్బరాజు, ఎనుముల సుబ్బారావు, పట్టపు సూర్యప్రకాశరావు, రుద్రరాజు రామకృష్ణ రాజు, ఎనుముల గణపతిరావు, రావూరు బాబ్జి, మాలే పండు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజాదర్బార్ లో రైతులకు రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ



**గోకవరం: ఆగస్టు 8 ప్రభాత వార్త :** ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం గోకవరం మండలం మల్లవరం గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. ఇదే కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. వ్యవసాయం, అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతుకు తన భూమిపై హక్కును నిర్ధారించేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు.సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, ఎస్ఏఎస్ అప్పలరాజు, స్టేట్ అర్బన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, మండల పార్టీ అధ్యక్షులు పెంట చంటిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జులు పురంశెట్టి శివాజీ, బద్దిరెడ్డి బాబి, దాసరి సీతారాం, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు బత్తుల సత్తిబాబు, మాజీ సర్పంచ్ విదుదల అర్జునరావు, గణ్ణ రాము, బోదిరెడ్డి సుబ్బారావు, సుమన్ సత్యం రాజు, ఎంపీటీసీ మరిసె అరుణ అప్పారావు, మండిగ గంగాధర్, ఎస్. బాబు, గండం శివ, అడబాల రాజు, సింగరయ్య, దిండి రాజు, మాగంటి గంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 10న 'జైల్ భరో'ను జయప్రదం చేయండి

దేవరపల్లిలో వామపక్షాలు, కార్మిక సంఘాల పిలుపు



**దేవరపల్లి, ఆగస్టు 8( ప్రభాతవార్త):** కార్మికులు, రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న తలపెట్టిన దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక దేవరపల్లిలో ఐఎఫ్ టియు నాయకుడు సి.హెచ్. రమేష్ అధ్యక్షతన కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు మద్దతు ధర కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ కంపెనీల కోసం చేపడుతున్న బలవంతపు భూసేకరణను తక్షణమే ఆపాలని కోరారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపట్టే ఈ జైల్ భరో ఆందోళనలో కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జైలు భరో కార్యక్రమం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకుడు భగత్, సీపీఐ(ఎం) నాయకుడు రత్నాజీ, రైతు సంఘం నాయకుడు పిన్నమని సత్యనారాయణ, ఐఎఫ్ టి యు నాయకుడు పి.నాగేశ్వరరావు, సీపీఐ నాయకుడు చింతల వెంకట సత్యనారాయణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించిన తుమ్మలపల్లి



**గండేపల్లి, ఆగస్టు 8. ప్రభాతవార్త** గండేపల్లి మండలం కె గోపాలపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ జనసైనికుడు మొరుసుపల్లి వెంకన్న ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకన్న చిత్రపటానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం జనసేన పార్టీ తరఫున వెంకన్న కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని తుమ్మలపల్లి రమేష్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను,సూరంపాలెం బాలు,అంకం ఓం కృష్ణ,అగ్గె వీరబాబు,గొల్లవిల్లి కొండ,గోపాల దేవి,జనసైనికులు పాల్గొన్నారు.

## ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టేందుకే 1/70 చట్టంపై పాలకుల కుట్రలు

### ఏజెన్సీలో మన్యం బంద్ విజయవంతం
### రోడ్లపై రేలా ఆడిన ఆదివాసీ గిరిజన మహిళలు



**వి.ఆర్.పురం, ఆగష్టు8 ,ప్రభాతవార్త** ఏజన్సీలోని వేల కోట్ల విలువైన భూగర్భ ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి కొల్లగొట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1/70 చట్టం నిర్వీర్యానికి కుట్రలు చేస్తున్నాయని, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యాదర్శి పులి.సంతోష్ కుమార్ తీవ్ర స్వరంతో ఆరోపించారు. 1/70 చట్టం పరిరక్షణ, 3 జిఒ స్థానంలో ప్రత్యామ్నాయ జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేస్తు, శనివారం ఆదివాసీ గిరిజన సంఘాలు నిర్వహించిన మన్యం బంద్ వి.ఆర్.పురం మండలంలో విజయవంతమైంది. సిపిఎం అనుబంధ ఆదివాసీ గిరిజన సంఘం (ఎజిఎస్) తలపెట్టిన మన్యం బంద్ కు, మన్యంలోని అన్ని రాజకీయ పార్టీల గిరిజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపి బంద్ నిర్వహించాయి. గిరిజన సంఘాల ముఖ్య నాయకులు మండల కేంద్రం రేఖపల్లి అమరవీరుల స్థూపం సెంటర్ లో ప్రధాన రహదారిపై కూర్చుని బంద్ పాటించగా, గ్రామాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరుకొని బంద్ నిర్వహించారు. భద్రాచలం దివంగత మాజీ ఎమ్మెల్యే సున్నం.రాజయ్య స్వగ్రామం సున్నంవారిగూడెం గ్రామం వద్ద చింతూరు – వి.ఆర్.పురం ప్రధాన రహదారిని ఆదివాసీ గిరిజన మహిళలు పూర్తిగా స్తంభింపచేసి, రోడ్డుపై రేలా ఆడిన దృశ్యం మన్యం బంద్ లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆదివాసీ గిరిజన సంఘాలు బంద్ కోసం 4 రోజులు ముందుగానే పిలుపునిచ్చి, విస్తృత ప్రచారం చేయటంతో, హోటళ్ళు, వివిధ వ్యాపార, వాణిజ్య సముదాయాలన్నీ పూర్తిగా మూతబడ్డాయి. రోడ్లపై వాహనాల రాకపోకలను సైతం ఎక్కడికక్కడ ఆందోళన కారులు అడ్డుకోవడంతో, రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. దీంతో మన్యం బంద్, మన్యంలో విజయవంతమైంది.

**అంతం కాదిది ఆరంభం మాత్రమే : ఆదివాసీ సంఘాల నేతలు .........**

తెల్లదొరలపై నాటి స్వాతంత్ర్య పోరాటం నుండి మొదలుకొని, ప్రాణాలను ప్రాణంగా పెట్టి అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర మన్యంలోని ఆదివాసీ గిరిజనులకు ఉందని, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సున్నం.రాజులు, పూనెం.ప్రతీఫ్ కుమార్, పిట్టా.రామారావు, చిక్కాల.బాలు, పాయం.లక్ష్మణ్ రావు లు అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఎన్నో పోరాటాలను చవిచూసిన తమకు 1/70 చట్టాన్ని కాపాడుకోవటం కోసం పోరాటం చేయటం పెద్ద కష్టం కాదన్నారు. 1/70 పరిరక్షణ, 3 జిఒ స్థానంలో ప్రత్యామ్నాయ జిఒ సాధన కోసం తాము చేస్తున్న ఈ పోరాటం అంతం కాదిది ఆరంభం మాత్రమేనని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం.లక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సోయం.చిన్నబాబు, పులి.బొజ్జి, పులి.కన్నయ్య, ఆసు.లక్ష్మయ్య, కారం.సుందరయ్య, ఆత్మకూరి కాంతారావు, తొడం.రాజు, కారం.సత్తిబాబు, చిచ్చడి.బాబురావు తదితర నాయకులు, ఆదివాసీ కుల పెద్దలు పాల్గొన్నారు.

## గోపాలపురం లో ఏటిగట్టు వెంబడి పారిశుద్ధ్య పనులు

కుళ్లిన వాసనతో ప్రజల ఇబ్బందులు



**రావులపాలెం, ఆగస్ట్ 08 (ప్రభాతవార్త) :** గోదావరి వరద నీరు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఏటిగట్టు వద్దకు చేరిన నీరు నిలిచి దుర్వాసన రావడంతో గోపాలపురం లో గట్టును ఆనుకుని నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటిగట్టు వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను సిబ్బంది తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం నీరు నిలిచిన ప్రాంతాలు, గట్టు పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గోదావరి వరదలు తగ్గిన అనంతరం నీరు నిలిచే ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## పేకాట శిబిరం పై పోలీసులు దాడి



**గండేపల్లి. ఆగస్టు 8. ప్రభాతవార్త** గండేపల్లి మండలం యర్రం పాలెం గ్రామ శివారున పామాయిల్ తోటలో పెద్దాపురం, సామర్లకోట, గండేపల్లి జగ్గంపేట, రంగంపేట ఐదు మండలాలకు సంబంధించి పేకాడుతున్న 10 మంది పేకాటరాయుళ్ల ను అరెస్టు చేసినట్లు గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం 1-52 లక్షల నగదు,12 ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్స్ స్వాధీనపర్చుకుని,వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో పేకాట శిబిరాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు జరగకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో మాదకద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన సదస్సు



**గండేపల్లి. ఆగస్టు 8. ప్రభాతవార్త** సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా నార్కోటిక్ డ్రగ్స్ విభాగం అధ్యాపకులు బి.వి.ఎస్.ఎస్. ఉదయనాథ్, పాల్గొని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత పై వాటి ప్రభావం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆదిత్య యూనివర్సిటీ డీన్ -- స్టూడెంట్ అఫైర్స్ డా. కిషోర్, ఆదిత్య యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. కన్వీనర్ డా. వీరాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే అసోసియేట్ డీన్ విలాస్ అనిల్ చవాన్, డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ పి.వి. నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు తమ సందేశాన్ని అందించారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని ముఖ్య అతిథులు పేర్కొన్నారు.

## కడియం నర్సరీ రైతులకు అందుబాటులోకి డీఏపీ

---ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి



**కడియం, ఆగస్టు 8 (ప్రభాతవార్త)** కడియం మండలంలోని నర్సరీ రైతులకు డీఏపీ ఎరువు అందుబాటులోకి వచ్చింది. సాంకేతిక కారణాలతో గత నెలలో ఏపీఐఏఐఎంఎస్ యాప్‌లో డీఏపీ నిలిచిపోవడంతో నర్సరీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు.కడియం మండలం పరిధిలో సుమారు 4,300 ఎకరాల్లో నర్సరీల సాగు జరుగుతోంది. నర్సరీల నిర్వహణలో డీఏపీ కీలకమైన ఎరువుగా ఉండటంతో దీని సరఫరా నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. జూన్ వరకు డీఏపీ అందుబాటులో ఉన్నప్పటికీ, జూలైలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఏపీఐఏఐఎంఎస్ యాప్‌లో అందుబాటులో లేకపోవడంతో పంపిణీ నిలిచిపోయింది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని ఉద్యానవన, వ్యవసాయ శాఖ డైరెక్టర్లతో మాట్లాడి కడియం నర్సరీ రైతులకు డీఏపీ సరఫరా పునరుద్ధరించేలా చర్యలు చేపట్టారు. దీంతో శనివారం నుంచి ఏపీఐఏఐఎంఎస్ యాప్‌లో డీఏపీ అందుబాటులోకి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.నర్సరీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన మేరకు డీఏపీ పొందాలని ఆయన సూచించారు. నర్సరీ రైతులకు ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు

## మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గోరంట్ల.



**కడియం, ఆగస్టు 8 ( ప్రభాతవార్త)** రూరల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం వేమగిరి గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, 'రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. వేమగిరి గట్టు ప్రాంతంలో గ్రామ పంచాయతీ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.65 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దేవి జనార్దన్ నగర్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు, జక్కంపూడి నగర్‌లో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే వేమగిరి తోట ప్రాంతంలో గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ పథకం, రాజమహేంద్రవరం పట్టణాభివృద్ధి సంస్థ నిధులు రూ.1.80 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే గోరంట్ల.. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వారి అభిప్రాయాలను స్వీకరించారు.

**అంగన్వాడీ కేంద్రం పరిశీలన**

వేమగిరిలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తను అభినందించారు.అనంతరం గ్రామానికి మంజూరైన తడి, పొడి చెత్త సేకరణ ఎలక్ట్రికల్ ఆటోలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కడియం మండల తెదేపా అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, మండల జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమ్మి, రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, రాష్ట్ర రైతు నాయకుడు అన్నందేవుల చంటి, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, పాఠంశెట్టి రాంజీ, గట్టి నరసయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాంధానీ చేనేత చీరల కళా నైపుణ్యం అద్భుతం

ప్రముఖ సినీ నటులు కృష్ణంరాజు సతీమణి



**యు.కొత్తపల్లి, ఆగస్టు 8 (ప్రభాతవార్త) :** ఉప్పాడ జాంధానీ చేనేత చీరల కళా నైపుణ్యం అద్భుతమని ప్రముఖ సినీ నటుడు దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి కొనియాడారు. మండలంలోని ఉప్పాడ లో ఉన్న చేనేత సొసైటీలో జాంధానీ చీరలు, మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పాడ చీరలు మక్కువని, తాను చేనేత చీరలను అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తుంటానన్నారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

## బిజెపి యువమోర్చా మండల అధ్యక్షులుగా మాలోత్ సాయికుమార్..



**ఎటపాక: ఆగస్టు 8 ( ప్రభాత వార్త):** మండల పరిధిలోని గుండు వారి గూడెం గ్రామానికి చెందిన మాలోత్ సాయి కుమార్ ను భారతీయ జనతా యువమోర్చా ఎటపాక మండల అధ్యక్షులుగా జిల్లా అధ్యక్షులు ఈక బుల్లి కొండల దొర రాష్ట్ర కార్యదర్శి ఈ స్వప్న కుమారి సమక్షంలో ప్రకటన చేయడం జరిగింది. సాయికుమార్ ని మండల అధ్యక్షులుగా ప్రకటించినందుకు గుండు వారి గూడెం లో ఉన్న బిజెపి కార్యకర్తలు సమక్షంలో వారిని శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి ఎటపాక మండల అధ్యక్షులు నల్లజాల శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాయికుమార్ మాట్లాడుతూ నాకు యువమోర్చా మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు ఈక బల్లికొండలు దొర గారికి బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ స్వప్న కుమారి కి ఎటపాక మండల అధ్యక్షులు నలజాల శ్యాం ప్రసాద్ కి యువ మోర్చా జిల్లా నాయకులు మూడే సతీష్ కుమార్ కి మండలంలో ఉన్న సీనియర్ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు నాకు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీలో కార్యకర్తలు పెంచడానికి అహర్నిశల శ్రమించి పనిచేస్తానని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో లావుడ్య రవీందర్, మాలోత్ విజయ్, మాలోత్ రవి, బోడ రవి, జరుపుల నవీన్, బానోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు

## డిప్యూటీ సీఎం పవన్ ను కలిసిన మల్లాడి రాజేంద్ర



**కాకినాడ రూరల్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కాకినాడ సిటీ జనసేన నాయకులు, డా. మల్లాడి రాజేంద్ర ప్రసాద్ హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ప్రకటించి, ప్రతిష్టాత్మకంగా నిర్వహించినందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మల్లాడి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ గొప్ప ఆయుర్వేద వైద్యులు, సామాజిక సంస్కర్త, ప్రజా సేవకులు, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను, జీవిత విశేషాలను పవన్ కళ్యాణ్ వివరించినట్లు తెలిపారు. "పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవా స్ఫూర్తితో మనం పనిచేద్దామని, అగ్నికుల క్షత్రియులకు తాను అండగా ఉంటానని పవన్ కళ్యాణ్ తెలిపారన్నారు. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ మునిమనవడిగా ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ సమాజ సేవలో తాను చేస్తున్న కార్యక్రమాలను మల్లాడి రాజేంద్ర ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కు వివరించి పొన్నమండ చిత్రపటాన్ని, ఆయన చరిత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు బహూకరించారు.

## సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.



**అనపర్తి ఆగస్టు 8(ప్రభాతవార్త)** అనపర్తిలో 2 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన 11 సీసీ రోడ్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనపర్తి టౌన్ మహాలక్ష్మిపేట, కుమ్మరి వీధి, బాపనమ్మ గుడి వీధి,అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా,ఆంజనేయ నగర్, కొత్తూరులలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం సమీక్షించి బాధ్యులను శిక్షించాలి

డీఎస్సీ అభ్యర్థుల రిలే నిరాహార దీక్షలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



**తుని,ఆగష్టు 8,( ప్రభాతవార్త )** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగాడిఎస్సి లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం సమీక్షించి అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. తుని నియోజకవర్గ వైసిపి ఆధ్వర్యంలో శనివారం తుని పట్టణంలో నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థుల రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా పేరుతో అవకతవకకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రవిద్యాశాఖ మంత్రి డీఎస్సీలో జరిగిన అవకతవకులపై సమీక్షించి బాధ్యులను శిక్షించాలని, లేనిపక్షంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద మధ్యతరగతి అభ్యర్థులు ఎన్నో ఆశలు పెట్టుకుని డీఎస్సీ పరీక్షలు రాశారని, వాళ్లని నిరాశపరిచే రీతిలో డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు భృతి కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటు పడిందని ఆరోపించారు. తుని నియోజకవర్గంలోని కోటనందూరు,తొండంగి, తుని మండలాల్లోని డీఎస్సీ అభ్యర్థులు, యువత రిలే నిరాహార దీక్షలో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గంలోని వైసిపి నేతలు, కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**రామచంద్రపురం, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** హసన్‌బాదలో చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.చేనేత నాయకుడు దొంతంశెట్టి సత్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత దివంగత చేనేత నాయకుడు దొంతంశెట్టి విరూపాక్షం విగ్రహానికి నివాళులర్పించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని వాసంశెట్టి సత్యం తెలిపారు. కార్మికుల ఖాతాల్లో రూ.25 వేల చొప్పున జమ చేసినట్లు చెప్పారు. అనంతరం చేనేత కార్మికులు, సంఘ సభ్యులను సత్కరించారు. విరూపాక్షం పేరిట ఏటా అందించే అవార్డును ఈసారి దుర్గా రమేష్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చేనేత నాయకులు బట్ట శ్రీనివాస్, త్రిమూర్తులు, కాలెపు ఓం నమః శివాయ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పల్లాలమ్మ తల్లికి వెండి వస్తువులు బహుకరణ



**కొత్తపేట, ఆగస్టు 08, (ప్రభాతవార్త)** మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పళ్ళాలమ్మ అమ్మవారికి భక్తులు వెండి వస్తువులు బహుకరించారు విశాఖపట్నం కు చెందిన మౌనిక తులం బరువు గల వెండి సూత్రాలు అమ్మవారికి సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సలాది సత్య మహేంద్ర తెలిపారు వారికీ ఆశీర్వచనం అందజేసి అమ్మవారి చిత్రపటం ?అందచేసినట్లు అలాచిత్రపటంస్రములతో సత్కరించినట్లు ఈవో తెలిపారు కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మద్ధింశెట్టి ఆదినారాయణ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

## మారేడుమిల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

భార్యాభర్తలు దుర్మరణం.. అనాథగా ఐదేళ్ల బాలుడు

**రంపచోడవరం/ మారేడుమిల్లి, ఆగస్టు 8: ప్రభాతవార్త.** మారేడుమిల్లి మండలంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఐదేళ్ల బాలుడు సందీప్ అనాథగా మిగిలాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన కొల్లేటి శ్రీను (45), ఆయన భార్య కొల్లేటి శోభారాణి (40) మారేడుమిల్లి పర్యటనకు వచ్చారు. పర్యటన అనంతరం బైక్‌పై రంపచోడవరం వైపు తిరిగి వెళ్తుండగా మారేడుమిల్లి సమీపంలోని చీకటి గొప్పు వద్ద ఎదురుగా వస్తున్న కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను, శోభారాణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps